# భారత శక్తి

VOICE OF INDIAN

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి : 20 | సంచిక : 302 | ఆదివారం,మే 24 , 2026 | పేజీలు : 12 | వెల : 1.00


## మోదీతో మార్కో రూబియో కీలక చర్చలు..
## అమెరికా రావాలని ఆహ్వానం



**న్యూఢిల్లీ (భారత శక్తి)**నాలుగు రోజుల భారత పర్యటనకు వచ్చిన అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో శనివారం ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. వాణిజ్య, భద్రత సహా కీలక రంగాలపై చర్చలు జరిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ట్రంప్ తరఫున మోదీని వైట్‌హౌస్‌కు ఆహ్వానించారు. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చాక భారత్–అమెరికా మధ్య వాణిజ్యం విషయంలో విభేదాలు తలెత్తిన విషయం తెలిసిందే. మరోవైపు

2లో..


## తెలంగాణలోనే అతిపెద్ద వేద పాఠశాలకు
# భూమిపూజ

**- రూ.99.55 కోట్ల అభివృద్ధి పనులకు సీఎం శ్రీకారం**



**హైదరాబాద్ (భారత శక్తి)**యాదాద్రి భువనగిరి జిల్లాప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పరిధిలో తెలంగాణలోనే అతిపెద్ద వేద పాఠశాల సముదాయ నిర్మాణానికి శనివారం అత్యంత వైభవంగా భూమిపూజ మహోత్సవం నిర్వహించారు. శంకర విజయేంద్ర సరస్వతి స్వామి దివ్య సమక్షంలో జరిగిన ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో ఎ. రేవంత్ రెడ్డి పాల్గొని భూమిపూజ నిర్వహించారు.యాదగిరిగుట్ట టెంపుల్ సిటీని తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ఈ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టినట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ సందర్భంగా రూ.99.55 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు ఆలయ అనుబంధ అభివృద్ధి పనులకు కూడా శంకుస్థాపనలు చేశారు.తెలంగాణలోనే అతిపెద్ద వేద పాఠశాల సముదాయాన్ని రూ.43.80 కోట్ల అంచనా వ్యయంతో 15 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్నారు. సంప్రదాయ ఆశ్రమ గురుకుల పద్ధతిలో 300 మంది విద్యార్థులకు వసతితో కూడిన వేద విద్య అందించేందుకు ఈ పాఠశాల రూపొందించబడుతోంది. ఇందులో హోమాలు, యాగాలు నిర్వహించేందుకు ప్రత్యేక శాలలు, గోశాల కూడా ఏర్పాటు చేయనున్నారు.ఇదే సమయంలో భక్తుల సౌకర్యార్థం పలు కీలక నిర్మాణాలకు కూడా ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. రూ.43.12 కోట్లతో డార్మిటరీ హాల్స్, దీక్షాపరుల సదనం నిర్మాణం, కొండపై స్వామివారి నిత్య కల్యాణాల నిర్వహణ కోసం రూ.9.87 కోట్లతో భారీ కల్యాణ మండపం, వైకుంఠ ద్వారం నుంచి కొండపైకి వెళ్లే మెట్ల మార్గానికి రూ.1.41 కోట్లతో రక్షణ పైకప్పు కానోపీ, రథశాల వైపు మాడవీధులకు అనుసంధానంగా రూ.1.35 కోట్లతో కొత్త మెట్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.ఈ కార్యక్రమంలో గుత్తా సుఖేందర్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డితో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# డిజిటల్ దుమారం
# 'బొద్దింక' గర్జన




- సోషల్ మీడియాను షేక్ చేస్తున్న 'కాక్‌రోచ్ జనతా పార్టీ' (CJP)
- కేవలం వారం రోజుల్లోనే 2 కోట్ల మంది ఫాలోవర్లు.. బీజేపీ, కాంగ్రెస్‌లను దాటేసిన వైనం
- యువతను 'బొద్దింకల'తో పోల్చిన సీజేఐ వ్యాఖ్యలపై వ్యంగ్యాస్త్రం.. డిజిటల్ విప్లవంగా మారిన వైనం
- ఐటీ దాడులు, హ్యాకింగ్ కలకలం.. బెంగళూరులో ఆంక్షలు!

**హైదరాబాద్ మే 23 భారత శక్తి:** భారత రాజకీయ ముఖచిత్రంలో ఎన్నడూ చూడని ఒక సరికొత్త డిజిటల్ విప్లవం దేశాన్ని ఊపేస్తోంది. ఎలాంటి జెండాలు, అజెండాలు, భారీ సభలు లేకుండానే.. కేవలం మీమ్స్, రీల్స్, వ్యంగ్యాస్త్రాలతో పుట్టుకొచ్చిన ఒక అనామక గ్రూప్ ఇప్పుడు దేశంలోనే అతిపెద్ద సోషల్ మీడియా శక్తులలో ఒకటిగా అవతరించింది. అదే లి'కాక్‌రోచ్ జనతా పార్టీ' (జబ్పీ)లి. కేవలం 6 రోజుల్లోనే ఇన్‌స్టాగ్రామ్‌లో 2 కోట్లకు పైగా ఫాలోవర్లను సంపాదించుకుని, దేశంలోని అతిపెద్ద అధికార పార్టీ అయిన బీజేపీ (8.7 మిలియన్లు), కాంగ్రెస్ పార్టీల రికార్డులను తిరగరాసి దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది.

### ఎలా మొదలైంది? ప్రారంభించింది ఎవరు?

మే 15న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (CJI) జస్టిస్ సూర్యకాంత్ ఒక కేసు విచారణ సందర్భంగా.. నిరుద్యోగ యువత తప్పుడు డిగ్రీలతో ఆర్టీఐ యాక్టివిస్టులుగా, జర్నలిస్టులుగా మారి వ్యవస్థపై దాడి చేస్తున్నారని, వారు సమాజానికి 'బొద్దింకలు', 'పరాన్నజీవులు' లాంటి వారని వ్యాఖ్యానించినట్లు వార్తలు వచ్చాయి (తర్వాత ఆయన దీనిపై వివరణ ఇచ్చుకున్నారు).ఈ వ్యాఖ్యలు దేశంలోని కోట్లాది మంది నిరుద్యోగ యువత మనోభావాలను తీవ్రంగా గాయపరిచాయి. దీనికి నిరసనగా మహారాష్ట్రకు చెందిన 30 ఏళ్ల డిజిటల్ పొలిటికల్ స్ట్రాటజిస్ట్ 'అభిజీత్ దీప్కే' (గతంలో ఆమ్ ఆద్మీ పార్టీ సోషల్ మీడియా టీంలో పనిచేసిన అనుభవం ఉన్న యువకుడు) మే 16న వ్యంగ్యంగా 'కాక్‌రోచ్ జనతా పార్టీ'ని ప్రకటించారు. "మమ్మల్ని బొద్దింకలు అన్నారా? సరే.. మేము బొద్దింకల పార్టీనే పెడతాం" అంటూ ఆయన పెట్టిన పోస్ట్ కార్చిచ్చులా వ్యాపించింది.

### ఎందుకోసం ప్రారంభించారు?
### (CJP డిమాండ్లు)

ఇది ఒక వ్యంగ్య (Satirical) రాజకీయ ఉద్యమం. దీని మేనిఫెస్టో కూడా అంతే వ్యంగ్యంగా, సూటిగా ఉంది. 'సోమరిపోతులు, నిరుద్యోగులు, రోజంతా ఆన్‌లైన్‌లో ఉండే యువత గొంతుక' అని ఈ పార్టీ ప్రకటించుకుంది. ఇందులో చేరాలంటే నిరుద్యోగి అయి ఉండాలి, రోజుకు 11 గంటలు ఆన్‌లైన్‌లో గడపాలి అనే క్రైటీరియా పెట్టారు.

### వీరి ప్రధాన ఐదు డిమాండ్లు:

1. ప్రధాన న్యాయమూర్తులకు పదవీ విరమణ తర్వాత రాజ్యసభ సీట్లు ఇవ్వకూడదు.
2. ఓటర్ల జాబితా నుంచి సరైన ఓట్లను తొలగిస్తే ఎన్నికల అధికారులను ఉపా (UAPA) చట్టం కింద అరెస్ట్ చేయాలి.
3. పార్లమెంట్‌లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి.
4. పెద్ద వ్యాపార సంస్థల యాజమాన్యాల్లో ఉన్న మీడియా సంస్థల లైసెన్సులు రద్దు చేయాలి.




5. పార్టీలు మారే ఎమ్మెల్యేలు, ఎంపీలపై 20 ఏళ్ల పాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధం విధించాలి.
6. దేశంలో 'రైట్ టు ఎంప్లాయ్‌మెంట్' (ఉపాధి హక్కు చట్టం) తెచ్చి, ఉద్యోగం ఇవ్వలేకపోతే నిరుద్యోగ భృతి ఇవ్వాలి.

### పబ్లిక్‌లో ఆదరణ..
### కేంద్రం ఎందుకు భయపడుతోంది?

దేశంలో విద్యావంతులైన యువత నిరుద్యోగంతో, నీట్ (NEET) లాంటి పరీక్షల్లో జరుగుతున్న అక్రమాలతో తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. జబ్పీ ఆ అసంతృప్తిని 'మీమ్ కల్చర్' ద్వారా సరిగ్గా క్యాచ్ చేసింది. కేవలం ఆన్‌లైన్ ఫాలోవర్లే కాకుండా, దాదాపు 3.5 లక్షల మంది యువకులు గూగుల్ ఫారమ్స్ ద్వారా ఈ పార్టీలో సభ్యులుగా చేరారు. ఢిల్లీలోని యమునా నది క్లీనింగ్ వంటి సామాజిక కార్యక్రమాల్లో బొద్దింకల కాస్ట్యూమ్స్ వేసుకుని యువత పాల్గొనడం మొదలుపెట్టారు.సంప్రదాయ రాజకీయ పార్టీలు కోట్ల రూపాయలు ఖర్చు పెట్టినా రాని ఫాలోయింగ్ ఈ సీజేపీకి రావడంతో కేంద్రంలో చలనం మొదలైంది. నిరుద్యోగంపై యువత ఇలా ఏకమవడం రేపటి

2లో..

## 50 శాతం గ్రీన్ కవర్ ఉండాలని చెప్పాము

- గ్రేట్ గ్రీన్ వాల్ లాంటి ప్రతిష్ఠాత్మక కార్యక్రమాలు కూడా ముందుకు తీసుకు వెళ్లలేరా?
- అటవీ శాఖ ఉన్నతాధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించిన ఉప ముఖ్యమంత్రి పవ్ కళ్యాణ్



**అమరావతి(భారత శక్తి)** రాష్ట్రంలో 50 శాతం గ్రీన్ కవర్ ఉండాలి... పర్యావరణ పరిరక్షణలో పచ్చదనం పెంపు ఎంతో కీలకం. గ్రేట్ గ్రీన్ వాల్ ప్రాజెక్ట్ చేపట్టాము. ఆ కార్యక్రమాలను ముందుకు తీసుకువెళ్లలేరా? నిర్దేశిత టైమ్ ప్రకారం, బాధ్యతగా పని చేయకపోతే ఎలా? అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అటవీ శాఖ అధికారులను ప్రశ్నించారు. విధులు, నిర్దేశించిన

2లో..

## దేశవ్యాప్తంగా పిల్లల మిస్సింగ్ కేసులపై
## కిడ్నాప్ ఎఫ్ఐఆర్ తప్పనిసరి: సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ (భారత శక్తి)** దేశవ్యాప్తంగా ఎవరైనా వ్యక్తి లేదా చిన్నారి కనిపించకుండా పోయిన ప్రతి కేసులో కిడ్నాప్ కేసు నమోదు చేయడం అన్ని పోలీస్ స్టేషన్లకు తప్పనిసరి చేస్తూ సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. చిన్నారుల అక్రమ రవాణా, ఏళ్ల తరబడి ఆచూకీ లభించని పిల్లల సమస్యను అత్యంత గంభీరంగా పరిగణిస్తూ పోలీస్ వ్యవస్థను అప్రమత్తం చేయడమే ఈ నిర్ణయం లక్ష్యమని కోర్టు పేర్కొంది.దేశంలో సుమారు 47 వేల మంది పిల్లలు ఇప్పటికీ ఆచూకీ లేకుండా ఉన్నారనే అంశంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన అత్యున్నత న్యాయస్థానం, "ఏ వ్యక్తి లేదా చిన్నారి కనిపించకుండా

2లో..

## తీవ్ర ఉష్ణోగ్రతలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అత్యవసర సమీక్ష



**హైదరాబాద్ (భారత శక్తి)** తెలంగాణ రాష్ట్ర వ్యాపితంగా ఉష్ణోగ్రతలు మండిపోతున్న నేపథ్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అత్యవసర సమీక్ష నిర్వహించారు. డగాల్పులతో 7 జిల్లాల్లో 16 మంది మృతి చెందారు. మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల ఎక్స్‌గ్రేషియా సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో ప్రకటించారు. వచ్చే మూడు రోజులు మరింత తీవ్రంగా హీట్ వేవ్ నమోదు కానుంది. మంత్రి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలి. ప్రజల ప్రాణ రక్షణే ప్రభుత్వ తొలి ప్రాధాన్యం. ఒక్క ప్రాణం కూడా కోల్పోకూడదని అన్నారు. ఎండ తీవ్రతపై ప్రజలకు గంట గంటకు హెచ్చరికలు ఇవ్వాలి. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 వరకు బయటకు రావొద్దు. వృద్ధులు, గర్భిణీలు, చిన్నారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యవసాయ, నిర్మాణ కార్మికులకు ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకోవాలి. హీట్ వేవ్పై

2లో..

## భవిష్యత్తులో వ్యాపార అవకాశాల్లో సీఏల పాత్ర కీలకం: కేటీఆర్



**హైదరాబాద్ (భారత శక్తి)** భవిష్యత్తులో వ్యాపార అవకాశాల్లో చార్టర్డ్ అకౌంటెంట్ల (సీఏ) పాత్ర అత్యంత కీలకంగా మారుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గచ్చిబౌలిలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) స్నాతకోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కేటీఆర్ మాట్లాడుతూ, చార్టర్డ్ అకౌంటెంట్లు కేవలం పన్నుల లెక్కలకే పరిమితం కాకూడదని సూచించారు.సీఏలు వ్యాపారాలను వృద్ధి చేసే సలహాదారులుగా ఎదగాలని వ్యాఖ్యానించారు. ప్రస్తుత కాలానుగుణంగా కృత్రిమ

2లో..

# పర్యాటక రంగానికి ప్రైవేటు ఊతం

- 'ఈజ్ ఆఫ్ డూయింగ్' విధానంలో త్వరితగతిన అనుమతులు.
- ప్రతిపాదనలు, సమగ్ర నివేదికలతో రావాలని మంత్రి జూపల్లి పిలుపు
- 'డెస్టినేషన్ తెలంగాణ – రోడ్ అహెడ్' సదస్సు ఘనంగా నిర్వహణ



**హైదరాబాద్, మే 23 : భారత శక్తి,** తెలంగాణను అంతర్జాతీయ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. పర్యాటక రంగాన్ని రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కీలక చోదక శక్తిగా (ఇంజిన్) మారుస్తామని ప్రకటించారు. గచ్చిబౌలిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిథమ్) ప్రాంగణంలో శనివారం నిర్వహించిన "డెస్టినేషన్ తెలంగాణ -- రోడ్ అహెడ్" సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రభుత్వ '99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'లో భాగంగా నిర్వహించిన పర్యాటక వారోత్సవాల ముగింపు సందర్భంగా ఈ కార్యక్రమం జరిగింది.

### జాప్యం లేకుండా అనుమతులు..

పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు, వివిధ యాజమాన్యాలు ముందుకు రావాలని మంత్రి పిలుపునిచ్చారు. ప్రైవేటు భాగస్వామ్యంతో పర్యాటక ప్రాజెక్టులను వేగవంతం చేస్తామని, ఇందుకోసం నూతన పర్యాటక విధానాన్ని తీసుకువచ్చామని వెల్లడించారు. పారిశ్రామికవేత్తలు సరైన ప్రతిపాదనలతో పాటు సమగ్ర ప్రాజెక్టు నివేదికలను (డీపీఆర్) సమర్పిస్తే, ఎలాంటి ఆటంకాలు లేకుండా త్వరితగతిన అనుమతులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. సులభతర వాణిజ్యం (ఈజ్ ఆఫ్ డూయింగ్) పరిధిలో పెట్టుబడిదారులకు ప్రభుత్వం సంపూర్ణ మద్దతు ఇస్తుందని, అన్ని రకాల ప్రోత్సాహకాలు కల్పిస్తుందని స్పష్టం చేశారు.

2లో..

## భాష ఏదైనా..
## ఫిర్యాదు ఇక సులభం

- హైదరాబాద్ పోలీసుల అమ్ములపొదిలోకి 'ఏఐ కాప్‌రైటర్'
- దేశంలోనే మొట్టమొదటి ఏఐ ఆధారిత బహుభాషా ఫిర్యాదుల నమోదు
- యాప్ ను ఆవిష్కరించిన హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనర్



**హైదరాబాద్ (భారత శక్తి)** పోలీసింగ్ వ్యవస్థలో అత్యాధునిక సాంకేతికతను జోడిస్తూ హైదరాబాద్ సిటీ పోలీస్ మరో చారిత్రాత్మక ముందడుగు వేసింది. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు భాషా పరమైన ఇబ్బందులు కలగకుండా, వారి ఫిర్యాదులను త్వరితగతిన, కచ్చితత్వంతో నమోదు చేసేందుకు దేశంలోనే తొలిసారిగా ఏఐ కాప్‌రైటర్ అనే కృత్రిమ మేధ ఆధారిత మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. హైదరాబాద్ బంజారాహిల్స్ లోని టీజీఐసీసీసీలో శనివారం ఏఐ కాప్‌రైటర్ యాప్ ను హైదరాబాద్ సీపీ శ్రీ వీసీ సజ్జనర్, ఐపీఎస్ గారు ఆవిష్కరించారు. దాని పనితీరును పరిశీలించారు. నగరంలోని 80కి పైగా పోలీస్ స్టేషన్లలో అందుబాటులోకి రానున్న ఈ యాప్ ద్వారా, బాధితులు

2లో..

# డిజిటల్ దుమారం.. 'బొద్దింక' గర్జన!







ఎన్నికల్లో ఓటింగ్ సరళిని మార్చేస్తుందేమోనని, ప్రభుత్వంపై యువతలో పెరుగుతున్న వ్యతిరేకతకు ఇది అద్దం పడుతోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అందుకే బెంగళూరు పోలీసులు ఈ ఆదివారం (మే 24) నాడు టౌన్ హాల్ వద్ద CJP మద్దతుదారులు నిర్వహించాలనుకున్న హ్యూమన్ చైన్ (మానవహారం) పై నిషేధాజ్ఞలు విధించారు.

### వెబ్సైట్ హ్యాక్.. సోషల్ మీడియా ఆంక్షలు ఎవరు విధించారు? ఎందుకు?

ఈ ఉద్యమం ఉధృతిని తట్టుకోలేక దీనిని అణచివేసే ప్రయత్నాలు మొదలయ్యాయి. వెబ్సైట్, ఇన్స్టా హ్యాక్: జబ్బీ అధికారిక వెబ్సైట్ (cockroachjantaparty.org) తో పాటు ఫౌండర్ అభిజీత్ ఇన్స్టాగ్రామ్ అకౌంట్‌ను హ్యాక్ చేయడానికి తీవ్ర ప్రయత్నాలు జరిగాయి. దీనిపై అభిజీత్ స్పందిస్తూ.. "మా అకౌంట్‌ను హ్యాక్ చేయాలని చూసి విఫలమయ్యారు" అని ట్వీట్ చేశారు. పాకిస్తాన్ లింకుల ఆరోపణ: ఈ పార్టీకి పాకిస్తాన్, బంగ్లాదేశ్, టర్కీల నుంచి బోట్ (ఫేక్) ఫాలోవర్లు వస్తున్నారని, ఇది దేశ భద్రతకు ముప్పని ఐటీ సెల్ వర్గాలు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం ప్రారంభించాయి. అయితే దీనిని అభిజీత్ తిప్పికొడుతూ, తన ఫాలోవర్లలో 94% మంది భారతీయులేనని అనలిటిక్స్ డేటాను బయటపెట్టారు. ఎక్స్ (ట్విట్టర్) అకౌంట్ నిలిపివేత: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎక్స్ (X) వేదికపై ఈ పార్టీకి సంబంధించిన కొన్ని అకౌంట్లపై నిలిపివేత (Block) ఆంక్షలు విధించినట్లు తెలుస్తోంది. ఇన్స్టాగ్రామ్ అకౌంట్‌ను కూడా నిలిపివేయడానికి ఐటీ శాఖ ద్వారా ఒత్తిడి పెరుగుతోందని సమాచారం. యువతలో తిరుగుబాటు ధోరణిని, లా అండ్ ఆర్డర్ సమస్యలను అదుపు చేయడానికి ఈ సోషల్ మీడియా హ్యాండిల్స్‌ను నియంత్రించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. మొత్తానికి, ఒక సాధారణ 'మీమ్' లాగా మొదలైన బొద్దింకల పార్టీ.. ఈరోజు దేశ ఐటీ చట్టాలకు, రాజకీయ దిగ్గజాలకు సవాల్ విసురుతూ కొత్త చరిత్ర సృష్టిస్తోంది.

## 50 శాతం గ్రీన్ కవర్ ఉండాలని చెప్పాము

బాధ్యతలపై అలసత్వం వహిస్తే ఉపేక్షించలేమని స్పష్టం చేశారు. ప్రపంచంలోనే కేవలం మన శేషాచలం అడవుల్లో మాత్రమే దొరికే అమూల్యమైన ఎర్ర చందనం టన్నుల కొద్దీ విదేశాలకు అక్రమంగా తరలిపోయింది.. చైనా, జపాన్, సింగపూర్ వంటి దేశాల కస్టమ్స్ అధికారుల వద్ద వేల కోట్ల విలువైన మన కలప సీజ్ చేయబడి ఉంది.. కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖతో సమన్వయం చేసుకుంటూ విదేశాల్లో పట్టుబడిన ఎర్రచందనాన్ని తిరిగి భారతదేశానికి రప్పించే ప్రక్రియ ఎంత వరకూ వచ్చిందని ప్రశ్నించారు. గ్రీన్ కవర్ 50 శాతం పెంచడానికి వారం రోజుల్లో ఏపీ గ్రీన్ సొసైటీ ఏర్పాటు చేయాలని సూచించారు. శుక్రవారం వెలగపూడి సచివాలయంలో అటవీశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రీన్ బెల్ట్, ఎర్రచందనం రికవరీ, గ్రేట్ గ్రీన్ వాల్ పై అంశాలవారీగా అధికారులతో సమీక్షించారు. నిర్దేశించిన కార్యక్రమాలను చేపట్టడంలోను, అటవీ భూముల పరిరక్షణలో బాధ్యతాయుతంగా వ్యవహరించని కొందరు అధికారులపై ఉప ముఖ్యమంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను పరిగణించకుండా, అటవీ ఆస్తులను పరిరక్షిచలేకపోయినా ఉపేక్షించబోమన్నారు. ప్రజలకు జవాబుదారీగా, పారదర్శకంగా పని చేయాలని స్పష్టం చేశారు. నాగార్జునసాగర్–శ్రీశైలం టైగర్ రిజర్వ్ వంటి కీలక అటవీ ప్రాంతాలలో పులులు తాగునీటి కోసం అడవి దాటి గ్రామాల వైపు రాకుండా, వాటి సంచార మార్గాల్లోనే వాటర్ సాసర్స్ ఏర్పాటు పనులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ... "వనజీవి రామయ్య , దుశర్ల సత్యనారాయణ లాంటి పర్యావరణ ప్రేమికులు ప్రకృతి కోసం తమ జీవితాలనే అర్పించి అద్భుతాలు సృష్టించారు. ఎటువంటి స్వార్థం లేకుండా, కేవలం రాబోయే తరాల మనుగడ కోసం తమ జీవితాలను అంకితం చేసిన ఆ ఇద్దరి నుంచి స్ఫూర్తి పొందాలి. ఒంటరిగా వారే అంతటి హరిత విప్లవాన్ని సాధించినప్పుడు, ఒక వ్యవస్థగా మనం ఎంత చేయాలి? నిజమైన సంకల్పంతో మనమంతా కలిసి ముందుకు సాగితే పచ్చని భవిష్యత్తు కచ్చితంగా సాధ్యమవుతుందని అన్నారు. .

### సీజన్ కోసం ఎదురు చూడొద్దు

విత్తన బంతులు వెదజల్లడానికి సంప్రదాయ వర్షాకాలం సీజన్ కోసం నిరీక్షించాల్సిన అవసరం లేదు. మన దగ్గర విత్తన బంతులు సిద్ధంగా ఉంటే ఏ సమయంలోనైనా వేసుకోవచ్చు. కొండ ప్రాంతాలు, ఖాళీ స్థలాలు, అటవీ సరిహద్దుల్లో పెద్ద ఎత్తున సీడ్ బాల్స్ చల్లేలా ముందస్తుగానే విస్తృత ఏర్పాట్లు చేయాలి. ఈ విత్తన బంతుల వెదజల్లే కార్యక్రమాన్ని కేవలం ప్రభుత్వానికే పరిమితం చేయకుండా, ఒక ప్రజా ఉద్యమంలా మార్చాలి. జూన్ నెలలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున విత్తన బంతుల తయారీ కార్యక్రమాలు చేపట్టి 2.5 కోట్ల విత్తన బంతులను పంపిణీ చేసే విధంగా కార్యాచరణ సిద్ధం చేయాలి. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పొదుపు సంఘాల మహిళలు, ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది, పాఠశాల, కళాశాల విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ వాలంటీర్లతో పాటు రాష్ట్ర ప్రజలను, అన్ని వర్గాల ప్రతినిధులను ఇందులో భాగస్వామ్యం చేయలని అన్నారు.

### బక్రీద్ పండగ సమయంలో

## జంతు బలులు నివారించాలి

**- అధికారులకు వినతిపత్రం సమర్పించిన వి.హెచ్.పి, బి.జె.పి నాయకులు**



**ఎమ్మిగనూరు** ఎమ్మిగనూరు పట్టణంలో బక్రీద్ పర్వదినం సందర్భంగా బహిరంగ ప్రదేశాలలో జంతు బలులు నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక విశ్వహిందూ పరిషత్ కార్యదర్శి మురళీకృష్ణ,సహా కార్యదర్శి బి.శ్రీనివాసులు,జిల్లా సహా కార్యదర్శి శ్రీ రంగా, జిల్లా గోరక్షక్ ప్రముఖ్ శ్రీరాములు, బిజెపి అసెంబ్లీ మాజీ కో కన్వీనర్ తొగట నరసింహులు, పట్టణ బిజెపి అధ్యక్షులు కోరిశెట్టి జట్టప్ప అధికారులకు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా డిఎస్పీ, పట్టణ సి.ఐ, రూరల్ సి.ఐ, తహసీల్దార్‌లను కలిసి పండుగ సమయంలో శాంతిభద్రతలు కాపాడాలని, చట్ట విరుద్ధంగా జంతువులను బహిరంగంగా వధించకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని వారు కోరారు. జంతు బలుల వల్ల ప్రజల్లో అసౌకర్యం, పారిశుధ్య సమస్యలు తలెత్తే అవకాశముందని, చిన్నారులపై మానసిక ప్రభావం పడే ప్రమాదం ఉందని బీజేపీ,వి.హెచ్.పి నాయకులు పేర్కొన్నారు. మత సామరస్యాన్ని కాపాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ అధికారులకు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో బి.జే పీ నాయకులు ఉప్పర వెంకటేశ్వర్లు ఎమ్మిగనూరు మండల అధ్యక్షులు జగాపురం చిన్న ఈరన్న బిజెపి సీనియర్ నాయకులు, గణప వీరేష్ పట్టణ సీనియర్ నాయకులు, అయ్యపు రెడ్డి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు,ఈరన్న గౌడ్ పట్టణ ఉపాధ్యక్షులు, నాగేశ్వరరావు పట్టణ కార్యదర్శి,ఎల్ వి. వెంకట శర్మ సీనియర్ నాయకులు, కురువ రంగస్వామి, తదితరులు పాల్గొన్నారు

### ఇంధన పొదుపుకు జిల్లా అధికారుల

## సమిష్టి ప్రయాణం

**- "వన్ మంత్ - ఫోర్ విజిట్"లో బస్సుల వినియోగంతో వినూత్న సందేశం**

**- ప్రజల్లో ఇంధన పొదుపుపై అవగాహన పెంపే లక్ష్యం :**

**- కలెక్టర్ రాజకుమారి గణియా**



**నంద్యాల,** ఇంధన పొదుపు చర్యల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "వన్ మంత్ – ఫోర్ విజిట్" కార్యక్రమాన్ని ఆదర్శవంతంగా అమలు చేస్తూ జిల్లా అధికారులు సమిష్టిగా బస్సుల్లో ప్రయాణించడం ద్వారా వినూత్న సందేశాన్ని ప్రజలకు అందించారు. శనివారం ఆళ్లగడ్డ నియోజకవర్గంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, వివిధ శాఖల జిల్లా అధికారులు నంద్యాల కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ ఆవరణ నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సుల్లో ప్రయాణించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి గారి సూచనల మేరకు ప్రతి ఒక్కరిలో ఇంధన పొదుపుపై అవగాహన కల్పించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ప్రజలకు సందేశం ఇచ్చే ముందు అధికారులే ఆచరణలో చూపించాలనే ఉద్దేశంతో ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లా, డివిజనల్, నియోజకవర్గ మరియు మండల స్థాయి అధికారులు తమ తమ వ్యక్తిగత వాహనాలలో కాకుండా, సమిష్టిగా మూడు బస్సుల్లో ప్రయాణించేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు. ఇకపై "వన్ మంత్ – ఫోర్ విజిట్" కార్యక్రమం కింద ఏ నియోజకవర్గానికి వెళ్లినా ఇదే విధానాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సంయుక్త తనిఖీలు, సమావేశాలు లేదా పర్యటనల సందర్భాల్లో పలువురు అధికారులు విడివిడిగా వాహనాలు వినియోగించకుండా ఒకే వాహనంలో ప్రయాణించడం ద్వారా ఇంధన వినియోగాన్ని గణనీయంగా తగ్గించవచ్చని కలెక్టర్ తెలిపారు. ఈ చర్యల ద్వారా ప్రజల్లో కూడా ఇంధన పొదుపుపై మరింత అవగాహన పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ప్రస్తుతం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలు అవసరమైతే తప్ప అనవసర ప్రయాణాలను తగ్గించాలని, ముఖ్యంగా సెలవు దినాల్లో వాహనాల వినియోగాన్ని పరిమితం చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతి ఒక్కరూ అవసరమైన మేరకే ఇంధనాన్ని వినియోగిస్తూ వృథా ఖర్చులను తగ్గించుకునే దిశగా ముందుకు రావాలని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## భాష ఏదైనా.. ఫిర్యాదు ఇక సులభం

తమ మాతృభాషలో చెప్పే ఫిర్యాదులను పోలీసులు తక్షణమే రికార్డు చేసి, అనువదించుకోవచ్చు.హైదరాబాద్ వంటి మెట్రో నగరంలో తెలుగు, ఇంగ్లీష్ రాని ఇతర రాష్ట్రాల వలస కార్మికులు, పర్యాటకులు ఫిర్యాదు చేసే సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భాష అర్థం కాక ఎఫ్.ఐ.ఆర్ నమోదులో జాప్యం జరగడం, సమాచారం తప్పుగా నమోదవ్వడం వంటి సమస్యలకు ఈ యాప్ స్వస్తి పలకనుంది. 10కి పైగా ప్రధాన భారతీయ భాషలను గుర్తించే సామర్థ్యం ఈ యాప్ సొంతం. ఈ వినూత్న యాప్ ను బ్లూక్లౌడ్ సాఫ్టెక్ సొల్యూషన్స్ సంస్థతో పాటు ఇంటర్న్ పాగ్రో చందు సహకారంతో హైదరాబాద్ సిటీ పోలీస్ రూపొందించింది.


## పెద్ద వంకే శ్మశానంగా మారిన వైనం

**- రోల్లపాడు గ్రామం నందు స్మశాన వాటిక కోసం ఆర్డీవోకు వినతి పత్రం అందజేత.**




**తుగ్గలి** తుగ్గలి మండల పరిధిలోని కడమకుంట్ల గ్రామ పంచాయితీ లోని రోల్లపాడు గ్రామంలో స్మశాన వాటిక లేక గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.గ్రామంలో స్మశాన వాటికకు స్థలం లేకపోవడంతో చనిపోయిన వారికి పూడ్చి పెట్టడానికి చోటు లేక గ్రామం పక్కనగల పెద్దవంకలోనే అంత్యక్రియ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సమితి సభ్యులు రోల్లపాడు వెంకటేష్ పత్తికొండ ఆర్డిఓ ఓబులేసుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామం ఏర్పడిన నాటి నుండి స్మశాన వాటిక లేకపోవడంతో,గ్రామస్తులు తప్పనిసరి పరిస్థితుల్లో ఊరికి ఆనుకొని ఉన్న పెద్ద వంకలోనే మృతదేహాలను పూడ్చిపెడుతున్నారు.అయితే ప్రతి వర్షాకాలం వచ్చే వరదలకు ఆ సమాధులు పూర్తిగా కొట్టుకుపోయి,ఆనవాళ్లు కూడా మిగలడం లేదని,చనిపోయిన మా వారి సమాధిపై పూలు వేద్దామన్నా స్థలం ఉండట్లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.గ్రామంలో దాదాపు 55 ఎస్సీ కుటుంబాలు ఉన్నాయని, ప్రభుత్వానికి అర్జీల రూపంలో ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఎలాంటి ఫలితం లేదని ఆయన తెలియజేశారు.ఇప్పటికైనా ప్రభుత్వం ప్రభుత్వం భూమిని కొనుగోలు చేసి స్మశాన వాటిక కొరకు తమకు కేటాయించాలని ఆయన ఆర్డిఓ కు వినతి పత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రవి, వీఆర్వోలు రంగన్న,రాజేశ్వరి,రోల్లపాడు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్ కార్యక్రమం



**ఆళ్లగడ్డ** ఆళ్లగడ్డ పట్టణంలోని మహాలక్ష్మి ఫంక్షన్ హాల్ నందు శనివారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ , జిల్లా కలెక్టర్ రాజ కుమారి గనియా పాల్గొని ప్రజల నుండి నేరుగా వినతులు స్వీకరించారు..గ్రామాలు, పట్టణాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా, ఎమ్మెల్యే మరియు జిల్లా కలెక్టర్ ఒక్కో సమస్యను శ్రద్ధగా విని వెంటనే సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు..తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, పెన్షన్లు, రెవెన్యూ, విద్యుత్ వంటి అనేక సమస్యలపై స్పందిస్తూ త్వరితగతిన పరిష్కారం చూపించాలని అధికారులను ఆదేశించారు.ప్రజల సమస్యలను తెలుసుకొని వాటికి శాశ్వత పరిష్కారం చూపించాలనే లక్ష్యంతో ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించడం జరిగిందని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు.ప్రజలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ప్రతి సమస్య పరిష్కారం అయ్యే వరకు కృషి చేస్తామని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమం లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు,తాలూకా చుట్టూ పక్క గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొనడం జరిగింది.

### భవిష్యత్తులో వ్యాపార అవకాశాల్లో

## సీఏల పాత్ర కీలకం: కేటీఆర్

మేధ (ఏఐ)ని వృత్తిలో భాగంగా చేసుకోవాలని ఆయన అన్నారు. మున్ముందు పన్నులు, జీఎస్టీ, వ్యాపారాల విస్తరణలో సీఏల అవసరం చాలా ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రుల త్యాగాలను, కష్టాన్ని మరవకూడదని సూచించారు.

## దేశవ్యాప్తంగా పిల్లల మిస్సింగ్ కేసులపై కిడ్నాప్ ఎఫ్ఐఆర్ తప్పనిసరి: సుప్రీంకోర్టు

పోయిన సమాచారం అందిన వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్ ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి. ప్రాథమిక విచారణ పేరుతో ఆలస్యం చేయకూడదు. బాధిత కుటుంబ సభ్యులపై వెతికే బాధ్యతను మోపకూడదు" అని స్పష్టం చేసింది.అంతేకాకుండా, నమోదయ్యే ఎఫ్ఐఆర్‌లో భారతీయ న్యాయ సంహిత (ఃబొ) ప్రకారం కిడ్నాప్‌కు సంబంధించిన సెక్షన్లు తప్పనిసరిగా చేర్చాలని కోర్టు ఆదేశించింది.ఈ సందర్భంగా న్యాయమూర్తులు అహ్సానుద్దీన్ అమానుల్లా, ఆర్. మహాదేవన్‌ల ధర్మాసనం తీవ్ర వ్యాఖ్యలు చేసింది. "ఇది ఎంతో పెద్ద సమస్య. కానీ దీని తీవ్రతను ఎవరూ గుర్తించడం లేదు. ప్రజలు ఈ విషయంలోగ్రాహ్యంతి చెందాల్సిన అవసరం ఉంది. ఈ వాస్తవాన్ని చూసీ చూడనట్టుగా ఎలా ఉండగలం?" అని వ్యాఖ్యానించింది.తమిళనాడుకు చెందిన 2011 నుంచి కనిపించకుండా పోయిన ఒక చిన్నారి కేసును విచారిస్తున్న సందర్భంగా సుప్రీంకోర్టు ఈ కీలక ఆదేశాలు జారీ చేసింది.

## తీవ్ర ఉష్ణోగ్రతలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అత్యవసర సమీక్ష

గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. ఎండదెబ్బ కేసులకు ఆసుపత్రులు సిద్ధంగా ఉంచాలని అన్నారు.

## పర్యాటక రంగానికి ప్రైవేటు ఊతం



### సదస్సులోని ముఖ్య విశేషాలు:

దీర్ఘకాలిక లీజులు: నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ ఆస్తులను పర్యాటక ప్రాజెక్టుల కోసం దీర్ఘకాలిక లీజు పద్ధతిలో కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

### ప్రభుత్వమే వ్యయం భరిస్తుంది:

ఎంపిక చేసిన పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి 'ఆసక్తి వ్యక్తీకరణ' (ఈఓఐ) ప్రకటనలు జారీ చేస్తారు. దీని ద్వారా ఎంపికైన సంస్థల డిజైన్లు, ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని ప్రభుత్వమే భరిస్తుంది.

### ఆధునిక వసతులు:

పర్యాటక ప్రాంతాల్లో తాగునీరు, మరుగుదొడ్లు వంటి కనీస వసతులతో పాటు.. మొబైల్ గ్లాస్ హౌస్‌లు, కాన్వాస్ టెంట్లు వంటి అధునాతన సౌకర్యాల ఏర్పాటుకు ప్రైవేటు వ్యక్తులకు అవకాశం కల్పిస్తారు.

లిఉపాధి కల్పనే ధ్యేయం..

పర్యాటక రంగం కేవలం వినోదం మాత్రమే కాదని, అది దేశ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచే కీలక రంగమని మంత్రి అభివర్ణించారు. ప్రపంచంలోని పలు చిన్న దేశాలు కేవలం పర్యాటకంపైనే ఆధారపడి వృద్ధి సాధించాయని ఉదాహరించారు. పర్యాటక రంగం బలోపేతమైతే అనుబంధ పరిశ్రమలు లాభపడటంతో పాటు స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించేలా మౌలిక వసతులు కల్పిస్తున్నామని, ఇందులో భాగంగానే భువనగిరి కోటలో రోప్‌వే (తాడుమార్గం) వంటి పర్యాటక ఆకర్షణలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వివరించారు.

లిప్రముఖుల హాజరు..

ఈ సదస్సులో పర్యాటక, భాషా సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్, పర్యాటక అభివృద్ధి సంస్థ ప్రతినిధి పటుల్ రమేష్ రెడ్డి, పర్యాటక శాఖ డైరెక్టర్ లక్ష్మణ్ రజింత్ నాయక్, నిథమ్ డైరెక్టర్ వెంకటరమణ, పురావస్తు శాఖ డైరెక్టర్ ప్రొఫెసర్ అర్జున రావు పాల్గొన్నారు. అలాగే రామోజీ ఫిల్మ్ సిటీ వైస్ ప్రెసిడెంట్ ఏ. విశ్వంభర రావు, ఎక్స్‌పీరియం పార్క్ చైర్మన్ రామదుగు రామ్ దేవ్ రావు, ప్రగతి రిసార్ట్స్ చైర్మన్ జీబీకే రావు, వేద కుమార్, అలంకృత రిసార్ట్స్ ఎండీ ఆదిత్య దీన్ దయాళ్ తదితర ప్రముఖులు ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.

# సంపాదకీయం

భారత శక్తి
VOICE OF INDIAN

## మళ్లీ తెరపైకి డీలిమిటేషన్

నియోజకవర్గాల పునర్విభజనపై చిదంబరం చేసిన ట్వీట్‌పై స్పందించిన ఏపీ మంత్రి నారా లోకేష్‌కు.. తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. రాజ్యాంగ సంబంధిత ఆందోళనలకు రాజకీయ నాటకాలతో కాదు, రాజ్యాంగబద్ధమైన సమాధానాలతోనే స్పందించాలని చురకలు అంటించారు. దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గకుండా రాజ్యాంగబద్ధమైన హామీ ఉండాలని గతంలో చంద్రబాబు చెప్పిన రక్షణ ఎక్కడ అంటూ లోకేష్‌ను పొంగులేటి ప్రశ్నించారు. కొన్ని నెలలుగా దేశవ్యాప్తంగా డీలిమిటేషన్ అంశం తీవ్ర చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. ఈ విషయంపై కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత పి.చిదంబరం.. తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేష్ మధ్య ఎక్స్‌లో మాటల యుద్ధం జరుగుతోంది. ఈ క్రమంలోనే చిదంబరం చేసిన ట్వీట్‌కు స్పందిస్తూ.. నారా లోకేష్ చేసిన ట్వీట్‌కు తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమాధానం ఇచ్చారు. రాజ్యాంగ అంశాలకు రాజకీయాలతో కాకుండా.. రాజ్యాంగబద్ధంగానే స్పందించాలని హితవు పలికారు. ఈ సందర్భంగా నారా లోకేష్‌కు సమాధానంగా సుదీర్ఘంగా ట్వీట్ చేశారు. అందులో కొన్ని గణాంకాలతో కూడిన ఫోటోను కూడా జత చేశారు.ప్రియమైన లోకేష్ గారు అంటూ ట్వీట్‌ను మొదలుపెట్టిన మంత్రి పొంగులేటి.. డీలిమిటేషన్ బిల్లు-2026లో దామాషా లెక్కల ప్రకారం సీట్ల పెంపునకు సంబంధించిన చట్టబద్ధ హామీ ఎందుకు లేదని ప్రశ్నించారు. చట్టంలో ఎలాంటి రక్షణ కల్పించకుండా బీజేపీ నాయకుల మాటలను మాత్రమే దక్షిణాది రాష్ట్రాలు ఎందుకు నమ్మాలని నిలదీశారు. ఎన్నో ఏళ్ల హామీలు, భరోసాలతో చివరికి మోసపోయిన తర్వాత కూడా.. కేవలం మాటలనే దక్షిణాది ప్రజలు ఎలా విశ్వసిస్తారని పేర్కొన్నారు.జనాభా లెక్కల ఆధారంగా డీలిమిటేషన్ ప్రక్రియ జరుగుతుందని ఈ బిల్లులో స్పష్టంగా పేర్కొన్నారని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. ఈ రకంగా డీలిమిటేషన్ ప్రక్రియను అమలు చేస్తే లోక్‌సభలో తెలంగాణ వాటా ప్రస్తుతం 3.13 శాతం ఉండగా.. అది సుమారు 2.85 శాతానికి కు పడిపోయే అవకాశం ఉందని తెలిపారు. దీంతో తెలంగాణ 2, 3 లోక్‌సభ సీట్లను కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్ వాటా 4.6 శాతం నుంచి సుమారు 4.1 శాతానికి తగ్గి.. 4, 5 సీట్లు కోల్పోయే ప్రమాదం ఉందని గుర్తు చేశారు. సమర్థవంతంగా జనాభా నియంత్రణను అమలు చేసిన రాష్ట్రాలకే ఈ పరిస్థితి ఎదురవుతోందని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు.ఇదే అంశంపై కాంగ్రెస్ పార్టీతో పాటు దక్షిణాది ప్రజలు కూడా పదేపదే ఆందోళన వ్యక్తం చేస్తున్నారని.. కానీ మీరు మాత్రం ఆ సమస్యను కావాలనే విస్మరిస్తున్నారని లోకేష్‌కు గుర్తు చేశారు. ప్రస్తుతం అనధికారికంగా చర్చిస్తున్న 50 శాతం సీట్ల పెంపు మోడల్ అమలు చేసినా.. ఉత్తర, దక్షణాది రాష్ట్రాల మధ్య అసమానతలు మరింత పెరుగుతాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో లోక్‌సభ స్థానాలు 80 నుంచి 120కు పెరిగితే.. తెలంగాణలో 17 నుంచి 26కు.. ఏపీలో 25 నుంచి 38కు మాత్రమే పెరుగుతాయని తెలిపారు. దీంతో యూపీ-తెలంగాణ మధ్య ప్రస్తుతం ఉన్న 63 సీట్ల తేడా 94 సీట్లకు పెరుగుతుందని గుర్తు చేశారు. ఇక యూపీ-ఏపీ మధ్య వ్యత్యాసం 55 నుంచి 82 సీట్లకు చేరుతుందని తెలిపారు. ఇలా చేయడం వల్ల ఉత్తరాది రాష్ట్రాలకు పార్లమెంట్‌లో మరింత రాజకీయ ఆధిపత్యం లభిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.అదే 50 శాతం పెంపు మోడల్‌ను దేశవ్యాప్తంగా అమలు చేస్తే.. దక్షిణాదిన ఉన్న 5 రాష్ట్రాలకు కలిపి సుమారు 66 మాత్రమే అదనపు సీట్లు వస్తాయని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గణాంకాలు వెల్లడించారు.

అదే సమయంలో ఉత్తరాదిన మరీ ముఖ్యంగా హిందీ బెల్ట్ రాష్ట్రాలకు దాదాపు 142 అదనపు సీట్లు లభిస్తాయని.. ఈ పెరుగుతున్న అసమానతే అసలు సమస్య అని తెలిపారు. జనాభా నియంత్రణ, మెరుగైన పాలన, ఆర్థికాభివృద్ధి, దేశ ఆర్థిక వ్యవస్థకు అధికంగా సహకరించినందుకు దక్షిణాది రాష్ట్రాలను శిక్షించకూడదని పొంగులేటి పేర్కొన్నారు.ఐదు దక్షిణాది రాష్ట్రాలు కలిపి దేశ జీడీపీలో సుమారు 31 శాతం నుంచి 33 శాతం వరకు వాటా కల్పిస్తున్నాయని.. కేంద్ర ప్రభుత్వ ఖజానాకు కూడా అధికంగా ఆదాయాన్ని అందిస్తున్నాయని మంత్రి పొంగులేటి తెలిపారు. అయినప్పటికీ కేంద్రం నుంచి రాష్ట్రాలకు లభిస్తున్న కేటాయింపులు తక్కువగా ఉన్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. డీలిమిటేషన్ తప్పనిసరి అయితే.. ప్రాతినిధ్యాన్ని కేవలం జనాభా ఆధారంగా మాత్రమే నిర్ణయించకూడదని.. ఆర్థిక సహకారం, అభివృద్ధి సూచికలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న 24 శాతం స్థానంలో.. దక్షిణాది రాష్ట్రాల జీడీపీ వాటాకు అనుగుణంగా లోక్‌సభలో కనీసం 33 శాతం ప్రాతినిధ్యం కల్పించాలని పొంగులేటి డిమాండ్ చేశారుదక్షిణాది రాష్ట్రాలను రాజకీయంగా పక్కనబెట్టడం కాదని.. న్యాయమైన ప్రాతినిధ్యం లభించాలని తేల్చి చెప్పారు.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ ప్రభుత్వాలతో సంపూర్ణ ఏకాభిప్రాయం వచ్చిన తర్వాతే డీలిమిటేషన్ ప్రక్రియపై నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

అంతేకాకుండా 2001లో చంద్రబాబు నాయుడు.. దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని రక్షించేందుకు చట్టంలో రాజ్యాంగబద్ధమైన హామీ ఉండాలని తేల్చి చెప్పారని.. అది కూడా కేవలం మాటల భరోసాలు సరిపోవని స్వయంగా ఆయనే చెప్పారని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. అయితే ఆ రక్షణ డీలిమిటేషన్ బిల్లు-2026లో ఎక్కడ ఉందని లోకేష్‌కు మంత్రి పొంగులేటి సూటి ప్రశ్న వేశారు.

# ఎక్కువ సమయం స్క్రీన్ పై గడుపుతున్నారా?



నేటి యుగంలో డిజిటలైజేషన్ పెరుగుతున్నందున ప్రజలు ప్రతి పనికి ల్యాప్‌టాప్‌లు, ఫోన్‌లను ఉపయోగించడం ప్రారంభించారు. ఆఫీసు అయినా, పాఠశాల అయినా, కళాశాల అయినా, ల్యాప్‌టాప్‌లు ప్రతిచోటా ఉపయోగిస్తున్నారు. ఎందుకంటే వీటితో ఏదైనా పనిని సులభంగా చేయవచ్చు. ఆఫీసులో స్క్రీన్ పై నిరంతరం పనిచేయడం వల్ల కళ్ళపై చెడు ప్రభావం పడుతుంది. ఎందుకంటే ఆఫీసులో పని కోసం ల్యాప్‌టాప్‌ను ఉపయోగించాల్సి వస్తుంది. చదువు కోసం, ఆఫీసు పని కోసం గంటల తరబడి ల్యాప్‌టాప్‌పై వర్క్ చేస్తూనే ఉంటున్నారు. ఓ వైపు మంచి ఆహారం తీసుకోవడం లేదు.. బిజీ బిజీ జీవితంలో తమ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవడానికి తగినంత సమయం ఉండడం లేదు. దీని ఫలితంగా కంటి చూపు బలహీనత, కళ్ళు పొడిబారడం, దురద, ఎరుపు వంటి కంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. నేటి డిజిటల్ యుగంలో తప్పుడు అలవాట్ల కారణంగా, తప్పు భంగిమలో ఎక్కువసేపు కూర్చోవడం వల్ల, కంటి చూపు బలహీనపడటం ప్రారంభమవుతుంది. ఇప్పుడు మీ కళ్ళను జాగ్రత్తగా చూసుకునేందుకు మీరు మీ దినచర్యను మెరుగుపరచుకోవాలి. పని మధ్యలో విరామం తీసుకుంటూ ఉండాలి. తద్వారా ల్యాప్‌టాప్ లేదా ఫోన్ నుంచి వెలువడే నీలి కాంతి మీ కళ్ళపై ప్రభావం చూపుతుంది. కనురెప్పలు మెరిసేలా చేయడం ఎవరైనా స్క్రీన్ పై ఎక్కువసేపు పనిచేస్తుంటే ఈ వ్యాయామం మీకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. దీని కోసం ఒకే చోట కూర్చుని.. ఆపై 10 సార్లు కళ్ళు రెప్పవేయండి. కళ్ళు మూసుకుని దీర్ఘ శ్వాస తీసుకోండి. ఇలా చేయడం ద్వారా రిలాక్స్ గా ఉంటారు. పామింగ్ పామింగ్ కళ్ళకు సులభమైన వ్యాయామం. దీని కోసం, మీరు మొదట మీ అరచేతులను ఒకదానికొకటి రుద్దడం ద్వారా వేడెక్కించాలి. తరువాత మీ కళ్ళు మూసుకుని మీ అరచేతులను మీ కళ్ళపై ఉంచండి. తరువాత 5 నిమిషాల తర్వాత మీ చేతులను తొలగించండి. కళ్ళు తిప్పుతూ ఈ వ్యాయామం చేయడం చాలా సులభం. దీని కోసం, మీ కళ్ళను అటు ఇటు అంటే కళ్ళను కుడి నుంచి ఎడమ వైపుకు ఎడమ నుంచి కుడి వైపుకి కదిలించండి. తరువాత కళ్ళను పైకి క్రిందికి కదిలించండి. తరువాత వాటిని అపసవ్య దిశలో, సవ్యదిశలో కదిలించండి. ఇలా చేయడం వలన కంటి అలసటను తగ్గిస్తుంది. ముక్కు కొన వైపు చూస్తూ ముందుగా వెన్నెముకను నిటారుగా ఉంచి కూర్చోండి. తరువాత కళ్ళను నిటారుగా ఉంచి శ్వాస తీసుకోండి. భుజాలను విశ్రాంతి తీసుకోండి. అరచేతులను మీ మోకాళ్లపై ఉంచండి. ఇప్పుడు నెమ్మదిగా కళ్ళను కదిలించి మీ ముక్కు కొన వైపు చూడటానికి ప్రయత్నించండి. మీ చూపులను కొంతసేపు స్థిరంగా ఉంచండి. తరువాత మీకు అసౌకర్యంగా అనిపించినప్పుడు, కళ్ళకు విశ్రాంతి ఇవ్వండి.

## సాక్స్ లేకుండా షూస్ ధరిస్తున్నారా?



సాక్స్ లేకుండా షూస్ వేసుకోవడం వల్ల పాదాల్లో దుర్వాసన రావడమే కాకుండా ఆరోగ్యం కూడా పాడవుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. శరీరంలో చెమట ఎక్కువగా ఉండే భాగాలలో పాదాలు ఒకటి. అలాగే రోజంతా షూస్ వేసుకోవడం వల్ల చెమట ఎక్కువగా పడుతుంది. సాధారణంగా చాలా మంది సాక్స్ లేకుండా షూస్ వేసుకునే అలవాటు ఉంటుంది. ఇటీవలి కాలంలో కూడా యువతలో ఇలాంటి ఫ్యాషన్ ఎక్కువగా ఉంది. సాక్స్ లేకుండా షూస్ వేసుకోవడం వల్ల పాదాల్లో దుర్వాసన రావడమే కాకుండా ఆరోగ్యం కూడా పాడవుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. శరీరంలో చెమట ఎక్కువగా ఉండే భాగాలలో పాదాలు ఒకటి. అలాగే రోజంతా షూస్ వేసుకోవడం వల్ల చెమట ఎక్కువగా పడుతుంది. అందుకే దీనిని వదిలించుకోవడానికి, వాసనను నివారించడానికి, పాదాలను పొడిగా ఉంచడానికి సాక్స్ ఉత్తమం. వీటన్నింటితో పాటు, ఇది తరచుగా పాదాలకు చెమట పట్టడాన్ని నివారిస్తుంది. అందుకే సాక్స్ లేకుండా బూట్లు ధరించడం వల్ల కలిగే నష్టాలు ఏమిటి? సాక్స్ మన పాదాలను ఎలా ఆరోగ్యంగా ఉంచుతుంది? వేసవికి మాత్రమే కాకుండా శీతాకాలానికి కూడా మంచిది: సాక్స్ ధరించడం వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయి. ఇది అనేక రకాల బ్యాక్టీరియా నుండి మిమ్మల్ని రక్షిస్తుంది. అలాగే వీటిని ధరించడం వల్ల ఎలాంటి ఫంగల్ లేదా బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లు దరిచేరవు. సాక్స్ వేసవిలో చెమట పట్టకుండా నిరోధించడమే కాకుండా శీతాకాలానికి కూడా మేలు చేస్తుంది. ఎందుకంటే ఆ సమయంలో సాక్స్ వేసుకోవడం వల్ల జలుబు నుంచి ఉపశమనం లభిస్తుంది. అలాగే ఇవి మీ పాదాలను వెచ్చగా ఉంచుతాయి. అలర్జీ సమస్య: సాక్స్ ధరించకుండా షూస్ వేసుకునే వారికి అలర్జీ సమస్య రావచ్చు. కొంతమందికి చాలా సున్నితమైన చర్మం ఉంటుంది. అందుకే అబ్బాయిలు, సాక్స్ లేకుండా బూట్లు ధరించవద్దు. లేకపోతే చాలా మందికి పాదాలకు చెమట పట్టడం, వారి పాదాలకు అనేక రకాల సమస్యలు వస్తాయి. చెమట బూట్ల లోపల తేమను మరింత పెంచుతుంది. ఇది వివిధ రకాల బ్యాక్టీరియా లేదా ఫంగల్ ఇన్ఫెక్షన్లకు దారి తీస్తుంది. కొందరికి సాక్స్ లేకుండా షూస్ వేసుకోవడం వల్ల పాదాలకు పొక్కులు వస్తాయి. ఇలాంటి సమస్య రాకుండా ఉండాలంటే బూట్లు వేసుకునే వారు సాక్స్ ధరించాలని నిపుణులు చెబుతున్నారు.

## పనిలో బద్ధకమా.. ఈ ఒక్క విటమిన్‌తో ఉత్సాహం ఉరకలేస్తుంది..



ఎంత మంచి ఆహారం తీసుకున్నా ఒంటికి పట్టదు. రోజూవారి పనులు కూడా సక్రమంగా చేసుకోలేం. ఎప్పుడూ దిగాలుగా ఉండటం.. జుట్టు రాలిపోవడం వంటివన్నీ విటమిన్ డి లోపించిందని తెలిపే సంకేతాలే. ఆరోగ్యానికి అత్యవసరమైన విటమిన్ డి లోపం, అది మన శరీరంపై చూపే ప్రభావాలు మన జీవితాన్నే మార్చేస్తాయి. శరీరంలో విటమిన్ డి తగినంత లేకపోతే అలసట, మూడ్ స్వింగ్స్, కండరాల నొప్పి వంటి సమస్యలు వస్తాయి. విటమిన్ డి లోపం భారతదేశంలో, ముఖ్యంగా మహిళలు, పట్టణ ప్రాంతాల వారిలో ఎక్కువ అని అధ్యయనాలు చెబుతున్నాయి. చాలామందికి లోపం ఉన్నట్లు తెలియదు. విటమిన్ డి ఎముకల బలం, కాల్షియం శోషణ, మానసిక స్థితిని నియంత్రించడం, కండరాల పనితీరు, రోగనిరోధక శక్తికి కీలకం. సూర్యరశ్మి దీనికి ప్రధాన సహజ వనరు. కానీ, ఆధునిక జీవనశైలి, కాలుష్యం, సన్‌స్క్రీన్ వాడకం దీని ఉత్పత్తిని అడ్డుకుంటాయి. విటమిన్ డి లోపం సూచనలు: దీర్ఘకాలిక అలసట, నీరసం, కండరాల బలహీనత, జుట్టు పలచబడటం, తరచుగా అంటువ్యాధులు, మతిమరుపు, ఎముకల నొప్పి ప్రధాన లక్షణాలు. సూర్యరశ్మి తక్కువగా తగలడం, కాలుష్యం, ముదురు రంగు చర్మం, సరైన ఆహారం లేకపోవడం, సన్‌స్క్రీన్ అధిక వినియోగం, కొన్ని ఆరోగ్య సమస్యలు లోపానికి కారణాలు. సూర్యరశ్మి: ప్రతిరోజూ ఉదయం 7-10 గంటల మధ్య 15-20 నిమిషాలు సన్‌స్క్రీన్ లేకుండా సూర్యరశ్మి శరీరాన్ని తాకేలా చూసుకోవాలి. సాయంత్రం 4 గంటల ఎండ వల్ల కూడా ఈ లోపం తీరుతుంది. ఆహారం: విటమిన్ డి సమృద్ధిగా ఉన్న ఆహారాలు తీసుకోండి. చేపలు (సాల్మన్, మాకెరెల్, సార్డిన్‌లు), గుడ్డు పచ్చసొన, బలవర్ధకమైన పాలు, పెరుగు, తృణధాన్యాలు, చీజ్, సూర్యరశ్మి తగిలిన పుట్టగొడుగులు, ఆవు పాలు లేదా సోయా పాలు, కాడ్ లివర్ ఆయిల్ (వైద్యుల సలహా మేరకు) వంటివి ఆహారంలో చేర్చుకోవాలి. శోషణ మెరుగుపడటం: విటమిన్ డి ఉన్న ఆహారాలను ఆరోగ్యకరమైన కొవ్వులతో కలిపి తీసుకోండి. ఒమేగా-3 వనరులను జోడించండి. ఆల్కహాల్, ప్రాసెస్ చేసిన ఆహారాలు తగ్గించండి. సూర్యరశ్మి, సరైన ఆహార ఎంపికలతో విటమిన్ డి లోపాన్ని సహజంగా పరిష్కరించడం వల్ల శక్తి, మానసిక స్థితి, ఆరోగ్యం గణనీయంగా మెరుగుపడతాయి.

## వర్షపు నీరు తాగడం మంచిదేనా?



వర్షంలో తడవడం ఇష్టం ఉండని వారు ఎవరుంటారు చెప్పండి. చాలా మంది చాలా సంతోషంగా వర్షంలో తడుస్తూ గంతులేస్తారు. ఇంకొంతమంది అయితే ఏకంగా వర్షం నీరు తాగుతుంటారు. మరి మీరు ఎప్పుడైనా ఆలోచించారా? అసలు వర్షంలో తడవడం ఒకేకానీ, వర్షం నీరు తాగడం మంచిదేనా? దీని వలన లాభాలు ఉన్నాయా? నష్టాలు ఉన్నాయా అని. వర్షం నీరు చాలా శుభ్రంగా కనిపిస్తుంది. అంతే కాకుండా ఈ నీరు చాలా స్వచ్ఛమైనది అని చెబుతుంటారు. కానీ కొంత మంది వీటిని తాగొచ్చు అని చెబితే, మన పెద్దవారు మాత్రం అస్సలే వర్షం నీరు తాగకూడదని చెబుతారు. వర్షం నీరు స్వచ్ఛమైనే అయినప్పటికీ ఎందుకు తాగకూడదు అనే ప్రశ్న చాలా మందిలో మెదులుతుంటుంది. అయితే మంచినీరు ( స్వేదన జలం) ఆవిరి నుంచి తయారు అవుతుంది. అందువలన ఇది చాలా స్వచ్ఛమైన నీరు అంటారు. అంతే కాకుండా నీరు శుద్ధి జరగడం వలన వీటిలో మలినాలు నశించి, ఇవి శుభ్రంగా ఉంటాయి. అందుకే మంచినీరును చాలా మంది తాగుతుంటారు.అయితే వర్షపు నీరు కూడా మంచినీరు లాగానే కథా అనే ప్రశ్న చాలా మందిలో తలెత్తుతుంది. ఎందుకంటే? మేఘాలు భూమిపై ఉన్న నీటిని ఆవిరి రూపంలో తీసుకుంటాయి. అందువలన ఈ వర్షపు నీరు కూడా మంచినీరే కదా? కానీ కొందరు వర్షం నీరు అపరిశుభ్రమైన నీరు అని ఎందుకు అంటారు అనే ఆలోచన వస్తుంది. అయితే మంచినీరు బహిరంగ ప్రదేశాలలో తయారు చేయబడనందున అవి సురక్షితమైన నీరు. కానీ వర్షం నీరు మేఘాలు, కణాల రూపంలో నీటిని స్వేకరిస్తుంది. ఆ సమయంలో అది నీటితో పాటు అనేక మలినాలను కూడా తీసుకెళు ‍ొందంట. ముఖ్యంగా దుమ్ము, మట్టి, %యూ2-చీూఇ% వంటి వాయువులు మరియు కీటకాలను మోసుకెళ్లి తిరిగి వస్తుంది. అదువలన వర్షం నీరు తాగడానికి పనికిరావు అంటున్నారు నిపుణులు. కొంత మంది వర్షం నీరు చూడటానికి చాలా శుభ్రంగా ఉంటాయని తాగుతుంటారు. కానీ ఎప్పుడూ అలా చేయకూడదు. వా టిని పరీక్షించిన తర్వాతే తాగాలి. ఎందుకంటే వాటిలో ఎక్కువ మలినాలు ఉంటాయి, ఇవి జలుబు, దగ్గు, వైరల్ ఫీవర్‌కు కారణం అవుతాయంటున్నారు. ముఖ్యంగా మొదటి సారి కురిసే వర్షంలో తడవడం, ఆ నీటిని తాగడం అనేది అస్సలే మంచిది కాదంట. ఎందుకంటే? మొదటి సారి కురిసే వర్షపు నీరులో,వాతావరణం నుండి వచ్చే ధూళి ,కాలుష్య కణాలను ఎక్కువగా కలిగి ఉంటుందంట. ఇది శరీరంపై తీవ్ర ప్రభావం చూపిస్తుందంట. అందుకే మొదటిసారి వర్షంలో తడవకూడదంటారు పెద్దలు.

## కాళేశ్వరంలో బిళ్ళలాట స్థావరంపై
# సీసీఎస్ పోలీసుల దాడి.

**-రేగొండ సర్పంచ్ భర్త వారణాసి అజయ్‌తో పాటు మరో నలుగురు కస్టడీ**

రేగొండ, కాళేశ్వరం, మే 23 (భారత శక్తి) ప్రసిద్ధ పుణ్యక్షేత్రమై జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరంలో భక్తులను మోసం చేస్తూ, గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న బిళ్ళలాట (జూదం) స్థావరంపై జయశంకర్ భూపాలపల్లి జిల్లా సీసీఎస్ మరియు స్థానిక పోలీసులు సంయుక్తంగా దాడి చేశారు. ఈ దాడిలో రేగొండ మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు, స్థానిక సర్పంచ్ భర్త వారణాసి అజయ్‌తో పాటు మరో నలుగురు కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు పట్టుకున్నారు.పోలీసుల కథనం ప్రకారం. కాళేశ్వరం త్రివేణి సంగమ క్షేత్రానికి దర్శనార్థం వచ్చే అమాయక భక్తులను ఆసరాగా చేసుకొని కొందరు ముఠాగా ఏర్పడ్డారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చనే ఆశ చూపిస్తూ, 'బిళ్ళలాట' పేరుతో వారిని బురిడీ కొట్టిస్తున్నారు. భక్తుల నుంచి పెద్ద ఎత్తున నగదు లాగుతున్నారనే సమాచారంతో భూపాలపల్లి సీసీఎస్ పోలీసులు రంగంలోకి దిగారు.

**పోలీస్ కస్టడీలో నిందితులు.**

శనివారం కాళేశ్వరంలో నిర్వహిస్తున్న ఈ జూద స్థావరంపై పోలీసులు అకస్మాత్తుగా దాడి చేశారు. ఈ తనిఖీల్లో రేగొండ సర్పంచ్ భర్త వారణాసి అజయ్ దొరికిపోయారు. ఆయనతో పాటు ఈ అక్రమ వసూళ్లకు, జూదానికి సహకరిస్తున్న రేగొండకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు పోడేటి శివ, కూరాకుల దేవేందర్, భరత్, శ్రీకాంతులను పోలీసులు పట్టుకొని అదుపులోకి తీసుకున్నారు.

అధికార పార్టీకి చెందిన ఒక సర్పంచ్ భర్త పుణ్యక్షేత్రంలో ఇలాంటి అక్రమాలకు పాల్పడుతూ పట్టుబడటం స్థానికంగా మరియు రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది.

## చైన్ స్నాచింగ్ కేసులో నిందితుడు అరెస్ట్




జగిత్యాల, మే 23( భారత శక్తి ప్రతినిధి): ధర్మపురి పట్టణంలోని కోనేరు వద్ద మహిళ మెడలోని 2 తులాల పుస్తెల తాడును చోరీ చేసిన కేసులో తిప్పని అంజన్న (45), మంచిర్యాల జిల్లా వాసిని ధర్మపురి పోలీసులు అరెస్ట్ చేశారు. కేసు విచారణలో భాగంగా సీసీటీవీ పుటేజీలు, సోషల్ మీడియా ద్వారా సమాచారం సేకరించిన పోలీసులు మే 23 న ధర్మపురి లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం సమీపంలో నిందితుడిని అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి 2 తులాల పుస్తెల తాడు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.నిందితుడిని గుర్తించడంలో సహకరించిన వేముల సంతోష్, అప్పం రాజన్న, చీర్ల నర్సవ్వలను ఎస్సై జి. మహేష్ అభినందించారు. కేసును త్వరగా ఛేదించిన సీఐ ఎ.రాంనర్సింహారెడ్డి, ఎస్సై జి. మహేష్, పోలీస్ సిబ్బందిని డీఎస్పీ పురుషోత్తం రెడ్డి అభినందించారు.


## దేవరుప్పుల మండలం పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన మనీషా నెహ్రా ఐ పి ఎస్






జనగామ(భారత శక్తి)మే23: దేవరుప్పుల మండలం పోలీస్ స్టేషన్ ను ఎస్ ఐ సృజన్ కుమార్ ఆధ్వర్యంలో మనీషా నెహ్రా ఐ పి ఎస్ స్టేషన్ ఇన్స్పెక్షన్ లో బాగంగా క్రైమ్ వెహికిల్స్, కేసు ప్రాపర్టీస్, కోర్టు రూమ్, వర్క్ స్టేషన్ను, స్టేషన్ రికార్డ్స్ ను పరిశీలించారు.

## పెళ్లి రోజు జరుపుకుంటున్న కల్లు గీత కార్మిక సంఘము రాష్ట్ర అధ్యక్షులు ఎంవీ రమణ




జనగామ(భారత శక్తి)మే 23: కె జి కె ఎస్ కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమణ అన్న స్వర్ణ వదినలకు జనగామ జిల్లా కేజీకేఏస్ అధ్యక్షులు బూడిద గోపి, ప్రధాన కార్యదర్శి బాల్నే వెంకట మల్లయ్య, జిల్లా సోషల్ మీడియా అధ్యక్షులు మిట్ట బిక్షపతి గౌడ్ లు హృదయపూర్వక పెళ్లి రోజు శుభాకాంక్షలు తెలిపారు.

# మాటల ప్రభుత్వం కాదు...చేతల ప్రభుత్వం మాది!

**- ఇబ్రహీంపట్నం రూపురేఖలు మారుస్తా: ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి**

**- తుర్కయంజాల్, తొర్రూర్ పరిధుల్లో రూ. 8.9 కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభం**





ఇబ్రహీంపట్నం, మే 23 భారతశక్తి: గత ప్రాంతీయ పార్టీ (బీఆర్ఎస్) మాదిరిగా ప్రజలను మాటలతో మభ్యపెట్టే అలవాటు తమకు లేదని, చేతలతో చేసి చూపించడమే కాంగ్రెస్ ప్రభుత్వ విధానమని ఇబ్రహీంపట్నం శాసనసభ్యుడు (ఎమ్మెల్యే) మల్రెడ్డి రంగారెడ్డి స్పష్టం చేశాడు. ముఖ్యమంత్రి, మంత్రులతో నిరంతరం చర్చిస్తూ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ రూపురేఖలను మార్చడమే లక్ష్యంగా శ్రమిస్తున్నట్లు ప్రకటించాడు. శనివారం నియోజకవర్గ పరిధిలోని తొర్రూర్ పరిధిగల మునగనూర్, ఇంజాపూర్, బ్రాహ్మణపల్లితో పాటు తుర్కయంజాల్ పరిధిలోని రాగన్నగూడ, కమ్మగూడ, యంజాల్ లోని పలు ప్రాంతాల్లో ఆయన విస్తృతంగా పర్యటించాడు.

**- రూ. 8.9 కోట్లతో రహదారుల నిర్మాణం**

స్థానిక ప్రాంతాల్లో నెలకొన్న రవాణా ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక చొరవతో హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) ద్వారా రూ. 8.9 కోట్ల నిధులను మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే తెలిపాడు. ఈ నిధులతో పూర్తి చేసిన అంతర్గత సిమెంట్ రహదారులను (సీసీ రోడ్లను) స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఆయన ప్రారంభించాడు. గ్రామాలు, పట్టణాల్లో మౌలిక వసతుల కొరత లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు వివరించాడు.

**- సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట**

ఒకవైపు మౌలిక వసతుల కల్పనను పూర్తి చేస్తూనే, మరోవైపు పేదల కోసం సంక్షేమ పథకాలను పెద్ద ఎత్తున అమలు చేస్తున్నట్లు రంగారెడ్డి పేర్కొన్నాడు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతో పాటు, ఏళ్ల తరబడిగా నియోజకవర్గంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలన్నింటికీ శాశ్వత పరిష్కారం చూపుతున్నట్లు వెల్లడించాడు. నియోజకవర్గ ప్రగతి, పేదల సంక్షేమం కోసం ప్రజాప్రతినిధులంతా కలిసికట్టుగా రావాలని, రాజకీయాలకు అతీతంగా నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించాడు.

**- అడ్డుపడితే ప్రజలే బుద్ధి చెబుతారు!**

రాష్ట్ర ప్రభుత్వం దీర్ఘకాలిక ప్రణాళికలతో చేపడుతున్న ప్రగతి పనులకు ప్రతిపక్ష బీఆర్ఎస్ అడ్డుతగులుతోందని ఎమ్మెల్యే మండిపడ్డాడు. అభివృద్ధిని అడ్డుకునే ధోరణిని ఇలాగే కొనసాగిస్తే, ఆ పార్టీ నాయకులకు ప్రజలు గత ఎన్నికల కంటే ఘోరమైన రీతిలో బుద్ధి చెప్పడం ఖాయమని ఆయన హెచ్చరించాడు.

# బక్రీద్ వేళ 'శాంతి' మంత్రం!

- **సోషల్ మీడియా వదంతులు నమ్మొద్దు**
- **చట్టాన్ని చేతిలోకి తీసుకుంటే కఠిన చర్యలు**
- **ముస్లిం, గోరక్షక సంఘాలతో పోలీసుల ప్రత్యేక సమన్వయ భేటీ**
- **శాంతి,సమన్వయం,పారిశుద్ధం పాటించాలి: మల్కాజ్గిరి కమిషనరేట్ కమిషనర్లు**
- **సుమతి ఐ.పీ.ఎస్, వినయ్ కృష్ణారెడ్డి ఐ.ఏ.ఎస్**




నేరేడ్‌మెట్, మే 23: భారత శక్తి, త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగను పరస్పర సహకారంతో, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి.సుమతి (ఐపీఎస్) పిలుపునిచ్చారు. పండుగ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతిభద్రతలను కాపాడేందుకు పోలీస్ యంత్రాంగం అన్ని రకాల చర్యలు చేపట్టిందని ఆమె స్పష్టం చేశారు. నేరేడ్‌మెట్‌లోని సీపీ కార్యాలయంలో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి (ఐఏఎస్)తో కలిసి ముస్లిం ప్రతినిధులు, గోరక్షక సంఘాల సభ్యులతో ఆమె విడివిడిగా సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖల (మున్సిపాలిటీ, వెటర్నరీ, రెవెన్యూ, వాటర్‌వర్క్స్, ఫైర్, మెడికల్, ఆర్‌టీఓ) అధికారులు పాల్గొని పండుగ ఏర్పాట్లపై సమీక్షించారు.

**చట్టాన్ని చేతిలోకి తీసుకోవద్దు: సీపీ సుమతి.**

సమాజంలో ఐక్యతకు పండుగలు ప్రతీకలని, ఒకరి పట్ల ఒకరు గౌరవ భావాన్ని చాటుకోవాలని సీపీ సుమతి ఈ సందర్భంగా పేర్కొన్నారు. చట్టాన్ని ఎవరూ చేతిలోకి తీసుకోకూడదని స్పష్టం చేస్తూ, గోరక్షక సభ్యులకు పలు కీలక సూచనలు చేశారు:

దాడులు చేస్తే ఉపేక్షించేది లేదు: గోవులను తరలించే వాహనాలను అడ్డుకోవడం, వ్యక్తులపై దాడులు చేయడం, బలవంతంగా తనిఖీలు చేయడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవు.

సమాచారం పోలీసులకే ఇవ్వాలి: ఎక్కడైనా అనుమానాస్పద వాహనాలు లేదా అక్రమ రవాణా జరుగుతున్నట్లు గుర్తిస్తే తక్షణమే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలి తప్ప, స్వయంగా రంగంలోకి దిగకూడదు.సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా! "పండుగ రోజుల్లో ఎలాంటి అపోహలు, వదంతులు వ్యాప్తి చెందకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా సోషల్ మీడియా వేదికగా వచ్చే అసత్య ప్రచారాలను నమ్మవద్దు, వాటిని ఇతరులకు షేర్ చేయవద్దు."
బి.సుమతి, ఐపీఎస్ (పోలీస్ కమిషనర్)

**పరిశుభ్రత పాటించండి:**

మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి పండుగ పూట నగరంలో పరిశుభ్రత లోపించకుండా మున్సిపల్ యంత్రాంగం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తుందని మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు.
- ప్రభుత్వం అనుమతించిన నిర్ణీత ప్రదేశాల్లోనే జంతువధ (ఖుర్బానీ) నిర్వహించాలి.
- బహిరంగ ప్రదేశాలలో జంతు అవశేషాలను పారవేయకుండా, పరిశుభ్రత పాటిస్తూ మున్సిపల్ సిబ్బందికి ప్రజలు సహకరించాలి.



**సమస్యాత్మక ప్రాంతాల్లో 'సీసీ' నిఘా:**

శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా కమిషనరేట్ వ్యాప్తంగా సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి, అక్కడ సీసీ కెమెరాల ద్వారా 24 గంటలూ నిరంతర నిఘా ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. అనుమానాస్పద కదలికలపై నిఘా వర్గాలు నిరంతరం అప్రమత్తంగా ఉంటాయని తెలిపారు.

**ఉన్నతాధికారుల భారీ పటాలం:**

ఉమ్మడి సమన్వయంతో పండుగను విజయవంతం చేసేందుకు



పోలీస్ శాఖకు చెందిన ముగ్గురు కీలక డీసీపీలతో పాటు భారీగా ఉన్నతాధికారులు రంగంలోకి దిగారు. ఈ సమావేశంలో ఎల్బీనగర్ డీసీపీ అనురాధ, మల్కాజిగిరి డీసీపీ సిహెచ్.శ్రీధర్, ఉప్పల్ డీసీపీ సురేష్, ఎస్బీ డీసీపీ జి.నరసింహారెడ్డి, ఉమెన్ సేఫ్టీ డీసీపీ ఉషారాణి, అడ్మిన్ డీసీపీ ఇందిరా, ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాసులు, హెడ్ క్వార్టర్స్ డీసీపీ శ్యాంసుందర్‌తో పాటు పలువురు అడిషనల్ డీసీపీలు, ఏసీపీలు పాల్గొన్నారు.

# నంద్యాలలో ఘనంగా ప్రారంభమైన "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమం

**ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్**

**నంద్యాల,** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ "ఆపరేషన్ క్లీన్ స్వీప్" శనివారం నంద్యాల పురపాలక సంఘం పరిధిలో ఘనంగా ప్రారంభమైంది. నంద్యాల పట్టణంలోని ప్రముఖ వ్యాపార కేంద్రమైన గాంధీ చౌక్ లో గల కూరగాయల మార్కెట్ పరిసరాలలో ఈ పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. మంత్రిలు స్వయంగా చేతిలోకి చీపురు పట్టి, మార్కెట్ పరిసరాలను శుభ్రం చేయడం ద్వారా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 123 పట్టణ స్థానిక సంస్థలలో యు ఎల్ బి నేటి (మే 23) నుండి జూన్ 20, 2026 వరకు నెల రోజుల పాటు ఈ "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగుతుందని తెలిపారు. పట్టణాల్లోని అంతర్గత రహదారులు, మురుగు కాలువలు (డ్రైన్లు) మరియు ప్రజలు ఎక్కువగా తిరిగే మార్కెట్ ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడమే ఈ వినూత్న కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. "శుభ్రమైన రోడ్లు - శుభ్రమైన డ్రైన్లు - స్వచ్ఛమైన పరిసరాలు" అనే నినాదంతో ప్రతి ఒక్కరూ బాధ్యతగా కదలాలని, నంద్యాల పట్టణాన్ని రాష్ట్రంలోనే ఒక ఆదర్శవంతమైన స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దేందుకు పురపాలక అధికారులు, సిబ్బంది, వ్యాపారస్తులు మరియు స్థానిక ప్రజలు తమ వంతు సహకారాన్ని అందించి భాగస్వాములు కావాలని మంత్రి ఫరూక్ పిలుపునిచ్చారు.ఈ ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ కార్యక్రమంలో నంద్యాల మున్సిపల్ కమిషనర్ శేషన్న, ఎంఈ గుర్రప్ప, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, శానిటేషన్ సిబ్బంది, మున్సిపల్ కార్మికులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మరియు స్థానిక కూరగాయల మార్కెట్ వ్యాపారస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.



# పేదలకు ఉచిత వైద్యమే పరమావధి.

**- ఆరోగ్యశ్రీ నూతన సీఈఓ జెడ్. హనుమంత్ కొండిబా స్పష్టీకరణ.**

**- నూతన అధికారిని మర్యాదపూర్వకంగా కలిసిన ఉద్యోగుల సంఘం నేతలు.**



హైదరాబాద్, మే 23: భారత శక్తి, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేద ప్రజలకు నాణ్యమైన, పూర్తి ఉచిత వైద్య సేవలు అందించడమే మన మొదటి ప్రాధాన్యత కావాలని రాజీవ్ ఆరోగ్యశ్రీ ఆరోగ్య సంరక్షణ ట్రస్ట్ నూతన ప్రధాన కార్యనిర్వహణ అధికారి (సీఈఓ) జెడ్. హనుమంత్ కొండిబా పిలుపునిచ్చారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఆయనను శనివారం ఆరోగ్యశ్రీ



ఉద్యోగుల సంఘం ప్రతినిధులు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా నూతన సీఈఓకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు.

### - 'ఆరోగ్య మిత్ర'లదే కీలక పాత్ర

ఈ భేటీ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ, ఆరోగ్యశ్రీ నమ్మకంతో వచ్చే పేద రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత క్షేత్రస్థాయి సిబ్బందిపైనే ఉందన్నారు.

“రకరకాల అనారోగ్య సమస్యలతో ఆసుపత్రులకు వచ్చే రోగులు అత్యంత ఆశతో మొదటగా 'ఆరోగ్య మిత్ర'లనే సంప్రదిస్తారు. కాబట్టి సిబ్బంది మానవీయ కోణంలో స్పందించి, వారికి పూర్తి ఉచిత వైద్యం అందేలా బాధ్యతగా పని చేయాలి.”

**జెడ్. హనుమంత్ కొండిబా (సీఈఓ)**

పథకం ఆశయాలను నెరవేర్చడంలో ప్రతి ఒక్క ఉద్యోగి అంకితభావంతో సహకరించాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు.

### నూతన అధికారిని కలిసిన వారిలో..

నూతన సీఈఓను కలిసిన వారిలో ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గిరి యాదయ్య, ఉపాధ్యక్షుడు సుమన్, హైదరాబాద్ విభాగం అధ్యక్షుడు రాజు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రత్నం, నల్గొండ జిల్లా అధ్యక్షుడు నాగరాజు తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా పథకం అమలు తీరును, క్షేత్రస్థాయిలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు అంశాలను సంఘం నేతలు సీఈఓ దృష్టికి తీసుకెళ్లారు.

**- గిరి యాదయ్య, రాష్ట్ర అధ్యక్షుడు, ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సంఘం.**

# తాడి మ్యూజికల్ ఫెస్టివల్ కు వ్యతిరేకంగా గౌడ సంఘాల సమావేశం



ఎల్బీనగర్,మే 23 (భారత శక్తి): తాడి మ్యూజికల్ ఫెస్టివల్ పేరుతో జరుగుతున్న కుట్రను వ్యతిరేకిస్తూ సుందరయ్య విజ్ఞాన కేంద్రం, బాగ్ లింగంపల్లిలో గౌడ కల్లు గీత సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న అఖిల భారత గౌడ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కూరెళ్ల వేములయ్య గౌడ్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు బందారం అనిల్ గౌడ్, మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు సిలివేరు సంతోష్ గౌడ్.తాడి మ్యూజికల్ ఫెస్టివల్ పేరుతో గౌడల సంప్రదాయ కుల వృత్తిని కార్పొరేట్ శక్తులకు అప్పగించే కుట్రలను గౌడ సమాజం ఎట్టి పరిస్థితుల్లో సహించదని అఖిల భారత గౌడ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కూరెళ్ల వేములయ్య గౌడ్ హెచ్చరించారు.

ఎక్స్పీరియం ఈకో పార్క్ (జుఇజూవతీఱబవ జుషశీ ాఖతీఎ) యజమాని రామ్ దేవ్ రావు ఆధ్వర్యంలో నేటి ఆదివారం నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్న తాడి మ్యూజికల్ ఫెస్టివల్ కార్యక్రమం గౌడల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యగా ఆయన అభివర్ణించారు. తాటి చెట్టు, కల్లు గీత వృత్తి అనేవి గౌడల జీవనాధారం మాత్రమే కాకుండా తెలంగాణ సంస్కృతికి ప్రతీకలని పేర్కొన్నారు.ఒకవైపు కల్లుగీత కార్మికులు వృత్తిని కాపాడుకుంటూ ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతుంటే, మరో వైపు కార్పొరేట్ వ్యవస్థ తాడి పేరుతో ఈవెంట్లు నిర్వహించి కోట్ల రూపాయల వ్యాపారం చేయాలని చూడడం దారుణమన్నారు. కార్పొరేట్ సంస్థలు తాడి పేరుతో కార్యక్రమాలు ఎలా నిర్వహిస్తాయి?అని ఆయన ప్రశ్నించారు.రామ్ దేవ్ రావు పార్కులో అక్రమంగా ఏర్పాటు చేసిన తాడి చెట్ల స్థలాన్ని తాడి కార్పొరేషన్ కు అప్పగించి ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేసుకున్న గౌడ ఆత్మ గౌరవ నీరా కేఫ్ లో కల్లు గీతా వృత్తిదారులు మరియు గౌడ కల్లు గీతా కుల సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. దానివల్ల గౌడుల జీవనోపాధికి భరోసా కలుగుతుందని తెలిపారు.ఆదివారం జరగబోయే తాడి మ్యూజికల్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని వెంటనే రద్దు చేయాలని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ గౌడ్, తెలంగాణ రాష్ట్ర అబ్కారీ మంత్రి జూపల్లి కృష్ణ రావు, బీసీ వెల్ఫేర్ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ లను కలిసి సమస్యపై చర్చిస్తామని తెలిపారు.ఈ విషయంలో అగ్రకుల కార్పొరేట్ వ్యవస్థ వ్యవస్థాపకుడు రామ్ దేవ్ రావు వెనక్కి తగ్గకపోతే, రాబోయే కాలంలో గౌడ కుల ఆగ్రహాన్ని ఎదుర్కోక తప్పదని కూరెళ్ల వేములయ్య గౌడ్ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ అధ్యక్షులు బాలగౌని బాలరాజ్ గౌడ్, అయిలి వెంకన్న గౌడ్, అంబాల నారాయణ గౌడ్, బొమ్మగాని నాగేశ్వర్ రావు గౌడ్, ముద్దగౌని రామ్ మోహన్ గౌడ్, ప్రభాకర్ గౌడ్, జక్కా వీర స్వామీ గౌడ్, వట్టి కూటి రామారావు గౌడ్, సత్యం గౌడ్, కృష్ణ గౌడ్, రేవతి గౌడ్, విజయ్ కుమార్ గౌడ్ తదితర గౌడ సంఘాల నాయకులు పాలుగొన్నారు.

## కొత్త సంస్కరణలు..విద్యార్థులను బహుభాషా

# కోవిదులుగా తీర్చిదిద్దేలా.. త్రిభాషా సూత్రం..!

దేశవ్యాప్తంగా ఉన్న సీబీఎస్ఈ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ముఖ్య గమనిక. జాతీయ విద్యా విధానం చీజూ 2020 స్ఫూర్తితో పాఠశాల విద్యా వ్యవస్థలో సరికొత్త మార్పులకు బోర్డు శ్రీకారం చుట్టింది. ముఖ్యంగా 'త్రిభాషా సూత్రాన్ని' పటిష్టం చేస్తూ, పదో తరగతి బోర్డు పరీక్షలకు సంబంధించి నిబంధనలను కఠినతరం చేసింది. విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాలపై అవగాహన ఉంటే సరిపోదని, భాషా నైపుణ్యం కూడా కీలకమని భావించిన బోర్డు, మూడు స్థాయిల భాషా విధానాన్ని ఆర్ 1, ఆర్2, ఆర్3 ప్రవేశపెట్టింది. దీని ప్రకారం విద్యార్థులు ప్రాథమిక, మాధ్యమిక స్థాయిల్లో మూడు భాషలను అభ్యసించాల్సి ఉంటుంది. ఇందులో కనీసం రెండు భారతీయ భాషలు ఉండాలన్న నిబంధన మాతృభాషలకు, ఇతర ప్రాంతీయ భాషలకు పెద్దపీట వేస్తోంది.

### బోర్డు పరీక్షలకు అదే 'అర్హత'..!

ఈ కొత్త సంస్కరణల్లో అత్యంత కీలకమైన అంశం ఏమిటంటే.. ఎనిమిదో తరగతి వరకు విద్యార్థులు మూడు భాషల్లోనూ ఉత్తీర్ణత సాధించాల్సిందే. ఒకవేళ మూడో భాషలో విఫలమైతే, సదరు విద్యార్థి పదో తరగతి బోర్డు పరీక్షలు రాయడానికి అనర్హుడిగా పరిగణిస్తారు. ఈ నిబంధన ద్వారా భాషా సబ్జెక్టులను నిర్లక్ష్యం చేసే ధోరణికి అడ్డుకట్ట పడనుంది. ఈ విద్యా సంస్కరణలను బోర్డు ఒక్కసారిగా కాకుండా దశలవారీగా అమలు చేయనుంది. 2026-27 విద్యాసంవత్సరం ఆరో తరగతి నుంచి ఈ విధానం అధికారికంగా ప్రారంభమవుతుంది. 2030-31నాటికి పదో తరగతి వరకు పూర్తిస్థాయిలో త్రిభాషా సూత్రం అమల్లోకి వస్తుంది. పాఠ్యపుస్తకాలు ఇంకా పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానప్పటికీ, అప్పటివరకు స్థానిక వనరులు లేదా రాష్ట్ర బోర్డుల పుస్తకాలను వాడుకోవాలని సూచించడం ద్వారా బోర్డు తన పట్టుదలను చాటిచెప్పింది.

### సవాళ్లు ఏంటి ..? అవకాశాలు ఏంటి..?

ఈ నిర్ణయం విద్యార్థులపై కొంత భారంగా అనిపించినప్పటికీ, భవిష్యత్తులో ఉద్యోగ, ఉపాధి అవకాశాల రీత్యా బహుభాషా జ్ఞానం వరంగా మారనుంది. ముఖ్యంగా తెలుగు వంటి ప్రాంతీయ భాషలకు సీబీఎస్ఈ సిలబస్‌లో సముచిత స్థానం దక్కడం శుభపరిణామం. పాఠశాల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు ఈ మార్పును త్వరితగతిన అందిపుచ్చుకుని విద్యార్థులను సన్నద్ధం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



భారతీయ మూలాలను కాపాడుకుంటూనే, ఆధునిక విద్యను ప్రపంచస్థాయికి తీసుకెళ్లే ప్రయత్నంలో భాగంగానే ఈ 'భాషా విప్లవం' రూపుదిద్దుకుంది. ఆకుల సత్తిరాజు, సీనియర్ జర్నలిస్టు

## జి.హెచ్.ఎం.సి విలీన వార్డులకూ

# 20వేల లీటర్ల ఉచిత నీరివ్వాలి.

**- హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ ఎండీకి ఆల్ కాలనీస్ ఫెడరేషన్ విజ్ఞప్తి.**

**- సీఎంఓ దృష్టికి తీసుకెళ్తామని ఎండీ హామీ.**

హైదరాబాద్, మే 23: భారత శక్తి, జీహెచ్ఎంసీలో కొత్తగా విలీనమైన వార్డుల్లో 20,000 లీటర్ల ఉచిత నీటి పథకాన్ని అమలు చేయాలని ఆల్ కాలనీస్ ఫెడరేషన్ (ఏసీఎఫ్) ప్రతినిధులు కోరారు. బండ్లగూడ జాగీర్, హైదర్‌షాకోట్, కిస్మత్‌పూర్ వార్డుల ఏసీఎఫ్ ప్రతినిధి బృందం శుక్రవారం హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) అశోక్ రెడ్డిని కలిసి ఈ మేరకు ఒక వినతిపత్రం సమర్పించింది.

### - ఉచిత నీటి పథకం వర్తింపజేయాలి

తాము జీహెచ్ఎంసీ పరిధిలోనే ఉంటున్నప్పటికీ... బండ్లగూడ జాగీర్, కిస్మత్‌పూర్, హైదర్‌షాకోట్ ప్రాంతాల ప్రజలకు ఇప్పటివరకు ఉచిత నీటి పథకం లబ్ధి చేకూరలేదని ప్రతినిధి బృందం ఎండీకి వివరించింది. ఇప్పటికైనా స్పందించి ఈ పథకాన్ని తమ వార్డులకూ వర్తింపజేయాలని కోరింది. అలాగే గంధంగూడతో పాటు ఆయా వార్డుల్లో వినియోగంలో లేని నీటి రిజర్వాయర్లను వెంటనే పునరుద్ధరించి, ప్రజలకు నీటి సరఫరాను పెంచాలని విజ్ఞప్తి చేసింది.

### పరిశీలనకు ఎండీ ఆదేశం

వినతిపై సానుకూలంగా స్పందించిన ఎండీ అశోక్ రెడ్డి... ఉచిత నీటి సరఫరా అంశాన్ని ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ) దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా, ప్రస్తుతం వినియోగంలో లేని రిజర్వాయర్లను వెంటనే తనిఖీ చేసి, వాటిని ప్రజా వినియోగానికి అందుబాటులోకి తీసుకురావాలని



అధికారులను ఆదేశించారు. ఎండీని కలిసిన వారిలో ఏసీఎఫ్ అధ్యక్షుడు వినయ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరేందర్ బాబు, ఉపాధ్యక్షుడు నదీమ్, కార్యవర్గ సభ్యులు విజయ్ పద్మనాభన్, రవి రాజా ఉన్నారు. సానుకూలంగా స్పందించిన ఎండీకి ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు.

# సైబర్ వంచకుల ఆటకట్టించిన మల్కాజ్‌గిరి పోలీసులు

**- వారం రోజుల్లో 5 అంతర్రాష్ట్ర కేసులు ఛేద్యం.. ఏడుగురు నిందితుల అరెస్టు**

**- రూ. 23.30 లక్షల నగదు రికవరీ.. బాధితుల ఖాతాలకు జమ**

**- 'డిజిటల్ అరెస్ట్', నకిలీ పెట్టుబడుల పేరిట కోట్ల దోపిడీ.**







మల్కాజ్‌గిరి, మే 23: భారత శక్తి, సాంకేతిక పరిజ్ఞానాన్ని అడ్డం పెట్టుకుని అమాయకులకు ఆశచూపుతూ, భయపెడుతూ కోట్ల రూపాయలు గుంజుతున్న అంతర్రాష్ట్ర సైబర్ నేరగాళ్ల నెట్‌వర్క్‌ను మల్కాజ్‌గిరి కమిషనరేట్ సైబర్ క్రైమ్ పోలీసులు విజయవంతంగా ఛేదించారు. గడిచిన వారం రోజుల్లో (మే 17 – 23) తీవ్రంగా శ్రమించి, దేశవ్యాప్తంగా విస్తరించిన ఐదు ప్రధాన కేసుల్లోని గుట్టును రట్టు చేశారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా ఏడుగురు నిందితులను అరెస్టు చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. అంతేకాకుండా, బాధితులకు ఊరట కలిగిస్తూ గౌరవ న్యాయస్థానం ద్వారా రూ. 23,30,066/- నగదును రికవరీ చేసి, తిరిగి బాధితుల ఖాతాలకే విజయవంతంగా జమ చేయించారు.

### - ఖాతాలు అద్దెకిస్తూ.. కోట్లు కొల్లగొడుతూ..

పోలీసులు ఛేదించిన 5 కేసుల వివరాలను పరిశీలిస్తే సైబర్ కేటుగాళ్లు ఎంతలా బరితెగిస్తున్నారో స్పష్టమవుతోంది. ఇందులో 3 కేసులు నకిలీ పెట్టుబడి (ఇన్వెస్ట్‌మెంట్) మోసాలకు సంబంధించినవి కాగా, ఒక 'డిజిటల్ అరెస్ట్' కేసు, మరొకటి ఖాతాదారుడి ప్రమేయం లేని 'అనధికార లావాదేవీల' కేసు ఉన్నాయి. అరెస్టయిన నిందితులంతా సైబర్ నేరగాళ్లకు తమ బ్యాంకు ఖాతాలను (మ్యూల్ అకౌంట్లు) కమిషన్ల ఆశతో అద్దెకు ఇస్తూ దేశవ్యాప్త మోసాలకు సహకరిస్తున్నట్లు దర్యాప్తులో తేలింది.

### - సంచలనం సృష్టించిన ఆ 5 మోసాలు ఇవే:

### -1.భయపెట్టి 'డిజిటల్ అరెస్ట్'.. రూ. 1.66 కోట్ల దోపిడీ:

సిబిఐ (జదీ×) అధికారులమంటూ నకిలీ పత్రాలు, వాట్సాప్ వీడియో కాల్స్‌తో భయపెట్టి ఒక నిరపరాధిపై మానవ అక్రమ రవాణా, మనీ లాండరింగ్ ఆరోపణలు మోపారు. సుప్రీంకోర్టు మీ పేరిట వారెంట్ జారీ చేసిందని నమ్మించి, కేసుల నుంచి విముక్తి కోసం 'వెరిఫికేషన్' పేరిట బాధితుడి నుండి ఏకంగా రూ. 1.66 కోట్లు కాజేశారు. ఈ కేసులో మ్యూల్ ఖాతాలు సమకూర్చిన పండితి క్రాంతి కుమార్, వోర్సు నాగరాజు (సూర్యాపేట జిల్లా) అనే ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు.

### - 2. ప్రమేయం లేకుండానే రూ. 21.70 లక్షలు మాయం:

బ్యాంక్ ఆఫ్ బరోడా ఖాతా కలిగిన ఒక వ్యక్తికి ఎలాంటి ఓటిపి (ఴూ) లేదా సమాచారం రాకుండానే, సాంకేతిక లోపాలను ఆసరాగా చేసుకుని విడతల వారీగా రూ. 21,70,000/- డెబిట్ చేసి మళ్లించారు. దీనికి సహకరించిన అంబర్ శ్రీనివాస్, వాగుమరి శంభు వెంకటేష్ (నిజామాబాద్, కామారెడ్డి)లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

### 3. నకిలీ లాభాల స్క్రీన్‌షాట్లతో రూ. 1.16 కోట్లు స్వాహా:

వాటా మార్కెట్ (షేర్ మార్కెట్) పెట్టుబడుల పేరిట నకిలీ వెబ్‌సైట్ ద్వారా హయాత్‌నగర్‌కు చెందిన ఒక వ్యక్తికి ప్రతిరోజూ నకిలీ లాభాల స్క్రీన్‌షాట్లను చూపిస్తూ నమ్మించారు. దీంతో సదరు బాధితుడు రూ. 1,16,56,813/- పెట్టుబడి పెట్టి మోసపోయాడు. ఈ మోసానికి సహకరించిన హైదరాబాద్ గచ్చిబౌలికి చెందిన కొమర నారాయణ స్వామిని పోలీసులు అరెస్ట్ చేశారు.

### - 4.లండన్ ప్రతినిధులమంటూ 'గోల్డ్ ట్రేడింగ్' వంచన:

లండన్‌కు చెందిన ఆర్థిక సంస్థ ప్రతినిధులమంటూ, ఒక మహిళ ఫైనాన్షియల్ అడ్వైజర్‌గా నటిస్తూ బాధితుడితో బంగారం ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెట్టించింది. చివరకు విత్‌డ్రా చేసుకునే సమయంలో సర్వీస్ టాక్స్, ఫీజులంటూ మరికొంత డిమాండ్ చేయడంతో తాను రూ. 7,16,762/- మోసపోయానని బాధితుడు గ్రహించాడు. ఈ కేసులో కరీంనగర్‌కు చెందిన మదుప రమేష్‌ను పోలీసులు కస్టడీకి తీసుకున్నారు.

### - 5. టెలిగ్రామ్ వేదికగా బిట్‌కాయిన్ మోసం:

టెలిగ్రామ్ యాప్ ద్వారా ప్రొఫెషనల్ బిట్‌కాయిన్ ట్రేడర్‌గా పరిచయమై, నకిలీ లాభాల పట్టికలతో నమ్మించి క్యూఆర్ కోడ్‌లు, యూపీఐ ఐడీల ద్వారా బాధితుడి నుండి రూ. 1.68 కోట్లు బదిలీ చేయించుకుని బోర్డు తిప్పేశారు. ఈ కేసులోనూ పైన పేర్కొన్న కొమర నారాయణ స్వామి తన బ్యాంకు ఖాతాను నేరగాళ్లకు అందించినట్లు తేలింది.

### -జాగ్రత్తలు తప్పనిసరి: సైబర్ పోలీసుల హెచ్చరిక

ఆన్‌లైన్ ప్రపంచంలో నెటిజన్లు క్రింది జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని మల్కాజ్‌గిరి సైబర్ క్రైమ్ పోలీసులు స్పష్టం చేశారు:

- **అమిత లాభాల ఆశ వద్దు:** తక్కువ సమయంలో అసాధారణమైన అధిక లాభాలు, గ్యారెంటీ రిటర్న్లు ఇస్తామనే వెబ్‌సైట్లు/యాప్‌లను నమ్మవద్దు.

**లింక్‌లపై క్లిక్ చేయవద్దు:** వాట్సాప్, ఎస్ఎమ్ఎస్ లేదా ఈమెయిల్స్‌లో వచ్చే గుర్తుతెలియని లింక్‌లను క్లిక్ చేయడం, యాప్‌లను డౌన్‌లోడ్ చేయడం చేయవద్దు.

**వివరాలు గోప్యం:**
**బ్యాంక్ ఖాతా వివరాలు, పాన్, ఆధార్, లేదా ఓటిపిలను ఎవరికీ చెప్పవద్దు. విత్‌డ్రా సమయంలో 'ప్రాఫిట్ టాక్స్' అడిగితే అది 100% మోసమే.**

- **భయపడకండి:** ఏ ప్రభుత్వ లేదా చట్ట అమలు సంస్థ కూడా ఆన్‌లైన్‌లో 'డిజిటల్ అరెస్ట్' చేయదు. ఎవరైనా బెదిరిస్తే భయపడి డబ్బులు పంపకుండా, తక్షణమే పోలీసులను ఆశ్రయించండి.
- **తుది సూచన:** ఒకవేళ సైబర్ మోసానికి గురైతే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా గోల్డెన్ అవర్ (తొలి గంట)లోనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయాలి. లేదా జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్ (www.cybercrimes.gov.in) లో ఫిర్యాదు నమోదు చేయాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.



# దోమల బెడదను
## నివారించే వంటింటి చిట్కాలు..

వర్షాకాలం వచ్చిన వెంటనే ఇళ్లలో దోమల బెడద కూడా మొదలవుతుంది. దోమలతో రాత్రుళ్లు నిద్ర ఉండదు. కుడితే దురద, మంట, జ్వరం వంటి తీవ్ర ఇబ్బందులను కలిగించడమే కాకుండా డెంగ్యూ, మలేరియా వంటి తీవ్రమైన వ్యాధుల ప్రమాదాన్ని కూడా పెంచుతాయి. సాధారణంగా ప్రజలు దోమలను తరిమికొట్టడానికి కాయిల్స్ లేదా ద్రవాలను ఉపయోగిస్తారు. కానీ వాటిలో ఉపయోగించే రసాయనాల కారణంగా ఇతర అనారోగాలను కొని తెచ్చుకోవాల్సి వస్తుంది.. అందుకే ప్రజలు సహజ పద్ధతులను వెతుకుతుంటారు. పాత రోజుల్లో దోమలను తరిమికొట్టడానికి వేప ఆకులతో పొగబెట్టేవారు. కానీ దానికి అలవాటు లేని వారు ఈ పొగతో సమస్యలను ఎదుర్కొంటారు. అటువంటి పరిస్థితిలో, వేపను ఎలా ఉపయోగించాలో మరిన్ని మార్గాలను ఇక్కడ తెలుసుకుందాం...ఇది దోమలను వదిలించుకోవడానికి మీకు సహాయపడుతుంది. పొగ వంటి సమస్య కూడా ఉండదు. దోమలను వదిలించుకోవడానికి ఇది సులభమైన మార్గం . మీరు కొన్ని వేప ఆకులను తీసుకొని నీటిలో బాగా మరిగించాలి. నీటి రంగు మారి ఆకులు మృదువుగా మారినప్పుడు, నీటిని చల్లబరిచిన తర్వాత ఫిల్టర్ చేయండి. ఇప్పుడు ఈ ద్రావణాన్ని స్ప్రే బాటిల్‌లో నింపి ఇంటి మూలల్లో, కర్టెన్లలు, దోమలు ఎక్కువగా కనిపించే ప్రదేశాలలో స్ప్రే చేయండి. దోమలు దాని వాసన కారణంగా పారిపోతాయి. వేప ఆకులను ఉంచడం వల్ల దోమలు ఇంట్లోకి రాకుండా నిరోధించడానికి సహజ అవరోధంగా పనిచేస్తుంది. తాజా వేప ఆకులను తీసుకొని వాటిని మెష్ చేసిన కిటికీలు, తలుపులు లేదా వెంటిలేషన్ ఉన్న ప్రదేశాలపై వేలాడదీయండి లేదా ఉంచండి. వేప వాసన దోమలు ఇంట్లోకి రాకుండా నిరోధిస్తుంది. మీకు కావాలంటే, మీరు వాటిని బాత్రూమ్ కిటికీపై కూడా ఉంచవచ్చు. వేప పేస్ట్ తయారు చేసుకుని చర్మానికి అప్లై చేసుకోవటం వల్ల చర్మాన్ని దోమల నుండి రక్షించడంలో సహాయపడుతుంది. తాజా వేప ఆకులను గ్రైండ్ చేసి పేస్ట్ తయారు చేసుకోండి. మీకు కావాలంటే, మీరు దానికి కొంచెం కొబ్బరి నూనె కూడా యాడ్ చేసుకోవచ్చు. ఇప్పుడు ఈ పేస్ట్‌ను పడుకునే ముందు చేతులు, కాళ్ళు, మెడపై రాయండి. దీని బలమైన వాసన దోమలు మీ దగ్గరికి రానివ్వదు, ఇది పిల్లలకు కూడా సురక్షితం. పొగతో ఇబ్బంది లేకుంటే.. వేప ఆకులను కాల్చడం వల్ల ఉపయోగకరంగా ఉంటుంది. ఒక చిన్న గిన్నెలో లేదా ఏదైనా మట్టి కుండలో కొన్ని వేప ఆకులను కాల్చండి. దీనివల్ల చాలా తేలికపాటి పొగ వస్తుంది. ఇది దోమలను తరిమికొట్టడంలో ప్రభావవంతంగా పనిచేస్తుంది. ఇది ఎలాంటి సమస్యను కలిగించదు. అయితే, పిల్లలు, పెంపుడు జంతువులను దాని నుండి దూరంగా ఉంచండి. ఇంట్లో దోమలను వదిలించుకోవడానికి మీరు వేప ఆకులతో తయారు చేసిన నీటితో ఫ్లోర్ క్లీన్ చేసుకోవచ్చు. మీరు స్ప్రే ద్రావణాన్ని తయారు చేసినట్లే, దానిలో నీటి పరిమాణాన్ని పెంచి చల్లబరచండి. మీరు ఇంటిని తుడుచుకున్నప్పుడు ఈ నీటిని కలపండి. ఇది దోమలు, నేలపై నివసించే గుడ్లను తొలగించడంలో సహాయపడుతుంది. వేప వాసన కారణంగా దోమలు పారిపోతాయి. మీరు కావాలనుకుంటే వేప నూనెను కూడా వాడుకొవచ్చు.

# చేతికి స్మార్ట్ వాచ్ వాడుతుంటే ఈ జాగ్రత్తలు తప్పనిసరి..



చేతికి స్మార్ట్ వాచ్ వాడుతున్నప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం అవసరం. ముఖ్యంగా, ఛార్జింగ్ చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి, ఎందుకంటే వాచ్ కిందపడే ప్రమాదం ఉంది. అలాగే, వాచ్ ని మణికట్టు నుండి తీసి ఛార్జింగ్ పెట్టేటప్పుడు కూడా జాగ్రత్తగా ఉండాలి. ప్రస్తుతం దాదాపు అందరి చేతికి స్మార్ట్ వాచ్ కనిపిస్తుంది. ఇందులో నడిచే అడుగులను లెక్కించడంతో పాటు హార్ట్ రేట్, స్లీప్ మోనిటర్స్ చెక్ చేసుకోవచ్చు. అలాగే మీ స్మార్ట్?ఫోన్?కి కనెక్ట్ చేసుకొని మెసేజులు చూడవచ్చు, వాట్సాప్ నోటిఫికెషన్స్ చెక్ చేయవచ్చు, కాల్స్ కూడా మాట్లావచ్చు. అయితే ఇన్ని ఫీచర్స్ ఉన్న స్మార్ట్ వాచ్ వాడకం విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. కొంతమందికి స్మార్ట్ వాచ్ వల్ల చర్మ సమస్యలు రావచ్చు. వాచ్ ని చాలా గట్టిగా కాకుండా, కొంచెం వదులుగా ఉండేలా కట్టుకోవడం మంచిది. కొందరు స్మార్ట్ వాచ్?ల నుండి వచ్చే రేడియేషన్ వల్ల తలనొప్పి లేదా వికారం లాంటి సమస్యలు వస్తున్నాయని అంటున్నారు. అలాంటి సమస్యలు ఉంటే వాచ్?ని వాడటం తగ్గించాలి లేదా పూర్తిగా మానేయాలి. స్మార్ట్ వాచ్ వాడటం వల్ల కొందరికి నిద్రలేమి సమస్యలు వస్తున్నాయని కూడా చెబుతున్నారు. కాబట్టి, నిద్రపోయే ముందు స్మార్ట్ వాచ్?ని తీసివేయడం మంచిది. స్మార్ట్ వాచ్?లు కొన్ని నీటి నిరోధకత కలిగి ఉన్నప్పటికీ, వాటిని ఎక్కువసేపు నీటిలో ఉంచడం మంచిది కాదు. అందుకే వీటీని నీటికి దూరంగా ఉంచండి. వాచ్‌ని ఛార్జింగ్ పెట్టేటప్పుడు, అది ఎక్కువ వేడెక్కుతుందో లేదో గమనించాలి. వేడెక్కుతుంటే, ఛార్జింగ్ ఆపేయడం మంచిది. స్మార్ట్ వాచ్?లలో అనేక ఫీచర్లు ఉన్నప్పటికీ, అన్ని ఫీచర్లను ఉపయోగించకపోవచ్చు. కాబట్టి, మీకు అవసరమైన ఫీచర్లను మాత్రమే ఉపయోగించడం మంచిది. స్మార్ట్ వాచ్ కేవలం బరువు తగ్గడానికి మాత్రమే ఉపయోగపడదు. ఇది మీ ఆరోగ్యానికి సంబంధించిన అనేక విషయాలను ట్రాక్ చేస్తుంది. అయితే దీన్ని జాగ్రత్తగా వాడటం ముఖ్యం అంటున్నారు నిపుణులు. లేదంటే అనారోగ్య సమస్య పెరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

# పసుపు, ఆకుపచ్చ, తెలుపు...
## ఏ గుమ్మడికాయ ఆరోగ్యానికి మంచిది..?



ఆకుపచ్చ, పసుపు, తెలుపు రంగులలో ఉండే గుమ్మడికాయలన్నీ ఒకటే అయినప్పటికీ, మూడింటికి వేర్వేరు రంగులు, ఆకారాలు ఎందుకు ఉన్నాయి? సాధారణంగా మనం దీనిపై దృష్టి పెట్టము. మార్కెట్లో మనం చూసేది కొంటాము. కానీ, నిపుణుల అభిప్రాయం ప్రకారం, వివిధ రంగులు, రూపాల్లో కనిపించే ఈ కూరగాయ ఔషధ గుణాలలో కూడా భారీ వ్యత్యాసాన్ని కలిగి ఉంటుందని ఆయుర్వేద ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. మార్కెట్లో లభించే తెలుపు, పసుపు, ఆకుపచ్చ గుమ్మడికాయలు రూపాన్ని బట్టి మాత్రమే కాకుండా రుచి, లక్షణాలలో కూడా భిన్నంగా ఉంటాయి. ఈ మూడింటి మధ్య తేడా ఏమిటి..? ఎవరు ఏ గుమ్మడికాయను కొనాలి..? ప్రతి దాని ఆరోగ్య ప్రయోజనాలు ఏమిటో తప్పనిసరిగా తెలుసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే. ఒక్కో రంగు గుమ్మడి కాయలో ఒక్కో రకమైన ఆరోగ్య ప్రయోజనాలు కలిగి ఉంటుందని చెబుతున్నారు. ఆయా అవసరాలను బట్టి వాటిని వాడుకోవాలని సూచిస్తున్నారు. అందుకే పసుపు, ఆకుపచ్చ లేదా తెలుపు.. ఏ గుమ్మడికాయ ఆరోగ్యానికి మంచిది? ఆకుపచ్చ, పసుపు, తెలుపు గుమ్మడికాయల మధ్య తేడా ఏమిటి అనే ప్రశ్న తరచుగా చాలా మంది మనస్సులో తలెత్తుతుంది. గుమ్మడికాయలు అయినప్పటికీ, మూడింటికి వేర్వేరు రంగులు, ఆకారాలు ఎందుకు ఉన్నాయి? సాధారణంగా మనం దీనిపై దృష్టి పెట్టము. మార్కెట్లో మనం చూసేది కొంటాము. కానీ, నిపుణుల అభిప్రాయం ప్రకారం, వివిధ రంగులు, రూపాల్లో కనిపించే ఈ కూరగాయ ఔషధ గుణాలలో కూడా భారీ వ్యత్యాసాన్ని కలిగి ఉంటుందని ఆయుర్వేద ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. మార్కెట్లో లభించే ఆకుపచ్చ గుమ్మడికాయ తక్కువగా పండిందని అంటున్నారు. ఆకుపచ్చ, గుండ్రని గుమ్మడికాయ రకం పసుపు, పొడవైన గుమ్మడికాయ కంటే కొద్దిగా భిన్నంగా ఉంటుంది. దీని రుచి కూడా కొద్దిగా భిన్నంగా ఉండటానికి ఇదే కారణం. పసుపు గుమ్మడికాయ పరిమాణంలో చాలా పెద్దది. కొంచెం పొడవుగా ఉంటుంది. సాంకేతికంగా, ఇది ఆకుపచ్చ గుమ్మడికాయ పండిన రూపం. ఇది పండిన తర్వాత ముదురు పసుపు లేదా నారింజ రంగులోకి మారుతుంది. ఇది రుచిలో కొద్దిగా తీపిగా ఉంటుంది.తెల్ల గుమ్మడికాయ విషయానికొస్తే, దీనిని హిందీలో పెథా అని, ఇంగ్లీషులో ఆష్ గార్డ్ అని పిలుస్తారు.

ఇది కూడా కొంచెం గోరింటాకులా కనిపిస్తుంది. ఆకుపచ్చ, పసుపు గుమ్మడికాయ కంటే తెల్ల గుమ్మడికాయలో ఎక్కువ పోషకాలు ఉంటాయి. ఆయుర్వేదచార్య ప్రకారం, విటమిన్ ఎ, విటమిన్ బి6, విటమిన్ సి, విటమిన్ ఇ, మెగ్నీషియం, భాస్వరం, ఐరన్, ఫోలేట్, నియాసిన్, థియామిన్ వంటి పోషకాలు తెల్ల గుమ్మడికాయలో మంచి పరిమాణంలో కనిపిస్తాయి. అందుకే పసుపు, ఆకుపచ్చ గుమ్మడికాయ కంటే తెల్ల గుమ్మడికాయ ఎక్కువ ప్రయోజనకరంగా పరిగణించబడుతుంది.

# ఈ హెయిర్ ప్యాక్స్‌తో చుండ్రు సమస్యకి ఫుల్ స్టాప్



ప్రస్తుతకాలంలో చుండ్రు సమస్య సర్వసాధారణం అయిపోయింది. దీనికి కారణం మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు కావచ్చు. చుండ్రు సమస్య తీవ్రమైతే జుట్టు రాలడానికి కారణం అవుతుంది. ఉందుకే దీని ముందే తగ్గించుకోవాలని అంటున్నారు నిపుణులు. నిమ్మరసం, కొబ్బరి నూనె: 2-3 చెంచాల కొబ్బరి నూనెను వేడి చేసి, సమాన మొత్తంలో నిమ్మరసంతో కలపండి. దీన్ని మీ తలకు పట్టించి, 30 నిమిషాలు లేదా అంతకంటే ఎక్కువసేపు ఉంచండి. తర్వాత షాంపూతో తలస్నానం చేయండి. నిమ్మరసం చుండ్రును తగ్గించడంలో సహాయపడుతుంది. కొబ్బరి నూనె మీ జుట్టును తేమగా ఉంచుతుంది. దీంతో చుండ్రు సమస్య దూరం అవుతుంది. అరటిపండు, తేనె, నిమ్మకాయ: అరటిపండు, తేనె, నిమ్మకాయ కలిపి ఒక మిశ్రమాన్ని తయారు చేయండి. దీన్ని మీ తలకు పట్టించి, 30 నిమిషాల తర్వాత కడిగేయండి. అరటిపండు చుండ్రును తగ్గిస్తుంది. అలాగే జుట్టును మృదువుగా చేస్తుంది. తద్వారా వెంట్రుకలు రాలడం కూడా తగ్గి జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది. వేప: వేపాకులను మెత్తగా నూరి, పేస్ట్ లా చేసి తలకు పట్టించండి. 15-20 నిమిషాల తర్వాత తలస్నానం చేయండి. వేపలో యాంటీ-ఫంగల్ లక్షణాలు ఉన్నాయి. ఇవి చుండ్రును తగ్గించడంలో సహాయపడతాయి. ఇలా కొన్నిరోజులు చేస్తే మీ జుట్టు చుండ్రు పూర్తిగా తగ్గి ఆరోగ్యంగా ఉంటుంది. మెంతులు: మెంతులను రాత్రంతా నానబెట్టి, ఉదయానికి మెత్తగా రుబ్బుకోవాలి. ఈ మిశ్రమాన్ని తలకు పట్టించి, 30 నిమిషాల తర్వాత కడిగేయండి. మెంతులు చుండ్రును తగ్గించడంలో సహాయపడతాయి. జుట్టు రాలడాన్ని కూడా తగ్గిస్తాయి. దీంతో కుదుళ్ళ బలపడి జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది.

# వానాకాలం కళ్ళు ఆరోగ్యంగా ఉండాలంటే..



వర్షాకాలంలో కంటి సంబంధిత సమస్యలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అలాంటి సమయంలో ముందుగానే కొన్ని రెమెడీస్ తీసుకోవడం మంచిది. ఇలా చేయడం వల్ల వర్షం వేళ మీ కళ్ళు ఆరోగ్యంగా ఉంటాయి. కంటి సమస్యలు కూడా దూరం అవుతాయని నిపుణులు అంటున్నారు. వర్షాకాలంలో సూక్ష్మక్రిములు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి, చేతులు తరచుగా కడుక్కోవడం, కళ్ళు తుడుచుకోవడానికి శుభ్రమైన వస్త్రం ఉపయోగించడం ముఖ్యం. ఈ కాలంలో కంటి ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉంది. కళ్ళు దురదగా అనిపిస్తే లేదా ఎర్రగా మారితే, వెంటనే వైద్యుడిని సంప్రదించండి. కంటి చుక్కల మందులు లేదా ఇతర కంటి సంబంధిత మందులను వాడే ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవడం చాలా ముఖ్యం. కంటి అలంకరణ వస్తువులను ఇతరులతో పంచుకోవడం వల్ల ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉంది. కాబట్టి, మీ కంటి అలంకరణ వస్తువులను ఎవరితోనూ పంచుకోవద్దు. కళ్ళజోడు లేదా కాంటాక్ట్ లెన్స్‌లను శుభ్రంగా ఉంచుకోవడం వల్ల ఇన్ఫెక్షన్లను నివారించవచ్చు. లందంటే వర్షం కారణం వాటిపై సూక్షమక్రిములు చేరి కంటి ఆరోగ్యాన్ని దెబ్బతీసే అవకాశం ఉంది. కుదిరితే కాంటాక్ట్ లెన్స్ పెట్టుకున్నప్పుడు చేతులకు గౌజులు వాడటం మంచిది. కళ్లపై భారంగా ఉన్నట్లయితే ఓ గుడ్డను గోరువెచ్చని నీటిలో ముంచి కాళ్లపై మెల్లగా మసాజ్ చెయ్యండి. ఇలా చేస్తున్నప్పుడు కళ్లు మూసుకుని ఉండేలా చూసుకోండి. దీనితో పాటు, మీరు కళ్లలో పొడిబారినట్లు అనిపిస్తే, వాటిని రిఫ్రెష్ చేయడానికి డాక్టర్ సలహా మేరకు కళ్లలో రోజ్ వాటర్ లేదా ఐ డ్రాప్స్ ఉపయోగించవచ్చు. కంటికి సంబంధించిన ఏవైనా సమస్యలు వస్తే, వెంటనే వైద్యుడిని సంప్రదించడం చాలా ముఖ్యం. లేదంటే ఇవి తీవ్రమై కంటి చూపుపై ప్రభావం పడే అవకాశం ఉంటుంది. అందుకే సమస్యను ముందే గుర్తించి చికిత్స తీసుకొని జాగ్రత్త పడటం మంచిదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

# స్పెషల్ మక్కజొన్న రెసిపీలు..!

వర్షాకాలం వచ్చిందంటే చాలు.. వేడి వేడి టిఫిన్లు, స్నాక్స్ తినాలని ప్రతి ఒక్కరికీ అనిపిస్తుంటుంది. ముఖ్యంగా మక్కజొన్నతో తయారయ్యే వంటకాలు ఈ సీజన్ లో చాలా స్పెషల్ గా ఉంటాయి. హెల్త్, టేస్ట్ రెండూ కలిపి ఇచ్చే ఈ మక్కజొన్న రెసిపీలు మీకు నచ్చే తీరుతాయి. మసాలా కార్న్.. కొద్ది సేపటిలో సులభంగా తయారయ్యే ఒక హాట్ అండ్ స్పైసీ స్నాక్ ఇది. ఉడికించిన మక్కజొన్న గింజల్లో బటర్ వేసి కొద్దిగా నిమ్మరసం పిండి చాట్ మసాలా, కారం జతచేస్తే చాలు.. టేస్టీగా, వేడిగా సిద్ధం అవుతుంది. వర్షం పడుతుండగా ఓ కప్పు టీతో కలిసి తినడానికి చాలా బాగుంటుంది. మక్కజొన్న పకోడీ .. వర్షంలో వేడి వేడి పకోడీలే అదిరిపోయే కాంబినేషన్. మక్కజొన్న ముద్ద, ఉల్లిపాయ ముక్కలు, శనగపిండి, మిర్చి, ఉప్పు వంటి మసాలాలతో కలిపి ఆయిల్లో డీప్ ఫ్రై చేయాలి. గోధుమ రంగులో క్రిస్పీగా వస్తే ప్లేట్ లో వేసుకుని టీతో కలిసి తింటే చిరుతిండికి పర్ఫెక్ట్ చాయిస్ ఇది. స్వీట్ కార్న్ సూప్.. ఇదొక ఇండియన్ టచ్ ఉన్న చైనీస్ సూప్. మక్కజొన్నతో పాటు క్యారెట్, బీన్స్, మిరియాల పొడి వంటివి వేసి మరిగించి వేడి వేడి సూప్ తయారు చేస్తారు. చల్లదనాన్ని పోగొట్టే ఈ సూప్ వర్షాకాలంలో శరీరానికి వెచ్చదనం ఇస్తుంది. హెల్దీగా, లైట్‌గా ఏదైనా తాగాలనిపిస్తే ఇదే బెస్ట్. కార్న్ భేల్ .. ఇది వీధిలో దొరికే భేల్‌కు ఆరోగ్యవంతమైన ప్రత్యామ్నాయం. ఉడికించిన మక్కజొన్నలో ఉల్లిపాయలు, టమాటాలు, కొంత నిమ్మరసం, తక్కువ మిరియాల పొడి, కొంచెం చట్నీలు కలిపితే హెల్తీ అండ్ టేస్టీ స్నాక్ రెడీ అవుతుంది. బరువు తగ్గాలనుకునే వారికి కూడా ఇది మంచి ఆప్షన్. కార్న్ చీజ్ టోస్ట్.. ఈ టోస్ట్ పిల్లలకే కాదు.. పెద్దవాళ్లకూ నచ్చే టైప్. ఉడికించిన మక్కజొన్నను చీజ్‌తో కలిపి కొంచెం మిరియాల పొడి, ఉప్పు, హర్బ్స్ వేసి బ్రెడ్ పై వేసి గ్రిల్ చేస్తే.. గోల్డెన్ టోస్ట్ తయారవుతుంది. ఇది ప్రొటీన్, కార్బోహైడ్రేట్స్ పరంగా పుష్కలంగా పోషకాలు



అందించేది కూడా. బ్రేక్ ఫాస్ట్ కు లేదా సాయంత్రం స్నాక్ కు పర్ఫెక్ట్ రెసిపీ ఇది.

## ఎమ్మెల్యే శ్రీగణేష్ చొరవతో లాల్ బజార్ మార్కెట్ ట్రాఫిక్ సమస్యకు సామరస్య పరిష్కారం

**తిరుమలగిరి (భారత శక్తి)** లాల్ బజార్ మార్కెట్‌లో ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యను సామరస్యంగా పరిష్కరించేందుకు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ చొరవ తీసుకున్నారు.తమ సమస్యలను పరిష్కరించాలని స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు మురళీ ముదిరాజ్ గారి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేని కలిసి వ్యాపారులు చేసిన విజ్ఞప్తి మేరకు ట్రాఫిక్ ఉన్నతాధికారులతో కలిసి ఎమ్మెల్యే శ్రీగణేష్ శనివారం మార్కెట్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మరియు వ్యాపారస్తులతో చర్చించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, ట్రాఫిక్ అంతరాయం రాకుండా, అలాగే తరతరాలుగా కొనసాగుతున్న వ్యాపారుల జీవనాధారానికి భంగం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.పెరిగిన ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, అధికారులకు పూర్తిగా సహకరిస్తూ వ్యాపారాలు కొనసాగించాలని ఎమ్మెల్యే వ్యాపారస్తులకు సూచించారు.ఎమ్మెల్యే చొరవతో సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో వ్యాపారస్తులు హర్షం వ్యక్తం చేసి, ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎసిపి శంకర్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు మురళీ ముదిరాజ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి నాగినేని సరిత, ఇతర అధికారులు, నాయకులు పాల్గొన్నారు.ప్రజల క్షేమం, వ్యాపారుల అభివృద్ధి రెండూ సమానమేనని, సామరస్యంతోనే ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతామని ఎమ్మెల్యే శ్రీగణేష్ ఈ సందర్భంగా పేర్కొన్నారు

## వైద్యుల నిర్లక్ష్యంతోనే పల్లవి మృతి

### – తండ్రి ఆరోపణ

**సికింద్రాబాద్(భారత శక్తి)** మైనర్ సర్జరీ కోసం వచ్చిన తన కుతురు పల్లవి వైద్యుల నిర్లక్ష్యంతోనే చనిపోయిందని తండ్రి ఆరోపించాడు. సీనియర్ డాక్టర్ లేకుండా ట్రైనీ డాక్టర్స్ చేయడం వలననే తన కూతురు చనిపోయిందని అన్నాడు. తన కూతురుకు శస్త్ర చికిత్స చేసిన డాక్టర్ పేరు ఎందుకు వెల్లడించలేదని ప్రశ్నించాడు. తన కూతురు మృతికి కారణమైన డాక్టర్ ను వదిలే ప్రసక్తి లేదని అన్నారు.సూపరింటెండెంట్ డా. వాణి మాట్లాడుతూ మృతిపై నిజ నిర్ధారణ చేయడం కోసం ముగ్గురు వైద్యులతో విచారణ కమిటీ వేశాము. రెండు రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించినట్లు తెలిపారు. ఇంచార్జి డాక్టర్ లేకుండా శస్త్ర చికిత్స అనేది అసత్య ఆరోపణ. ఇంచార్జ్ డాక్టర్ లేకుండా ఎటువంటి శస్త్ర చికిత్సలు కూడా చేయడం జరగదన్నారు. రెండు సార్లు శస్త్ర చికిత్సలు అందించిన మాట వాస్తవం. మొదటి సారి చికిత్స పూర్తి అయిన తరువాత రక్తస్రావం ఆగకపోవడంతో మరుసటి రోజు మరో మారు శస్త్ర చికిత్స అందించారు. దీనిని రీ ఎక్స్ ప్లోరేషన్ సర్జరీ అంటారని తెలిపారు. క్లోట్స్ గుర్తించి సర్జరీ చేయడం, అవసరమైన రక్తాన్ని అందించడం చేశామన్నారు. ఏది ఏమైనా పోయిన ప్రాణాన్ని తీసుకు రాలేము. అనుభవజ్ఞులైన వైద్యులతో ఎంక్వైరీ కమిటీ వేశామని మృతురాలి కుటుంబానికి తగిన న్యాయం జరిగే విదంగా చూస్తామని హామిచ్చారు.

## కోలమూరులో మట్టి తవ్వకాలు పర్మిషన్ కొంత అక్రమాలు చెరువు అంత

– చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్న ఇరిగేషన్ శాఖ రెవిన్యూ శాఖ

– అక్రమంగా మట్టి తరలిస్తుంటే ప్రజాప్రతినిధులకు అధికారులకి కనబడతాలేదా

**రాజమహేంద్రవరం (భారత శక్తి)** కోలమూరులో రాత్రి పగలు తేడా లేకుండా అక్రమంగా చెరువును తవ్వి మట్టి తరలిస్తున్నారు. మట్టి తరలింపులకి ఎటువంటి అనుమతులు లేనప్పటికీ రైతులు పేర్లతో తూత్ మంత్రంగా పర్మిషన్ తీసుకుని అధికారులు ఇరిగేషన్ శాఖ అధికారులు కనుచందల్లో అక్రమ తరలింపులు జరుగుతున్నాయని పలు విమర్శలు వస్తున్నాయి. అంతటితోనే ఆగకుండా రాత్రి పగలు తేడా లేకుండా ఓవర్ లోడుతో అతివేగంతో విచ్చలవిడిగా రెచ్చిపోతున్నారు అక్రమ మట్టి వ్యాపారస్తులు అధికార పార్టీలో కొంతమంది పేర్లు చెప్పుకుంటూ విచ్చలవిడిగా మట్టి తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్న స్థానిక ప్రజాప్రతినిధులు గాని ఉన్నతాధికారులు గాని స్పందించకపోవడం కొసమెరుపుతూత్ మంత్రంగా పర్మిషన్లు అక్రమంగా చెరువు మట్టి తవ్వకాలపైన రైతుల పేరుతో తూత్ మంత్రంగా పర్మిషన్లు తీసుకుని విచ్చలవిడిగా లారీలతో మట్టి తరలిస్తున్నారు. చెరువులు లోతుల పేర్లతో అక్రమంగా మట్టి అమ్ముకుని లక్షల సంపాదిస్తున్నారు. ఇంత అక్రమాలు జరుగుతున్న ఇరిగేషన్ రెవిన్యూ శాఖ అధికారులు మాత్రం నిద్ర నటిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ వారు స్పందించి తక్షణమే అక్రమ మట్టిపై చర్యలు తీసుకోని పనులు నిలుపుదల చేయాలని పరువురు కోరుతున్నారు

## జై జవాన్ జై కిసాన్

**ఏలూరు (భారత శక్తి)**కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని అంజనేయులు ఏలూరు జిల్లా, ముసునూరు మండలం, వేల్పుచెర్ల గ్రామాన్ని సందర్శించి పాడి రైతులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా, ఆ గ్రామానికి చెందిన రైతు జి. లక్ష్మణ్ గారి కుమారుడు దేశ సేవలో సీఆర్పీఎఫ్ జవానుగా విధులు నిర్వహిస్తున్న జి. శ్రీకాంత్ ను ఘనంగా సత్కరించారు.సుమారు పది సంవత్సరాలుగా జవానుగా దేశ సేవలో అంకితభావంతో విధులు నిర్వహిస్తూ శ్రీ శ్రీకాంత్ నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని అభినందించారు.ఈ సందర్భంగా ఛైర్మన్ ఆంజనేయులు భావోద్వేగంగా మాట్లాడుతూ, "దేశానికి అన్నం పెట్టే రైతు కుటుంబం నుంచే దేశ సరిహద్దుల్లో ప్రాణాలను పణంగా పెట్టి దేశాన్ని కాపాడే జవాన్లు రావడం మన అందరికీ గర్వకారణం. రైతు చెమటతో దేశం బతుకుతుంది? జవాను త్యాగంతో దేశం సురక్షితంగా నిలుస్తుంది. ఈ ఇద్దరూ దేశానికి రెండు కళ్లవంటివారు" అని పేర్కొన్నారు.అలాగే తమ కుమారుడిని దేశ రక్షణ కోసం పంపిన తల్లిదండ్రులు నిజమైన దేశభక్తులని కొనియాడుతూ, అలాంటి కుటుంబాలను సమాజం ఎప్పటికీ గౌరవంతో గుర్తుంచుకోవాలని అన్నారు. రైతు కుటుంబం నుంచి వచ్చిన జవాను దేశ సేవలో ఉండటం వేల్పుచెర్ల గ్రామానికే కాకుండా మొత్తం రైతాంగానికే స్ఫూర్తిదాయకం అని తెలిపారు. మరి ముఖ్యంగా కృష్ణా మిల్క్ యూనియన్ పాడి రైతు కుమారుడు కావటం యూనియన్ కి ఎంతో గర్వకారణమని తెలిపారు. రైతు దేశానికి అన్నం పెడితే, రైతు కొడుకు దేశానికి కాపలా కాస్తున్న జవాను. ఒకరు ఆకలి తీర్చితే?మరొకరు భద్రత కల్పిస్తున్నారు. దేశానికి ఇద్దరూ వెన్నెముకలే అని ఈ సందర్భంగా వారిని కొనియాడారు. ఈ సందర్భంగా గ్రామస్థులు కూడా జవాను కుటుంబాన్ని అభినందిస్తూ, దేశ సేవలో ఉన్న జి. శ్రీకాంత్ గారు గ్రామానికి మరియు రైతు కుటుంబాలకు ఆదర్శప్రాయుడని కొనియాడారు. తమ గ్రామం నుంచి దేశ రక్షణలో సేవలందిస్తున్న యువకుడు ఉండటం ఎంతో గర్వంగా ఉందని పేర్కొంటూ కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించి ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు టి.నాగేశ్వర రావు, సొసైటీ అధ్యక్షులు జి.మల్లికార్జున రావు, వేతన కార్యదర్శి జె.వెంకటేశ్వర రావు, పాడి రైతులు పాల్గొన్నారు.

## చెన్నై హైవేపై ఇద్దరి మృతి

**తిరుపతి (భారత శక్తి)** తిరుపతి జిల్లా నారాయణవనం మండలం వెత్తల తడుకు కూడలిలో శనివారం ఘోర ప్రమాదం జరిగింది. నారాయణవనం మండలంలోని సింగిరికోనకు ముగ్గురు యువకులు బైకుపై వచ్చారు. తిరిగి ఇంటికి వెళ్తూ.. వెత్తల తడుకు క్రాస్లో హైవేపైకి వస్తుండగా వెనక నుంచి కారు ఢీకొట్టింది. కిందపడిన ముగ్గురిపైకి తిరుపతి వైపు వెళ్తున్న మరో కారు దూసుకెళ్లింది. దీంతో ఇద్దరు మృతిచెందగా.. మరో యువకుడి పరిస్థితి సీరియస్ గా ఉంది. మృతుల వివరాలు తెలియాలి.

## విద్యార్థుల ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి

### – రాజ్యసభ ఎంపీ ఆర్. కృష్ణయ్య



**హైదరాబాద్ (భారత శక్తి)**తెలంగాణ రాష్ట్ర విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన మీడియా సమావేశంలో ముఖ్య అతిథులుగా రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య, శాసనమండలి ప్రతిపక్ష నాయకులు మధుసూదనాచారి, పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గుజ్జ సత్యం జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం స్టేట్ సెక్రటరీ డాక్టర్. వడ్డేపల్లి హనుమంతు, బీసీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అంబేద్కర్ రాజ్యాంగం దేశ ప్రజలకు కవచం..

– రాజ్యాంగం కాపాడటమే రాహుల్ గాంధీ ప్రయత్నం..

– రాజ్యాంగం తియ్యాలని బీజేపీ కుట్ర పన్నుతుంది – టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



**హైద్రాబాద్ (భారత శక్తి)** అంబేద్కర్ రాజ్యాంగం దేశ ప్రజలకు కవచం.. రాజ్యాంగం కాపాడటమే రాహుల్ గాంధీ ప్రయత్నమని,కానీ రాజ్యాంగం తియ్యాలని బీజేపీ కుట్ర పన్నుతుందని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆరోపించారు. శనివారం గందగి భవన్ లో మీడియా సమావేశం లో మాయెలాడుతూరాహుల్ గాంధీ రాజ్యాంగం కాపాడాలని కోరుతున్నారన్నారు.నెహ్రూ క్యాబినెట్ లో రాజ్యాంగం ప్రవేశ పెట్టారు.. ఓటు తోనే దేశంలో అభివృద్ధి మొదలైంది..మనిషికి కావాల్సింది నిత్యవసరలు,అభివృద్ధి అదే గాంధీ కుటుంబం చేసుకుంటూ వస్తుందన్నారు.ఇందిర గాంధీ ప్రభుత్వం బ్యాంకుకు ఏర్పాటు చేసు సెక్యూరిటీ కల్పించారు.. రాజీవ్ గాంధీ ఫౌండేషన్ తోనే టెలిఫోన్,సైబర్ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది..దేశలో ఓటు హక్కు ఇవ్వడమే కాదు.. హక్కులను కల్పించింది గాంధీ కుటుంబం..సోనియా గాంధీ సూచనలతో ఆర్థిక సంస్కరణలు ఆనాడు మొదలయ్యాయి..ఎన్నికల తర్వాత కూడా రాజకీయం సంబంధం లేకుండా అభివృద్ధి పథకాలను, సుపరిపాలన ను ముందుకు తీసుకెళ్లారు...దేశ అభివృద్ధికి కారణం కాంగ్రెస్ పార్టీ హే..2019లో ఎన్నికల కమిషన్ ను అడ్డుపెట్టుకొని ఓటు చోరీ చేసి అధికారంలోకి వచ్చరు..ఓటు హక్కును చోరీ చేసి బిజెపి మోసగిస్తుందని రాహుల్ గాంధీ ముందు నుంచే చెబుతున్నారు..ఎంపీ ఎన్నికల్లో దొంగ ఓట్లతోనే బీజేపీ అధికారంలోకి వస్తుంది..మనుషుల స్వేచ్ఛ,స్వతంత్రం నిర్వీర్యం చేస్తూ మభ్య పెడుతున్నారు బిజెపి అధికారంలోకి రాకముందు 54కోట్ల అప్పు ఉండేది.. ఇప్పుడు1లక్ష40కోట్ల అప్పు ఉంది..రాహుల్ గాంధీ కుటుంబం దేశ ప్రజల కోసమే మంచిగుండాలని కోరుకునే కుటుంబం..గాంధీ కుటుంబం ప్రాణత్యాగం చేసే కుటుంబం.. రాహుల్ గాంధీ 10ఏళ్ల క్రితమే ప్రధాని అయ్యే వారు..మన్మోహన్ సింగ్ కి అవకాశం ఇచ్చరూ.. ఆయన సేవలు ఉపాధి హామీలు, ఇలాంటి మంచి కార్యక్రమాలు నిర్వహించారు..గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక వ్యవస్థను బలపరిచింది గాంధీ కుటుంబం..మోదీ ఓటు చోరీ చెయ్యడమే కాదు.. రాజ్యాంగం ఎత్తివేయాలని చూస్తున్నారు....బీజేపీ లో దేశ ప్రజలకు మేలు చేసేవారు లేరు..నేను మా సంగారెడ్డిలో సీతారామ కళ్యాణం బ్రహ్మాండంగా చేస్తాను.... బీజేపీ వాడు ఒక్కడు తెలంగాణ లో చెయ్యరు..22వేల కోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయి..? విద్యార్థులు ఉద్యోగాలపై అడగకుండా భజరంగ్ దళ్ హిందూ అని తిరుగుతున్నారు..ఓట్లుదొంగలిస్తున్నారు.. దేశ ప్రజలు గమనించాలన్నారు.రాహుల్ గాంధీ ప్రధానమంత్రి చేసుకోవాలి.. ఓటు చోరీ పై కోట్లాడే నాయకుడు ఒక్కడే..ఏపీకి ప్రత్యేక హోదా కావాలంటే కాంగ్రెస్ ను గెలిపించుకోవాలి..తెలంగాణ ఇస్తా అని ఇక్కడ ఇచ్చారు... ఏపీలోనూ మూడు ప్రధాన హామీలు నెరవేరుస్తారు..డి లిమిటేషన్ అయిన కూడా కాంగ్రెస్ ఎంపీలను గెలిపించుకోవాలి..300ఎంపీ సీట్లు కాంగ్రెస్ కి ఇస్తే రాజ్యాంగం కాపాడుకుంటారు...డిలిమిటేషన్ అయితే 800సీట్లలో 500సీట్లు కాంగ్రెస్ కి రావాలి...తెలుగు రాష్ట్రాల ప్రజలారా కాంగ్రెస్ కి ఓటు వెయ్యండి..ఉమ్మడి రాష్ట్రాన్ని కాంగ్రెస్ అభివృద్ధి చేసింది.. తెలుగు రాష్ట్రాల ఎంపీ సీట్ల తోనే యూపీఏ ప్రభుత్వం కేంద్రంలో వచ్చింది..కక్రోచ్ పార్టీ బీజేపీ 11ఏళ్ల పాలనపై కోట్లాడుతుంది..గాంధీ ఫ్యామిలీ చరిత్ర సైతం చూడాలి..దేశంలో రాహుల్ నీ ప్రధాని చెయ్యాలని కోరుతున్నారు.. మోదీకి అహంకారం పెరిగిపోయింది.. పాలన మీద ఆలోచన లేదు..ప్రజలు గుడ్డిగా ఓటు వేస్తారు.. ఓటు వేయకుండా ఓటును స్వతహాగా గుద్దుకుని మోదీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని జగ్గా రెడ్డి విమర్శించారు.

## పాలిసెట్ ఫలితాలు విడుదలయ్యాయి



**హైద్రాబాద్(భారత శక్తి)** తెలంగాణ పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి నిర్వహించిన పాలిసెట్ ఫలితాలు విడుదలయ్యాయి. ఈ పరీక్షలో 82.94 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. బాలురు 79.92 శాతం మంది, బాలికలు 86.38 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షలో వరంగల్‌కు చెందిన నామాల లోకేశ్? ఫస్ట్? ర్యాంక్, సూర్యాపేటకు చెందిన బానోతు హేమనాథ్ సెకండ్ ర్యాంక్ సాధించారు. పాలిసెట్?కు హాజరైన అభ్యర్థులు తమ హాల్ టికెట్ నంబర్, పుట్టిన తేదీ వివరాలు ఎంటర్ చేసి ఫలితాలను పొందొచ్చు.

## నిర్దిష్టమైన ప్రణాళికతో ముందుకు వెల్లనున్నమాతృదేవోభవ సత్సంగం



**మేడ్చల్ (భారత శక్తి)**శ్రీ రామలింగేశ్వర కాలనీ కీసర మండలం మాతృదేవోభవ సత్సంగ్ బ్రాంచ్ కార్యాలయంలో జరిగింది .ప్రతి శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు చర్చగాన్ని చేయడం జరుగుతుందని వ్యవస్థాపక అధ్యక్షులు కే బి శ్రీధర్ సమక్షంలో మాతృదేవోభవ సత్సంగం నిర్వహించడం జరిగింది అందులో భాగంగా ప్రస్తుత అధ్యక్షురాలు డాక్టర్ శివలింగ నాగ ఉదయ లక్ష్మి మాట్లాడుతూ మాతృదేవోభవ సంస్థ నుంచి అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని చెప్పారు అన్నదానం విద్యాదానం వృద్ధులకు సేవ చేయడం మాతృదేవోభవ సంస్థ నుంచి జరుగుతుందని ఆమె ప్రకటించారు జాతీయ అంతర్జాతీయ స్థాయిలో మాతృదేవోభవ సత్యం సంస్థను ముందుకు తీసుకెళ్లాలని దుడ సంకల్పంతో ఉన్నామని ఆమె అన్నారు ఒక నిర్దిష్టమైన ప్రణాళికతో కొన్ని మార్పులు చేస్తామని ఉదయ్ లక్ష్మి చెప్పారు ప్రస్తుతం మాతృదేవోభవ సభ్యులందరికీ రద్దుచేసి నూతనంగా ఎవరు సేవా తత్పరతో ఎవరు సేవా తత్వరుతో కార్యదీక్షతో ఉంటారు వారిని దీవించడం జరుగుతుంది. ఒక క్రమశిక్షణ తో పదవులను ఇవ్వడం జరుగుతుందన్నారు.పదవులు అన్ని రద్దు చేసి కొత్త బాడీని నియమిస్తామని ,పాతవారికి ముందు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంది కావున సభ్యులందరూ ఈ విషయాన్ని గమనించాలన్నారు. అదేవిధంగా ఒక పేద విద్యార్థిని అవంతిక అనే అమ్మాయికి జన్మదిన వేడుకలు చేయడం మాతృదేవోభవ సంవత్సరంలో జరిగింది అనేక సేవా కార్యక్రమాలతో ముందు పెడతామని ఉదయ లక్ష్మి తెలిపారు ఈ కార్యక్రమానికి వ్యవస్థాప అధ్యక్షులు కే బి శ్రీధర్ సామాజిక తత్వవేత్తలు నేతాజీ బాలరాజు అలాగే సత్యనారాయణ విచ్చేసి సభను జయప్రదం చేశారు.

## హైదరాబాద్ టు తిరుపతి

– గుంటూరు వెళ్లకుండానే నల్లగొండ, కడప మీదుగా నయా ట్రైన్

– చర్లపల్లి స్టేషన్ నుంచి తిరుపతికి మరో ట్రైన్ – కొత్త రూట్‌లో ప్రారంభం



**హైద్రాబాద్ మే 23 (భారత శక్తి)** హైదరాబాద్ నుంచి తిరుపతి వెళ్లాలంటే వెంకటాద్రి, నారాయణాద్రి, పద్మావతి ఎక్స్‌ప్రెస్ రైళ్లున్నాయి. ఇందులో పద్మావతి ఎక్స్ ప్రెస్ వరంగల్, ఖమ్మం, విజయవాడ మీదుగా వెళ్తే, వెంకటాద్రి ఎక్స్ ప్రెస్ మహబూబ్?నగర్, గుత్తి జంక్షన్ మీదుగా తిరుపతి చేరుకుంటుంది. ఇక నారాయణాద్రి ఎక్స్ ప్రెస్ నల్లగొండ, గుంటూరు మీదుగా వెళ్తుంది. ఈ నేపథ్యంలో నల్లగొండ మీదుగా గుంటూరు వెళ్లకుండానే కడప మీదుగా సరికొత్త మార్గంలో తిరుపతికి మరో ట్రైన్ వచ్చేసింది. ఈ మేరకు హైదరాబాద్ నుంచి తిరుపతి వెళ్లే వీక్లీ స్పెషల్ ట్రైన్ రెగ్యులర్ చేస్తున్నట్లు సౌత్ సెంట్రల్ రైల్వే వెల్లడించింది. ఈ రైలు ప్రతి గురువారం తిరుపతి నుంచి, ప్రతి శుక్రవారం చర్లపల్లి నుంచి బయల్దేరుతుంది.

## 100 కోట్ల ల్యాండ్ ఆక్వేషన్ మంజూరు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

– భూములు కోల్పోయిన రైతులందరి బ్యాంకు ఖాతాల్లో జమైన డబ్బులు

**వనపర్తి (భారత శక్తి)** రిజర్వాయర్ల నిర్మాణంలో, కెనాల్ల ఏర్పాట్లు, లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాట్లల్లోభూములు కోల్పోయిన అన్నదాతలను అందర్నీ హక్కున చేర్చుకుంది కాంగ్రెస్ ప్రభుత్వంగత ప్రభుత్వ పాలనలో భూములు కోల్పోయి నష్టపరిహారం అందక నానా ఇబ్బందులు ఎదుర్కొన్న బాధిత అన్నదాతలందరినీ హక్కును చేర్చుకుంది నేటి కాంగ్రెస్ ప్రభుత్వంగణపసముద్రం, కర్నె తాండ లిఫ్ట్ బండరాయిపాకుల, కొంకలపల్లిలతో పాటు పలు కెనాల నిర్మాణంలో భూములు కోల్పోయిన అన్నదాతలందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం నష్టపరిహారాన్ని మంజూరు చేసిందికేవలం కాగితాల పైన అభివృద్ధి చూపిన గత పాలకులు అన్నదాతల అవస్థలను పట్టించుకోకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది ఘనపసముద్రం రిజర్వాయర్ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతన్నలకు గత ప్రభుత్వం సూచించిన నష్టపరిహారం కంటే కాంగ్రెస్ ప్రభుత్వం రెండింతలు అధికంగా నష్టపరిహారాన్ని మంజూరు చేసి అన్నదాతలను ఆదుకుందిఉన్న భూములు కోల్పోయి ప్రభుత్వం మంజూరు చేసే నష్టపరిహారాన్ని కోసమే ఎన్నో రోజులలో ఎదురుచూస్తున్నామని నేడు కాంగ్రెస్ ప్రభుత్వం నష్టపరిహారాన్ని అంది తమ బాధలు తీర్చిందని అన్నదాతలు ప్రభుత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు

## హత్య జరిగి నెల గడిచిన నేటికి లభించని ఆధారాలు

**బాపట్ల (భారత శక్తి)** కర్లపాలెం మండలం నర్రావారిపాలెం పొన్నాల కాలువలో ఒక మహిళను అత్యంత కిరాతకంగా హత్య చేసి కాలువలో పడేసిన సంఘటనలో నెల రోజులు గడిచినప్పటికీ ఇప్పటికీ ఎటువంటి ఆధారం లభించలేదు. హత్య చేయబడిన మహిళ వయసు 25 నుంచి 30 సంవత్సరాలు ఉండవచ్చు కనీసం ఆ మహిళ ఎవరు అనే విషయం కూడా ఇంతవరకు తెలియ రాలేదు. దీనిపై పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి రేయింపగళ్ళు అనేక మందిని విచారణ చేస్తున్నారు. ఫోన్ కాల్స్ ఆధారంగా, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఎంతో కష్టపడుతున్నారు. అయినప్పటికీ మృతదేహానికి సంబంధించి కనీసం ఒక్క క్లూ కూడా లేకపోవడం, పైగా పోలీసులు ఆచూకీ తెలిపిన వారికి పదివేల నగదు బహుమతిని కూడా ప్రకటించారు. ఈ క్రమంలో పోలీసులు గత కొన్ని సంవత్సరాల నుంచి ఆచూకీ లభించని మహిళలను కూడా కనుగొని వారి తల్లిదండ్రులకు అప్పగిస్తున్నారు. కానీ ఈ మృతదేహానికి సంబంధించి ఇప్పటివరకు ఒక్క ఆధారం కూడా లభించలేదు. దీనిపై విచారణ చేస్తున్న ప్రత్యేక బంధాలు లోతైన దర్యాప్తు చేస్తున్నాయి. ఈ కేసు పై ఎప్పటికప్పుడు జిల్లా ఎస్పీ ఉమామహేశ్వరరావు వివరాలు సేకరిస్తున్నారు.

## కిడ్నీ రోగులకు ఆశా కిరణంగా తెలంగాణ వైద్య రంగం

**హైదరాబాద్ (భారత శక్తి)** కిడ్నీ వ్యాధిగ్రస్తులకు తెలంగాణ వైద్య రంగం మరో ఆశాకిరణంగా నిలిచింది. రాష్ట్రంలో కిడ్నీ మార్పిడి చికిత్సల రంగంలో కీలక మైలురాయి నమోదైంది. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా రెండు వేల కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తయ్యాయి. ఆధునిక సాంకేతికత, నిపుణుల సేవలు, ప్రభుత్వ ఆరోగ్య పథకాల సహకారంతో ఈ ఘనత సాధ్యమైందని వైద్య నిపుణులు తెలిపారు.తెలంగాణలో కిడ్నీ మార్పిడి కార్యక్రమం 1989లో ప్రారంభమైంది. అప్పటి నుంచి 2023 వరకు దాదాపు 1,500 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించారు. అనంతరం గత మూడున్నర నుంచి నాలుగేళ్ల వ్యవధిలోనే మరో 500 శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తవడంతో మొత్తం ట్రాన్స్‌ప్లాంట్ల సంఖ్య రెండు వేలకు చేరుకుంది. ఇది రాష్ట్ర వైద్యరంగ ప్రగతికి నిదర్శనంగా వైద్యులు పేర్కొంటున్నారు.ప్రస్తుతం రాష్ట్రంలో 11 వేల మందికి పైగా కిడ్నీ వ్యాధిగ్రస్తులు డయాలసిస్‌పై ఆధారపడి చికిత్స పొందుతున్నారు. ప్రతి ఏడాది సుమారు 500 మంది కొత్త రోగులు కిడ్నీ మార్పిడి కోసం నమోదు అవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ట్రాన్స్‌ప్లాంట్ సేవలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని నిపుణులు చెబుతున్నారు. కిడ్నీ మార్పిడి అనంతరం రోగుల ఆరోగ్య పరిస్థితి ఆశాజనకంగా ఉందని వైద్యులు వెల్లడించారు. ఒక సంవత్సరం తర్వాత గ్రాఫ్ట్ సర్వైవల్ రేటు 95 శాతం, మూడు సంవత్సరాల తర్వాత 90 శాతం, ఐదు సంవత్సరాల తర్వాత 85 శాతంగా నమోదవడం చికిత్సల విజయవంతతను ప్రతిబింబిస్తోంది.ఆరోగ్యశ్రీ, ఈహెచ్‌ఎస్, జేఎచ్‌ఎస్, సీఎంఆర్‌ఎఫ్ వంటి ప్రభుత్వ ఆరోగ్య పథకాల ద్వారా అర్హులైన రోగులకు ఉచితంగా లేదా రాయితీపై చికిత్స అందిస్తున్నారు. హైదరాబాద్‌లోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు ఈ కార్యక్రమంలో భాగస్వాములై కిడ్నీ వ్యాధిగ్రస్తులకు సేవలు అందిస్తున్నాయి.ఇక భవిష్యత్తులో రోబోటిక్ కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను మరింత విస్తరించి, అత్యాధునిక వైద్య సేవలను ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు వైద్య నిపుణులు వెల్లడించారు. రాష్ట్రంలో అవయవదానంపై అవగాహన పెరగడంతో మరింత మంది రోగులకు కొత్త జీవితం అందించే అవకాశం ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## పదోన్నతులతోపాటు బాధ్యతలు కూడా పెరుగుతాయి

### – వరంగల్ పోలీస్ కమిషనర్

**వరంగల్ (భారత శక్తి)**పదోన్నతులతో పాటు బాధ్యతలు కూడా పెరుగుతాయని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు.

వరంగల్ పోలీస్ కమిషనరేట్ సిటీ ఆర్మ్‌డ్ రిజర్వు విభాగంలో హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి పొందిన బి. రాజేందర్ ప్రసాద్, కే రమణ చారి శనివారం వరంగల్ పోలీస్ కమిషనర్ మర్యాదపూర్వకంగా కలుసుకొని మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ అధికారులు అప్పగించిన పనులను సమర్ధవంతంగా నిర్వర్తించాలని పేర్కొన్నారు. అనంతరం పదోన్నతి పొందిన హెడ్ కానిస్టేబుళ్లకు సీపీ చేతుల మీదుగా పదోన్నతి చిహ్నాన్ని యూనిఫారంపై అలంకరించారు.

భారత శక్తి



# వైఎస్ జగన్ బాధితుడు కాదు... నిందితుడు

**- మంత్రి పయ్యావుల**

**అమరావతి(భారత శక్తి)** వైకాపా అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వ్యాఖ్యలపై మంత్రి పయ్యావుల కేశవ్ మండిపడ్డారు. ఫ్యాక్షన్ రాజకీయాలకు బీజం వేసింది వైఎస్ ఫ్యామిలీ అయితే... జగన్ దాన్ని కొనసాగిస్తున్నారని అన్నారు. జగన్ అరాచక రాజకీయాలపై యువత ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది. జగన్ బాధితుడు కాదు... నిందితుడంటూ వ్యాఖ్యానించారు.జగన్ బెంగళూరు నుంచి వచ్చినప్పుడల్లా కొత్త వాదన తెస్తాడు. గతంలో నన్ను సన్మానించాలని అన్నాడు... నిన్నటికి నిన్న తనంత మంచోడు లేదని సెల్ఫ్ సర్టిఫికెట్ ఇచ్చుకున్నాడు. వివేకా హత్య కేసులో ఏం జరిగిందో నిక్కరు వేసుకున్న కుర్రాడు కూడా చెబుతాడు... అలాంటి వాటిల్లో కూడా జగన్ అసత్యాలు చెబుతున్నారు. వైఎస్ కుటుంబంతోనే రాజకీయాలు నేరమయ్యాయి... రాజకీయాల్లోకి ఫ్యాక్షన్ తెచ్చారు. 1989లో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సీమలో ఫ్యాక్షనిజానికి అండగా నిలిచింది. నాటి ఎన్నికల్లో పులివెందుల నియోజకవర్గంలో పార్నపల్లి అనే గ్రామంలో టీడీపీకి భారీ మెజార్టీ వచ్చింది. ఆ గ్రామానికి చెందిన టీడీపీ నేతల ఇళ్లకు డ్రిల్ చేసి డైనమేట్లు పెట్టి పేల్చారు.. ఇదీ రాజారెడ్డి చరిత్ర. ఓ ఇంటిని డైనమేట్లు పెట్టి పేల్చేసిన ఘటనను ఇప్పటికీ ఎవ్వరూ మరిచిపోలేదు. తన ప్రత్యర్థుల మీద దాడి చేయించి... అదే సందర్భంలో వేరే చోట ఉన్నట్టు ఎలిబీ సృష్టించుకోవడం అనేది వైఎస్ ఫ్యామిలీతోనే మొదలైందని అన్నారు.లింగాల మండలంలో ముగ్గురు టాప్ లీడర్లను భయానకం సృష్టించి లొంగదీసుకున్నారు. ఇలాంటివి పదుల సంఖ్యలో పులివెందులలో జరిగాయి. రాజారెడ్డి నుంచి మొదలుకుని పులివెందులలో జరిగిన ఘటనలపై పుస్తకం వేస్తాం. చంద్రబాబు సీఎం అయ్యాక సీమలో ఫ్యాక్షన్ను కంట్రోల్లోకి వచ్చింది. వైఎస్ ఫ్యామిలీ మొదలు పెట్టిన ఫ్యాక్షన్ రాజకీయాలను కంట్రోల్ చేయడానికి 30 ఏళ్లు పట్టింది. జగన్ బాధితుడు కాదు.. నిందితుడు రప్పా రప్పా అంటే వారితో ఫొటోలు దిగుతారు. సొంత పార్టీ కార్యకర్త కారు కింద నలిగిపోయిన పట్టించుకోరు. ఇ వా ళ గొడ్డలి అంటే జగన్ మోహన్ రెడ్డికి ఉలికిపాటుకు గురవుతున్నారు. గొడ్డలిపోటును గుండెపోటుగా చూపించగలరు. నిజాలను ప్రజలకు చెప్పాలి... అవగాహన కల్పించాలి. అందుకే గొడ్డలి పార్టీ సమాజానికి హానికరం... గొడ్డలి పార్టీ నెవ్వర్ ఎగైన్. ఓ తరానికి ఉపాధి కల్పించేలా చంద్రబాబు అవకాశాలు సృష్టించారు. జగన్ మోహన్ రెడ్డి ఉపాధి అవకాశాలను పోగొడుతున్నాడని అన్నారు.

# ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్స్ ను సిజ్ చేయాలి


**- ప్రభుత్వ అనుమతులు రాకముందే స్కూల్లు ఏర్పాటు చేసిన యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి**

**- ఆర్ పి ఎస్ ఎఫ్, పి ఆర్ ఎస్ వై ఎఫ్**



**ఎమ్మిగనూరు(భారత శక్తి)** ఎమ్మిగనూరు పట్టణం లో ప్రభుత్వం నిబంధనలు కు వ్యతిరేకంగా ముందస్తు అడ్మిషన్స్ నిర్వహిస్తున్న ప్రైవేట్ మరియు కార్పొరేట్ స్కూల్స్ పై కఠిన చర్యలు తీసుకోవాలి అని ఆర్ పి ఎస్ ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి షాహిద్ అఫ్రిది, పి ఆర్ ఎస్ వై ఎఫ్ రాష్ట్ర నాయకులు రఘునాథ్ లు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వేసవి సెలవులలో ఎటువంటి అడ్మిషన్స్ చేసుకోకూడదు అని జీవో ఇచ్చిన కూడా ఎమ్మిగనూరు లో మాత్రం నిబంధనలు బేఖతార్ చేస్తూ ముందుస్తూ అడ్మిషన్స్ చేసుకోవడమే కాకుండా డొనేషన్స్ రూపంలో వేల రూపాయలు ను తల్లితండ్రులు నుంచి నిలువ దోపిడీ చేస్తున్నారు. అలాగే స్కూల్స్ లో పనిచేసే టీచర్స్ కి అడ్మిషన్స్ టార్గెట్ లు ఇచ్చి అవి పూర్తి చేయాలి అని లేనిపక్షం లో ఉద్యోగం నుంచి తొలగిస్తామని టీచర్లకు స్కూల్ యాజమాన్యలు వేధిస్తున్నారు. ఇంకా కొన్ని స్కూల్స్ కి ప్రభుత్వం నుంచి సరైన అనుమతులు రాకున్నా అప్పుడే స్కూల్స్ ని ఏర్పాటు చేసి రంగు రంగుల కరపత్రలు పంచుతు విద్యార్థులును మరియు తల్లితండ్రులు ను మోసం చేస్తున్నారు అని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికి అయినా విద్య శాఖ అధికారులు స్పందించి ప్రభుత్వం నిబంధనలు ను పాటించని స్కూల్స్ పై కఠిన చర్యలు తీసుకోని సిజ్ చేయాలని వారి డిమాండ్ చేశారు లేని పక్షంలో ప్రత్యక్షంగా స్కూళ్ల ముందు ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం నాయకులు నర్సింహా నాయుడు, బాబా,మహబూబ్, లక్ష్మన్న, షైక్ష తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని చిత్ర పరిశ్రమ అభివృద్ధికి ఉపయోగిస్తాను : చదలవాడ శ్రీనివాసరావు



**(భారత శక్తి)**మానవతా వాది కళా పోషకులు చదలవాడ శ్రీనివాసరావు ని ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ చలన చిత్ర అభివృద్ధి సంస్థ బోర్డ్ అఫ్ డైరక్టర్ గా నియమించిన శుభ సందర్భంలో తెలుగు ఫిల్మ్ క్రిటిక్స్ అసోసియేషన్ పాలక మండలి శ్రీనివాసరావు గారిని కలిసి అభినందన శుభాకాంక్షలు తెలియచేయటం జరిగింది. అధ్యక్షులు బత్తుల ప్రసాద్ రావు ప్రధాన కార్యదర్శి సురేష్ కొండేటి చదలవాడ శ్రీనివాస్ రావు గార్కి పుష్ప గుచ్చం అందచేసి శుభాకాంక్షలు తెలియ చేసారు. తెలుగు చలన చిత్ర పరిశ్రమ అభివృద్ధికి తనవంతు కృషి చేసెందుకు ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుస్తానని, పరిశ్రమలో చిన్నా పెద్ద భేదం లేకుండా అందరికి అందుబాటులో ఉంటానని చదలవాడ శ్రీనివాస్ రావు ఈ సందర్భంగా తెలియచేసారు ఈ కార్యక్రమంలోఫిల్మ్ క్రిటిక్స్ పాలక మండలి సభ్యులు బాల రెడ్డి, యం గిరిధర్, చదలవాడ భరద్వాజ, అప్పాజీ, పర్వీన్, బాబీ నవీన్ తదితరులు శ్రీనివాస్ రావు గార్కి అభినందనలు తెలియ చేసారు

# మేడ్చల్, మల్కాజ్గిరి డిప్యూటీ కలెక్టర్ వంశీ మోహన్ అరెస్ట్

**హైదరాబాద్ (భారత శక్తి)** మేడ్చల్, మల్కాజ్గిరి డిప్యూటీ కలెక్టర్ వంశీ మోహన్ ను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేసారు. సోదాల అనంతరం, వంశీ మోహన్ను రిమాండ్కు తరలించారు. ఏసీబీ తనిఖీల్లో రూ.100 కోట్లకు పైగా అక్రమాస్తులు గుర్తించారు. వంశీ మోహన్ మామ 10 ప్లాట్లను గిఫ్ట్ డీడ్గా తీసుకున్నట్లు ఆరోపణ వచ్చాయి. 19 ఇళ్ల స్థలాలు, ఇబ్రహీంపట్నంలో 2 ఎకరాల ఫామ్హౌస్.. వనస్థలిపురంలో విలాసవంతమైన ఇల్లు, మణికొండ, మజీద్బండలో లగ్జరీ ప్లాట్లు గుర్తించారు. బ్యాంక్ ఖాతాల్లో రూ.20 లక్షలు గుర్తింపు.. రూ.2.10 లక్షల నగదు, 122 గ్రాముల బంగారం, 2 కార్లు సీజ్ చేసారు.

# సౌతిండియా హీరోయిన్ ప్రియ భవానీ శంకర్ చేతుల మీదుగా వెలచెర్రీలో ఘనంగా 'కలర్స్ 2.0' వెల్నెస్ సెంటర్ ప్రారంభం




**చెన్నై (భారత శక్తి):** ప్రముఖ వెల్నెస్ & హెల్త్‌కేర్ సంస్థ 'కలర్స్' చెన్నై నగరంలో తన సేవలను మరింత విస్తరిస్తోంది. వెలచెర్రీ లోని మహేశ్వరీ నగర్‌లో 100 ఫీట్ రోడ్ వద్ద అత్యాధునిక సదుపాయాలతో రూపొందించిన 'కలర్స్ 2.0' వెల్నెస్ సెంటర్‌ను సౌతిండియా హీరోయిన్ ప్రియ భవానీ శంకర్ ఘనంగా ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం రిబ్బన్ కట్ చేసి సెంటర్‌ను ప్రారంభించిన ఆమెకు నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ప్రియ భవానీ శంకర్ మాట్లాడుతూ, నేటి వేగవంతమైన జీవనశైలిలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరికీ పెద్ద సవాలుగా మారిందన్నారు. అందం అనేది కేవలం బాహ్య రూపానికి మాత్రమే పరిమితం కాదని, ఆరోగ్యకరమైన జీవన విధానం, సరైన ఆహారపు అలవాట్లు, ఫిట్‌నెస్‌పై శ్రద్ధ పెట్టడం ద్వారా నిజమైన అందం వెలుగులోకి వస్తుందన్నారు. బరువు నియంత్రణ, చర్మం, జుట్టు సమస్యలతో బాధపడుతున్న వారికి ఇలాంటి ప్రత్యేక వెల్నెస్ సెంటర్లు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. చెన్నై ప్రజలకు అంతర్జాతీయ ప్రమాణాల సేవలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు.కలర్స్ హెల్త్‌కేర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకట శివాజీ కూన మాట్లాడుతూ, రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రజల విశ్వాసాన్ని సంపాదించిన తమ సంస్థ ఇప్పుడు తమిళనాడులో కూడా వేగంగా విస్తరిస్తోందన్నారు. కుంభకోణం తర్వాత చెన్నైలో మరో ప్రీమియం సెంటర్‌ను ప్రారంభించామని, ప్రస్తుతం వెలచెర్రీలో కొత్త బ్రాంచీ ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. గత 22 ఏళ్లుగా వెల్నెస్ రంగంలో సేవలందిస్తున్న తమ సంస్థ, బరువు నియంత్రణ ద్వారా అనేక ఆరోగ్య సమస్యలకు ఉపశమనం కలిగించే ప్రత్యేక ప్రోగ్రామ్‌లను అందిస్తోందన్నారు.ప్రస్తుతం తమ సంస్థలో 250 మందికి పైగా న్యూట్రిషనిస్టులు, వందమంది నిపుణులైన వైద్యులు, 2000 మందికి పైగా శిక్షణ పొందిన టెక్నీషియన్లు సేవలందిస్తున్నారని ఆయన వెల్లడించారు. ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా జూ-ఈఆం ఆమోదం పొందిన పరికరాలతో అంతర్జాతీయ స్థాయి వెల్నెస్ సేవలను 'కలర్స్ 2.0' ద్వారా అందిస్తున్నామని చెప్పారు.మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ విజయ్ కృష్ణ మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్య అవసరాలు మారుతున్న నేపథ్యంలో అత్యాధునిక సదుపాయాలతో ఈ సెంటర్‌ను రూపొందించామని తెలిపారు. చెన్నై ప్రజల జీవనశైలిని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక వెల్నెస్ ప్రోగ్రామ్‌లను అందుబాటులోకి తీసుకొచ్చామని పేర్కొన్నారు.ఆపరేషన్స్ డైరెక్టర్ కృష్ణంరాజు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా డెర్మటాలజీ, వెల్నెస్ సేవలను సమగ్రంగా అందిస్తున్న సంస్థగా 'కలర్స్' ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. నిపుణులైన డెర్మటాలజిస్టులు, ఆధునిక సాంకేతికత, అనుభవజ్ఞులైన సిబ్బందితో వినియోగదారులకు నాణ్యమైన సేవలను అందించడం తమ లక్ష్యమని తెలిపారు.5ఎం మీడియా ఆధ్వర్యంలో జైదీప్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక యువతతో పాటు పలువురు ప్రముఖులు, వెల్నెస్ రంగానికి చెందిన నిపుణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వెలచెర్రీలో ప్రారంభమైన 'కలర్స్ 2.0' ద్వారా అత్యాధునిక వెల్నెస్ సేవలు మరింత చేరువ కావడం పట్ల స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

## ఏలూరు శ్రీకృష్ణ యాదవ్ నగర్‌లో

# పోలీసులు తనిఖీలు



**ఏలూరు(భారత శక్తి)**ఏలూరు 3 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీకృష్ణ యాదవ్ నగర్లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. శనివారం ఉదయం 05:30 గంటల నుండి 08:00 గంటల వరకు శ్రీ కృష్ణ యాదవ నగర్, సత్రంపాడు ప్రాంతంలో మెగా కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించబడినది.ఏలూరు డీఎస్పీ డి శ్రావణ్ కుమార్, ఏలూరు వన్ టౌన్ ఇన్స్పెక్టర్ కే రామకృష్ణ, ఏలూరు టూ టౌన్ ఇన్స్పెక్టర్ అశోక్ కుమార్, ఏలూరు త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ కోటేశ్వరరావు, ఎక్సైజ్ ఎస్సై గౌరీ శంకర్ ఇతర సిబ్బంది 60 మంది పాల్గొన్నారు.సరియైన పత్రాలు లేని వాహనాలు ? 18 మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఒక పెండింగ్ అరెస్టు చేసారు. ఇద్దరు పాత నేరస్థులను గుర్తించారు. గంజాయి గుర్తింపు టెస్ట్ కిట్ల ద్వారా 15 మందికి పరీక్షలు నిర్వహించగా, అందులో 02 మందికి టెస్ట్లో పాజిటివ్ వచ్చినది. సంబంధిత వారిపై తదుపరి చట్టపరమైన చర్యలు చేపడుతున్నారు. ట్టబడుతున్నవి.

# ప్రజల ప్రాణ భద్రత కోసం ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

- జిల్లా ఎస్పీ డి.జానకి, జిల్లాలోని 16 పోలీస్ స్టేషన్ల పరిధిలో విస్తృత వాహన తనిఖీలు
- నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు
- డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రిపుల్ రైడింగ్, రాష్ డ్రైవింగ్పై కఠిన చర్యలు తప్పవు : జిల్లా ఎస్పీ హెచ్చరిక



**మహబూబ్ నగర్ (భారత శక్తి)**జిల్లా మహబూబ్నగర్ జిల్లా వ్యాప్తంగా ట్రాఫిక్ నియంత్రణ మరియు రోడ్డు ప్రమాదాల నివారణ కోసం పోలీసులు శుక్రవారం రాత్రి ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. . జిల్లాలోని 16 పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీసులు ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాలు మరియు చెక్పోస్టుల వద్ద విస్తృతంగా తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా మహబూబ్నగర్ పట్టణంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రధాన కూడలి వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్న వన్ టౌన్ ఇన్స్పెక్టర్ అప్పయ్య మరియు వారి సిబ్బందిని జిల్లా ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేసి విధుల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ట్రాఫిక్ నియంత్రణ చర్యలను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా నాణ్యమైన హెల్మెట్ ధరించాలని, కార్ డ్రైవర్లు మరియు ప్రయాణికులు సీట్ బెల్ట్ వినియోగించడం అలవాటు చేసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వల్ల అనేక కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, కేవలం కొన్ని నిమిషాల నిర్లక్ష్యం ప్రాణ నష్టానికి దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

# పీఎస్ఓలు, బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్ సిబ్బంది విధుల్లో అత్యున్నత ప్రమాణాలు పాటించాలి: ఏసీపీ ఏ.ఆర్. ప్రతాప్




**కరీంనగర్ (భారత శక్తి)** కరీంనగర్ ప్రజాప్రతినిధులు,వీఐపీల భద్రతతో పాటు శాంతిభద్రతల పరిరక్షణలో పీఎస్ఓలు, బాంబ్ డిస్పోజల్ డాగ్ స్క్వాడ్ సిబ్బంది అత్యంత అప్రమత్తత, క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేయాలని కరీంనగర్ ఏఆర్ ఏసీపీ ప్రతాప్ ఆదేశించారు. శనివారం కరీంనగర్ కమిషనరేట్ కేంద్రంలోని తన కార్యాలయంలో ఏఆర్ సిబ్బందితో ఆయన ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఏసీపీ ప్రతాప్ మాట్లాడుతూ.విధి నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రామాణిక విధానాలు ఎస్ ఓ పిఎస్ ఖచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. విభాగాల వారీగా ఆయన సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు:పీఎస్ఓలు వీఐపీల భద్రతనే ప్రథమ కర్తవ్యంగా భావించాలి. ఆయుధాల నిర్వహణ, రూట్ చెకింగ్, అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలి. వీఐపీల ప్రయాణ ప్రణాళికల గోప్యతను ఖచ్చితంగా పాటించాలి.బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్ సాంకేతిక పరిజ్ఞానం, మానసిక దృఢత్వం, సమయస్ఫూర్తితో పనిచేయాలి. ఈ విభాగంలో జరిగే చిన్న పొరపాటైనా తీవ్ర పరిణామాలకు దారితీసే అవకాశం ఉన్నందున అత్యంత జాగ్రత్త వహించాలి. డాగ్ స్క్వాడ్: హ్యాండ్లర్లు తమ శునకాల పట్ల ప్రేమ, ఓపికతో వ్యవహరిస్తూ వాటి ఆరోగ్యం, ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టాలి.హ్యాండ్లర్ మెదడు కుక్క ముక్కు సమన్వయంతోనే ఆపరేషన్లు విజయవంతమవుతాయి.వృత్తి నైపుణ్యం, క్రమశిక్షణే విజయానికి మూలమని, ప్రజల భద్రత కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని ఏసీపీ పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో రిజర్వ్ ఇన్స్పెక్టర్ అడ్మిన్ రజినీకాంత్, ఆర్ఎస్సైలు నీలవేణి రాజు, కార్తీక్ మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# 24 గంటల్లో కేసును ఛేదించిన పోలీసులు

**- నిందితురాలి అరెస్ట్ - సీపీ రష్మీ పెరుమాళ్**




**హుస్నాబాద్ (భారత శక్తి)**మంచినీళ్ళ బండ గ్రామంలో కలకలం రేపిన బోయిని రాజ్యలక్ష్మి-రాజవ్వ హత్య ఉదంతం దొంగతనం కాదు, కుటుంబ కలహాల నేపథ్యంలో చిన్న భార్యే చేసిన హత్యగా పోలీసులు తేల్చారు. నిందితురాలిని అరెస్ట్ చేసి జుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.**కేసు వివరాలు:** మంచినీళ్ళ బండ గ్రామానికి చెందిన బోయిని కనకయ్య వ్యవసాయంతో పాటు హమాలీ పని చేస్తుంటాడు. ఇతనికి ఇద్దరు భార్యలు.పెద్ద భార్య రాజ్యలక్ష్మి, చిన్న భార్య బోయిని రాధ. ముగ్గురు కలిసి ఒకే ఇంట్లో నివసిస్తున్నారు. 21-5-2026న కనకయ్య హమాలీ పని నిమిత్తం కట్కూర్ గ్రామానికి వెళ్ళాడు.గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి పెద్ద భార్య రాజ్యలక్ష్మిపై దాడి చేసి, తీవ్రంగా గాయపరిచి, మెడలోని 3.5 తులాల బంగారు పుస్తెల త్రాడును ఎత్తుకెళ్ళినట్లు కనకయ్యకు సమాచారం అందింది. బాధితురాలిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, కనకయ్య ఫిర్యాదు మేరకు అక్కన్నపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.అసలు నిజం:కేసు నమోదు చేసుకున్న అక్కన్నపేట పోలీసులు రంగంలోకి దిగి లోతుగా దర్యాప్తు చేపట్టారు. దొంగతనం జరిగినట్లుగా సృష్టించిన సీన్‌పై అనుమానం రావడంతో విచారించగా, అసలు నిజం బయటపడింది. కుటుంబ గొడవల నేపథ్యంలో కనక్కయ్య పెద్ద భార్య యొక్క పెత్తనం ఎక్కువ అయి, ప్రతి దానికి చిన్న భార్య ను అనుమానం వ్యక్తం చేస్తూ తిడుతుండేది. 21-05-2026 పెద్ద భార్య చిన్న భార్యతో గొడవ పెట్టుకున్నది. రాజ్యలక్ష్మి నిద్రిస్తున్న సమయంలో , రాధతో ఊకె లొల్లిపెట్టుకుందని ఇంట్లో ఉన్న కర్రతో రాజ్యలక్ష్మి తలపైన చిన్న భార్య బోయిని రాధనే పెద్ద భార్య రాజ్యలక్ష్మిని తీవ్రంగా గాయపరిచి హత్య చేసినట్లు తేలింది.తను చేసిన నేరాన్ని కప్పిపుచ్చుకోవడానికి, జిల్లాలో దొంగలు పడుతున్నారనే విషయాన్ని ఆసరాగా తీసుకుని, తానే మెడలోని బంగారాన్ని తీసివేసి ఒక దగ్గర భద్ర పరిచి, కదలికలు లేకుండా పడి ఉన్న రాజ్యలక్ష్మి చూసి చనిపోయింది అనుకొని, ఇంటి ముందుకు వెళ్ళి పెద్ద పెద్దగా కేకలు వేస్తూ, గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనం చేసి హత్య చేసినట్లుగా తప్పుడు ప్రచారం సృష్టించింది.పోలీసులు నిందితురాలు బోయిని రాధను అరెస్ట్ చేసి, జుడీషియల్ రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారు.



## సోషల్ మీడియా వేదికగా సీపీ సజ్జనార్‌కు

# అనసూయ ఫిర్యాదు

తనను అసభ్యకరరీతిలో చూపిస్తూ 'ఏఐ' ఫొటోలను సృష్టిస్తున్నారంటూ ప్రముఖ తెలుగు యాంకర్, నటి అనసూయ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆమె సోషల్ మీడియా వేదికగా హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్‌ను ట్యాగ్ చేశారు. ఒక 'ఎక్స్' హ్యాండిల్ తన ఏఐ జనరేటెడ్ ఇమేజ్‌లను పోస్టు చేస్తోందని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.ఇలాంటి వాటిని పట్టించుకోకుండా ఉండాలని తాను ప్రయత్నించానని ఆమె పేర్కొన్నారు. కానీ ఈ 'ఎక్స్' హ్యాండిల్ ద్వారా తరచూ తన ఫొటోలను పోస్టు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.అనసూయ ఫిర్యాదుపై సజ్జనార్ స్పందించారు. హైదరాబాద్ సైబర్ క్రైమ్ బ్రాంచ్‌ను సంప్రదించి ఫిర్యాదు చేయమని సూచించారు. సమన్వయం చేసుకోవాలంటూ 'హైదరాబాద్ సిటీ పోలీస్' ఖాతాను సజ్జనార్ ట్యాగ్ చేశారు.



## పెళ్లి అయ్యిందని చెప్పడంతో

# చేజారిన సినిమా ఛాన్స్..

గ్లామర్ ఇండస్ట్రీలో పెళ్లి, రిలేషన్‌షిప్‌లు నటీమణుల కెరీర్‌పై ప్రభావం చూపుతాయనే చర్చ చాలా కాలంగా కొనసాగుతోంది. ముఖ్యంగా హీరోయిన్లు, యాంకర్లు, క్యారెక్టర్ ఆర్టిస్టులుగా రాణించాలనుకునే మహిళలకు వ్యక్తిగత జీవితం కూడా కొన్ని సందర్భాల్లో కెరీర్‌పై ప్రభావం చూపుతుందనే అభిప్రాయాలు వినిపిస్తుంటాయి. తాజాగా ఈ అంశంపై ప్రముఖ తెలుగు యాంకర్, బిగ్ బాస్ ఫేమ్ స్రవంతి చొక్కారపు చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న స్రవంతి తన కెరీర్ ప్రారంభ రోజుల్లో ఎదురైన ఒక సంఘటనను పంచుకుంది. ఇండస్ట్రీలోకి వచ్చిన కొత్తలో ఓ పెద్ద ప్రాజెక్ట్ కోసం ఆడిషన్స్ ఇచ్చానని, నటన, లుక్స్ పరంగా తాను ఎంపికయ్యాననే సంకేతాలు కూడా వచ్చాయని తెలిపింది. మేకర్స్ తనను ఆ పాత్రకు సరైన ఎంపికగా భావించారని చెప్పింది. అయితే ఫైనల్ చర్చల సమయంలో తన వ్యక్తిగత జీవితం గురించి ప్రశ్నలు వచ్చాయని, తనకు పెళ్లైందా అని అడిగారని వెల్లడించింది. దానికి తాను ఎలాంటి సంకోచం లేకుండా "అవును, నాకు పెళ్లైంది" అని నిజాయితీగా సమాధానం చెప్పానని తెలిపింది. కానీ ఆ విషయం చెప్పిన వెంటనే పరిస్థితి పూర్తిగా మారిపోయిందని స్రవంతి పేర్కొంది. షూటింగ్ కోసం చెన్నై రావాలని, అక్కడ అడ్వాన్స్ తీసుకోవాలని ముందుగా చెప్పినట్లు గుర్తు చేసుకుంది. అయితే పెళ్లి విషయం తెలిసిన తర్వాత కొద్దిసేపట్లో కాల్ చేస్తామని చెప్పిన వారు తిరిగి స్పందించలేదని తెలిపింది. ఆ తర్వాత ఆ సినిమా అవకాశం తనకు రాలేదని, తర్వాత ఆ ప్రాజెక్ట్ కూడా ఆగిపోయిందని తెలిసిందని చెప్పుకొచ్చింది. స్రవంతి చొక్కారపు చిన్న యూట్యూబ్ ఛానెళ్లలో యాంకర్‌గా తన ప్రయాణాన్ని ప్రారంభించింది. అనంతరం ప్రముఖ హీరోల ఇంటర్వ్యూలతో మంచి గుర్తింపు సంపాదించుకుంది. ముఖ్యంగా ఒక స్టార్ హీరో సినిమా ప్రమోషన్ ఇంటర్వ్యూతో ఆమెకు భారీ పాపులారిటీ వచ్చింది. తర్వాత తెలుగు రియాలిటీ షో బిగ్ బాస్ నాన్-స్టాప్‌లో పాల్గొని ప్రేక్షకులకు మరింత దగ్గరైంది. ప్రస్తుతం సినిమా ఆడియో లాంచ్‌లు, సెలబ్రిటీ ఇంటర్వ్యూలు, ప్రత్యేక కార్యక్రమాలకు హోస్ట్‌గా వ్యవహరిస్తూ బిజీగా ఉంది. ఇటీవల నటిగానూ తన ప్రయాణాన్ని ప్రారంభించిన స్రవంతి, సోషల్ మీడియాలో కూడా తన గ్లామరస్ ఫోటోషూట్లతో మంచి ఫాలోయింగ్ సంపాదించుకుంటోంది.

## ఆ వైరల్ వీడియో, ఫొటోలు

# నావి కావు..

### - బాధ్యులపై లీగల్ యాక్షన్ తీసుకుంటా: రుక్మిణి వసంత్

సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న తన బికినీ ఫోటోషూట్ చిత్రాలపై నటి రుక్మిణి వసంత్ తీవ్రంగా స్పందించారు. ఆ చిత్రాలు పూర్తిగా నకిలీవని, ఏఐ టెక్నాలజీతో సృష్టించినవని ఆమె స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. కొన్ని రోజులుగా, గ్రీన్ బికినీ ధరించి స్విమ్మింగ్ పూల్‌లోకి వెళుతున్నట్లుగా ఉన్న ఓ మహిళ ఫొటోలు, వీడియో క్లిప్‌లు ఆన్‌లైన్‌లో విపరీతంగా చక్కర్లు కొడుతున్నాయి. చాలామంది నెటిజన్లు ఇది రుక్మిణి వసంత్ 'మొదటి బికినీ షూట్' అంటూ ప్రచారం చేయడంతో గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలో రుక్మిణి తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ ద్వారా దీనిపై పూర్తి వివరణ ఇచ్చారు. "నా పేరుతో సర్క్యులేట్ అవుతున్న కొన్ని ఏఐ-జనరేటెడ్ చిత్రాలు నా బృందం దృష్టికి వచ్చాయి. ఆ చిత్రాలు పూర్తిగా ఫేక్, కల్పితం అని నేను స్పష్టంగా చెప్పాలనుకుంటున్నాను. వాటికి నాకు ఎలాంటి సంబంధం లేదు" అని ఆమె తన పోస్టులో పేర్కొన్నారు. ఇలాంటి నకిలీ కంటెంట్‌ను సృష్టించి, వ్యాప్తి చేయడం అత్యంత బాధ్యతారాహిత్యమని, ఇది వ్యక్తిగత గోప్యతా హక్కులను తీవ్రంగా ఉల్లంఘించడమేనని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఫేక్ చిత్రాలను రూపొందించి, వ్యాప్తి చేసిన వారిపై తన బృందం సైబర్ క్రైమ్, చట్టపరమైన చర్యలు ప్రారంభిస్తుందని రుక్మిణి తెలిపారు. ఇటువంటి తప్పుడు సమాచారాన్ని ప్రోత్సహించవద్దని, ఆ కంటెంట్‌ను ఎవరూ షేర్ చేయవద్దని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ వివాదం పక్కన పెడితే, రుక్మిణి వసంత్ తన కెరీర్‌పై పూర్తి దృష్టి సారించారు. ఆమె ప్రస్తుతం పాన్ ఇండియా స్టార్ యశ్‌తో కలిసి 'టాక్సిక్' చిత్రంలో నటిస్తున్నారు. దీనితో పాటు యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ హీరోగా చేస్తున్న 'డ్రాగన్' సినిమాలో కూడా ఆమె హీరోయిన్. ఇలా కెరీర్‌లో ప్రస్తుతం ఆమె వరుస పాన్ ఇండియా ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు.






## ప్రాచీన రహస్యాల

# నాగబంధం

విరాట్‌కర్ణ కథానాయకుడిగా నటిస్తున్న మైథలాజికల్ యాక్షన్ అడ్వెంచర్ 'నాగబంధం: ది సీక్రెట్ ట్రెజర్' చిత్రం నిర్మాణదశ నుంచే ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తున్నది. అభిషేక్ నామా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం జూలై 3న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది. రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ సందర్భంగా గురువారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో హీరో విరాట్‌కర్ణ చేతిపై పడగ విప్పిన సర్పం, మరో చేతితో ఆయన కత్తి పట్టుకొని తీక్షణమైన చూపులతో కనిపిస్తున్నారు. భారతీయ పురాణాలు, ప్రాచీన రహస్యాలు, దైవిక శక్తుల మహిమలు కలబోసిన ఈ కథలో విజువల్స్ అబ్బురపరుస్తాయని, ప్రపంచస్థాయి సాంకేతికాంశాలతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని, మునుపెన్నడూ చూడని పోరాట ఘట్టాలతో ప్రేక్షకుల్ని ఆశ్చర్యపరుస్తుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్ర హిందీ హక్కులను జీ స్టూడియోస్ కొనుగోలు చేసింది. నభానటేష్, ఐశ్వర్యమీనన్, జగపతిబాబు, మహేష్ మంజ్రేకర్ తదితరులు చిత్ర తారాగణం.

# చీరా చొక్కా చిక్కడిపోవాలో..



అగ్ర హీరో రామ్‌చరణ్ నటిస్తున్న మోస్ట్ ఎవైటెడ్ పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'పెద్ది' జూన్ 4న విడుదల కానున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఈ సినిమా హ్యూజ్ బజ్‌ని క్రియేట్ చేస్తున్నది. ముఖ్యంగా చికిరీ చికిరీ, రైరైరారా సాంగ్స్ సోషల్ మీడియాలో సంచలనాలుగా మారాయి. ఈ నేపథ్యంలో ఈ సినిమాలోని మూడో పాటను మేకర్స్ నేడు(శనివారం) విడుదల చేయనున్నారు. ఇందులో భాగంగా ఈ పాట ప్రోమోను శుక్రవారం విడుదల చేశారు. 'హెల్లో హెల్లో హెల్లో హెల్లెల్లో.. బావా.. చీరా చొక్కా చిక్కడిపోవాలో..' అంటూ సాగే ఈ పాటను దర్శకుడు బుచ్చిబాబు సానా అత్యంత ఎనర్జిటిక్‌గా, కలర్‌ఫుల్‌గా చిత్రీకరించినట్టు ప్రోమో చూస్తుంటే తెలుస్తున్నది. పవర్‌ఫుల్ డ్రమ్ బీట్స్, క్యాచీ రిథమ్‌తో జాతర వాతావరణాన్ని తలపించేలా ఈ ప్రోమో సాగింది. రామ్‌చరణ్, శ్రుతిహాసన్, జాన్వీ కపూర్‌లపై ఈ పాటను చిత్రీకరించారు.స్టైలిష్ స్టెప్పులతో, అద్భుతమైన స్క్రీన్ ప్రజెన్స్‌తో ముగ్గురూ ఆకట్టుకున్నారు. శనివారం భోపాల్‌లో జరిగే భారీ మ్యూజికల్ ఈవెంట్‌లో పూర్తి పాటను విడుదల చేస్తారు. శివరాజ్‌కుమార్ కీలక పాత్ర పోషించిన ఈ చిత్రంలో జగపతిబాబు, దివేందుశర్మ, బోమన్ ఇరానీ ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: రత్నవేల్, సహ నిర్మాత: ఇషాన్ సక్సేనా, సమర్పణ: మైత్రీ మూవీమేకర్స్, సుకుమార్ రైటింగ్స్, నిర్మాత: వెంకటసతీశ్ కిలారు, నిర్మాణం: వృద్ధి సినిమాస్.

భారత శక్తి
VOICE OF INDIAN
ఆదివారం, మే 24, 2026

# రాజ్యసభలో తగ్గనున్న బలం

**విజయవాడ, (భారత శక్తి)**ఏపీలో రాజ్యసభ ఎన్నికల సందడి మొదలైంది. దేశవ్యాప్తంగా పది రాష్ట్రాల నుంచి ఖాళీ అవుతున్న 24 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు నోటిఫికేషన్ వెలువడింది. జూన్ 18న పోలింగ్ జరగనుంది. అయితే ఏపీ నుంచి ఖాళీ అవుతున్న నాలుగు రాజ్యసభ స్థానాలు కూటమికి ఏకగ్రీవం అయ్యే అవకాశం ఉంది. కూటమికి ఏకపక్ష బలం ఉండడంతో.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఇక్కడ ఛాన్స్ లేదు. ఈ నాలుగు పదవులను కూటమి పార్టీలు పంచుకోనున్నాయి. అయితే ఇప్పటివరకు రాజ్యసభలో ఏపీ నుంచి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఆధిక్యం ఉండేది. కానీ ఇప్పుడు ఆ పార్టీకి ముగ్గురు సభ్యుల బలం తగ్గనుంది. దీంతో నాలుగు స్థానాలు మాత్రమే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మిగలనన్నాయి. అదే టైంలో కూటమికి రాజ్యసభలో బలం ఏడింటికి చేరనుంది.ఏపీ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం 11 మంది ఎంపీలు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 11 మంది సభ్యులతో బలీయమైన శక్తిగా ఉండేది.. 2024 సార్వత్రిక ఎన్నికల సమయానికి ఆ పార్టీ బలం 11 మంది రాజ్యసభ సభ్యులు. సంపూర్ణ బలంతో ఉన్న ఆ పార్టీకి అప్పట్లో ఉపశమనమే. రాష్ట్రంలో శాసనమండలి, కేంద్రంలో రాజ్యసభ ద్వారా రాజకీయం చేయదలచుకుంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. అయితే ఏపీలో కూటమి వచ్చిన తర్వాత చాలామంది రాజ్యసభ సభ్యులు తమ పదవులకు రాజీనామా చేశారు. ఓ నలుగురు రాజ్యసభ సభ్యులు రాజీనామాకు.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలం ఏడుకు తగ్గిపోయింది. చివరకు పార్టీలో నెంబర్ 2 గా ఉన్న విజయసాయిరెడ్డి సైతం రాజీనామా చేశారు. మిగిలిన ఏడింటిలో ముగ్గురు సభ్యులు ఇప్పుడు పదవి విరమణ చేస్తున్నారు. దీంతో వైసిపి బలం నాలుగుకు పడిపోనుంది. అదే సమయంలో కూటమి బలం ఏడుకు చేరుకోనుంది. తెలుగుదేశం పార్టీ 2019 ఎన్నికల్లో ఓడిపోయింది. 23 స్థానాలకు మాత్రమే పరిమితం అయింది. దీంతో వైసిపి శాసనమండలితో పాటు రాజ్యసభలో మెజారిటీ పెంచుకుంటూ వచ్చింది. అదే రాజ్యసభ బలంతో బిజెపికి ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. అయితే ఇప్పుడు బిజెపికి రాజ్యసభలో సంపూర్ణ మెజారిటీ దక్కనుండగా.. ఏపీ నుంచి భర్తీ అయ్యే రాజ్యసభ సీట్లు కూటమి ఖాతాలో పడనున్నాయి. వైసిపి బలం తగ్గిపోయి కూటమి బలం పెరగనుంది. దీంతో జాతీయ స్థాయిలో సైతం వైసీపీ బలం తగ్గిపోతోంది. ఇది ఆ పార్టీకి కాస్త మైనస్.

# గోల్డ్ మైన్ తవ్వకాలకు అంతా సిద్ధం

**కర్నూలు (భారత శక్తి)** కర్నూలు జిల్లా జొన్నగిరి గోల్డ్ మైన్ ప్రారంభానికి సిద్ధమైంది. సీఎం నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా వచ్చే నెల 27న జొన్నగిరి గోల్డ్ మైన్స్ ప్రారంభిస్తారని సమాచారం. ఈ నేపథ్యంలో మంత్రి కొల్లు రవీంద్ర తాజాగా జొన్నగిరిలో పర్యటించారు. టీడీపీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన జొన్నగిరితో పాటుగా అనంతపురం జిల్లా రామగిరిలోనూ గోల్డ్ మైన్స్ ఉన్నట్లు గుర్తించామని వెల్లడించారు. ఈ నేపథ్యంలో అక్కడ కూడా బంగారు ఉత్పత్తిని ప్రారంభించేందుకు అవకాశాలు ఉన్నాయని వార్తలు వస్తున్నాయి.కర్నూలు జిల్లా జొన్నగిరి మండలంలో దేశంలోనే తొలి ప్రైవేట్ గోల్డ్ మైన్ ప్రారంభానికి సిద్ధమైన సంగతి తెలిసిందే. జూన్ నెలలో జొన్నగిరి గోల్డ్ మైన్స్ కార్యకలాపాలు ప్రారంభమవుతాయని సీఎం చంద్రబాబు నాయుడు ఇటీవల ప్రకటించారు. అయితే కర్నూలు జిల్లాలోనే కాకుండా రాయలసీమలోని మరో జిల్లాలో ఉన్న గోల్డ్ మైన్స్ పైనా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దృష్టి పెట్టింది. అనంతపురం జిల్లా రామగిరిలో ఉన్న గోల్డ్ మైన్స్‌పైనా ఏపీ సర్కారు ఫోకస్ పెట్టింది. ఈ విషయాన్ని మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు.గత వైసీపీ ప్రభుత్వంతో పోలిస్తే తమ ప్రభుత్వంలో మైనింగ్ శాఖలో రూ. 4 వేల కోట్లు అధిక రాబడి వచ్చిందన్నారు కొల్లు రవీంద్ర. జియో మైసూర్ గోల్డ్ మైన్స్ లిమిటెడ్ సంస్థ జొన్నగిరిలో బంగారు శుద్ధి, ఉత్పత్తికి సిద్ధమైందని.. ఇందుకోసం అత్యాధునిక టెక్నాలజీతో పనిచేసే యంత్రాలను ఉపయోగించనున్నట్లు తెలిపారు. జొన్నగిరిలో టన్ను మట్టి నుంచి ఒక గ్రాము బంగారం తీయవచ్చన్నారు. ప్రస్తుతం 300 మీటర్ల వరకూ తవ్వకాలు జరిగాయని.. భవిష్యత్తులో 2. కి.మీ లోతు వరకూ తవ్వకాలు జరపనున్నట్లు తెలిపారు. అనంతపురం జిల్లాలోని రామగిరిలో కూడా గోల్డ్ మైన్స్‌ను గుర్తించామని కొల్లు రవీంద్ర వివరించారుమరోవైపు రామగిరి గోల్డ్ మైన్స్ సుమారు 20 ఏళ్ల కిందట మూసేశారు. వైసీపీ ప్రభుత్వంలో గనుల్లో తవ్వకాల కోసం సంస్థలను ఎంపిక చేసే ప్రయత్నాలు జరిగాయి. అయితే ఆ తర్వాత అడుగులు ముందుకు పడలేదు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు సంబంధించి రామగిరితో పాటుగా, రొద్దం మండలంలోని బొక్కసంపల్లి, కదిరి మండలం జౌకుల ప్రాంతాల్లో గోల్డ్ ఫీల్డ్ బ్లాకులు ఉన్నాయి.రామగిరి విషయానికి వస్తే భారత్ గోల్డ్ మైన్ అనే కంపెనీ 1984లో తవ్వకాలు జరిపింది. 2001లో ఆపేసింది. ఏటా 124 కిలోల బంగారం ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో పనులు ప్రారంభించినప్పటికీ.. వివిధ కారణాలతో ఆపేశారు. అయితే బంగారానికి ప్రస్తుతం మార్కెట్లో ఉన్న డిమాండ్.. దిగుమతులపై కాకుండా సొంతంగా ఉత్పత్తి చేసుకోవాలనే ఆలోచనల మధ్య.. ఇప్పుడు మళ్లీ గోల్డ్ మైనింగ్ మీద ప్రభుత్వం దృష్టి సారించినట్లు తెలిసింది.

# ఏపీలో కేంద్ర కేబినెట్ విస్తరణం

**విజయవాడ(భారత శక్తి)** ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే-3 సర్కార్ మూడవ ఏడాదిలోకి అడుగుపెడుతున్న తరుణంలో, కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై ఢిల్లీ నుంచి గల్లీ దాకా ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ కేంద్రంలో కీలక భాగస్వామిగా ఉన్నందున ఈ మార్పులు ఏపీ రాజకీయాలపై ఎలాంటి ప్రభావం చూపుతాయనేది ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. మోదీ ప్రభుత్వం కొలువుదీరి రెండేళ్లు పూర్తవుతున్న వేళ, పాలనలో వేగం పెంచడానికి మరియు, మిత్రపక్షాలకు తగిన ప్రాధాన్యత ఇవ్వడానికి ఈ పునర్వ్యవస్థీకరణ ఒక అవకాశంగా భావిస్తున్నారు. ప్రస్తుతం ఏపీ నుంచి టీడీపీకి చెందిన రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్ కీలక బాధ్యతల్లో ఉన్నారు. కొత్తగా పలువురి పేర్లు తెరపైకివస్తున్నాయి. రాజ్యసభ ఎంపీ పురందేశ్వరిని ఈసారి కేంద్ర మంత్రివర్గంలోకి తీసుకుంటారనే ప్రచారం బలంగా సాగుతోంది. మహిళా రిజర్వేషన్ బిల్లు , 33% మహిళా కోటా అమలు దిశగా అడుగులు వేస్తున్న మోదీ ప్రభుత్వం, అనుభవజ్ఞురాలైన పురందేశ్వరికి కేబినెట్ ర్యాంకు ఇచ్చే అవకాశం ఉందని సమాచారం. టీడీపీకి మరో సహాయ మంత్రి పదవి లేదా ఒక కేబినెట్ ర్యాంకు కేటాయించే అవకాశం ఉంది. ముఖ్యంగా రాయలసీమ ప్రాంతాలకు ప్రాతినిధ్యం వహించే సీనియర్ ఎంపీలకు ఈసారి ఛాన్స్ దక్కవచ్చని భావిస్తున్నారు. చంద్రబాబు నాయుడు తన పరిపాలనా దక్షతతో ఏపీని గాడిన పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో కేంద్రంలో ఏపీకి ఎంత ఎక్కువ మంది మంత్రులు ఉంటే, రాష్ట్ర ప్రాజెక్టులకు నిధులు తీసుకురావడం అంత సులభం అవుతుంది. బీజేపీ కూడా వచ్చే లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఏపీలో తన బలాన్ని పెంచుకోవడానికి టీడీపీని సంతృప్తి పరచడంతో పాటు, తన సొంత నేతలకు ఎలివేషన్ ఇవ్వాలని ప్లాన్ చేస్తోందనికొందరు ప్రస్తుత మంత్రుల పనితీరు ఆధారంగా వారిని తప్పించి కొత్త ముఖాలకు అవకాశం ఇవ్వబోతున్నారు. ఏపీ నుంచి ఇప్పటి వరకు ఉన్న మంత్రుల పనితీరుపై ప్రధాని సంతృప్తిగా ఉన్నారని, కానీ రాష్ట్రానికి ఉన్న ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా అదనపు ప్రాతినిధ్యం ఇచ్చే దిశగా మోదీ ఆలోచిస్తున్నట్లు ఢిల్లీ వర్గాలు చెబుతున్నాయి. జూన్ మొదటి వారంలో జరిగే ఈ మార్పులు ఏపీ రాజకీయ సమీకరణాలను మార్చబోతున్నాయి. ఎవరెవరికి కొత్తగా చాన్సులు వస్తాయో.. ఎవరికి ప్రమోషన్ దక్కుతుందో చూడాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే.

# ఎండల మంట అంతా యూపీలోనే

**లక్నో, (భారత శక్తి)**సరిగ్గా మూడు రోజులక్రితం ఉత్తర ప్రదేశ్ లో 46కు మించిన డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ప్రస్తుత సీజన్ లో ఇదే హైయెస్ట్ రికార్డు అనుకుంటే.. ఇప్పుడు అంతకుమించిన స్థాయిలో టెంపరేచర్ రికార్డు అవుతోంది. భయటికి వెళ్లాలంటేనే భయం కలుగుతోంది. ఒకవేళ బయటికి వెళ్తే క్షేమంగా ఇంటికి వస్తామా అనే ఆందోళన కలుగుతోంది. ఎందుకంటే ఎండలు ఆ స్థాయిలో ఉన్నాయి మరి. ఎండలు ఇలా పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు నరకం చూస్తున్నారు. డీ హైడ్రేషన్ వంటి సమస్యలతో బాధపడుతున్నారు. కొన్ని సందర్భాలలో తీవ్రమైన అనారోగ్యానికి కూడా గురవుతున్నారు. దేశవ్యాప్తంగా నగటున 40 డిగ్రీలకు మించిన ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో జనం బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. అంతేకాదు వడగాలులు కూడా తీవ్రంగా వీచాయి. వడదెబ్బ మరణాలు కూడా నమోదయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా టాప్ హీట్ నగరాలు కూడా మనదగ్గర నమోదవ్వడంయటంటే ఎండ తీవ్రత ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. వడగాలులు వల్ల శుక్రవారం మధ్యాహ్నం వరకే 40 డిగ్రీలకు మించి టెంపరేచర్ రికార్డయింది.ఒడిశాలోని బాలన్ గిర్ ప్రాంతంలో ఏకంగా 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. ఎయిర్ క్వాలిటీ అండ్ వెదర్ ట్రాకర్ ఈ విషయాన్ని బయట పెట్టింది. చంద్రాపూర్(మహారాష్ట్ర), ప్రయాగ్ రాజ్(ఉత్తరప్రదేశ్), ఛత్తీస్ గఢ్, బీహార్, తెలంగాణ, హర్యానా, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాలలో పలు ప్రాంతాలలో రికార్డు స్థాయిలో టెంపరేచర్ నమోదయింది. టాప్ 50 నగరాలలో సగం ఉత్తర ప్రదేశ్ లోనే ఉన్నాయి. ఇప్పటికే వాయువ్య, మధ్యప్రదేశ్ ప్రాంతంలో వడగాలులు చుక్కలు చూపిస్తున్నాయి. అనేక ప్రాంతాల్లో రెడ్, ఆరెంజ్ అలర్ట్ లను వాతావరణ శాఖ జారీ చేసింది. మధ్యాహ్నంవరకు వాతావరణ శాఖ విడుదల చేసిన వరల్డ్ హాట్50 నగరాలలో అన్ని కూడా మనదేశంలోనే ఉన్నాయి. వేడి మాత్రమే కాదు, వడగాలులు తీవ్రత మనదగ్గర అధికంగా ఉంది. వాతావరణంలో మార్పులు, కాలుష్యం, పారిశ్రామికరణ, చెట్లను నరకడం వంటి పరిణామాలు ఎండ వేడిమి పెరగడానికి దోహదం చేస్తున్నాయని పర్యావరణ వేత్తలు చెబుతున్నారు

# ఎట్టకేలకు ఫిలిం కార్పొరేషన్ పదవులు....

**గుంటూరు,(భారత శక్తి)** ఏపీ ప్రభుత్వం సినిమా పదవులను ప్రకటించింది. ఏపీ ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా ప్రముఖ నిర్మాత భరత్ భూషణ్, వైస్ చైర్మన్ గా దర్శకుడు మెహర్ రమేష్ పేరును ప్రకటించింది. మరో 15 మంది డైరెక్టర్లను సినీ రంగం నుంచి ఎంపిక చేసింది. కూటమి అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతోంది. కానీ ఏపీఎఫ్డిసి పాలకవర్గం ఎంపికలో జాప్యం జరిగింది. మధ్యలో రకరకాల పేర్లు కూడా వినిపించాయి. ఎట్టకేలకు ప్రభుత్వం నియామకాలు చేసింది . అయితే గతంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నిర్మాత ఏఎం రత్నం పేరును సూచించారు. అలా సూచించిన సమయంలోనే అది తన అభిప్రాయమని.. ప్రభుత్వానికి కొన్ని రకాల ఆబ్లిగేషన్స్ ఉంటాయని గుర్తు చేశారు. ఇప్పుడు అలానే జరిగింది. తెలంగాణ ప్రభుత్వం ప్రముఖ నిర్మాత దిల్ రాజును ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా నియమించింది. ప్రభుత్వం కొలువు దీరిన వెంటనే ఈ నియామకం జరిగింది. ఏపీలో మాత్రం జాప్యం జరిగింది.ఏపీ ఎఫ్డిసి చైర్మన్ గా నియమితులైన భరత్ భూషణ్ ప్రముఖ నిర్మాత. గాయత్రీ దేవి ఫిలిమ్స్ పేరిట సినిమా పంపిణీ రంగంలో కూడా ఉన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రచార కర్తగా తెరవెనుక సేవలు అందించారు. వైస్ చైర్మన్ గా మెహర్ రమేష్ నియమితులు కాగా ఆయన సైతం నందమూరి, మెగా కుటుంబ దర్శకుడు. వీరిద్దరి కాంబోతో ఏపీ ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ అభివృద్ధి చెందుతుందని అంతా భావిస్తున్నారు. భరత్ భూషణ్ కు చిత్ర పరిశ్రమలో ఉన్న సమస్యలు తెలుసు. పైగా చిత్ర పరిశ్రమ తెలంగాణ నుంచి ఏపీకి కూడా విస్తరించాలని ఆయన భావిస్తున్నారు. మెహర్ రమేష్ కు సైతం పరిశ్రమలు 24 ఫ్రేమ్స్ పై పూర్తిస్థాయి అవగాహన ఉంది. అందరికీ న్యాయం చేస్తారని చెప్పి ఈ ఇద్దరి నియామకం జరిగిందిప్రస్తుతం చిత్ర పరిశ్రమ తెలంగాణలో మాత్రమే ఉంది. కేవలం అవుట్ డోర్ షూటింగ్లకు మాత్రమే ఏపీ పరిమితం అవుతోంది. చిత్ర పరిశ్రమకు అవసరమైన వనరులన్నీ ఏపీలో ఉన్నాయి. షూటింగ్లకు అనువైన ప్రాంతాలు చాలా ఉన్నాయి. ముఖ్యంగా విశాఖపట్నం పర్యాటక ప్రాంతమే కాకుండా చూడదగ్గ ప్రదేశాలు ఎన్నో ఉన్నాయి. విశాఖకు చిత్ర పరిశ్రమ విస్తరించాలన్న ప్రతిపాదన గత టిడిపి ప్రభుత్వం నుంచి అలానే ఉండిపోయింది. కనీసం ఈ ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా అయిన ఆ ప్రయత్నాలు కార్యరూపం దాల్చాల్సిన అవసరం ఉంది. ఏపీ కేవలం సినిమాను పెంచే రాష్ట్రంగా కాకుండా.. ఉద్యోగ ఉపాధి పెంచే పరిశ్రమ విశాఖలో విస్తరించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉంది.

# ఐపీఎల్ టికెట్ల బ్లాక్ దందా.. నలుగురి అరెస్ట్

**హైదరాబాద్ (భారత శక్తి)** ఉప్పల్లో ఐపీఎల్ మ్యాచ్ టికెట్ల బ్లాక్ దందాపై ఎస్ఓటీ పోలీసులు దృష్టి సారిం చారు. సన్రైజర్స్ హైదరాబాద్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య జరగనున్న మ్యాచ్ కోసం అధిక ధరలకు టికెట్లు అమ్ముతున్న నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రూ.15 00 టికెట్లను రూ.8వేలకు పైగా, వీఐపీ బాక్స్ టికెట్లను లక్షల్లో విక్రయిస్తున్నట్లు గుర్తించారు. సీపీ సుమతి ఆదేశాల మేరకు ఈ చర్యలు తీసుకున్నారు. స్వాధీనం చేసుకున్న 5 డిజిటల్ టికెట్లను నిందితుల నుంచి స్వాధీనం చేసుకుని, వారిని ఉప్పల్ పోలీసులకు అప్పగించారు.

# అనకాపల్లిలో ఘోర రోడ్డు ప్రమాదం

**– ఒకరు మృతి**



అనకాపల్లి **(భారత శక్తి)** పట్టణంలో ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఒక వృద్ధురాలని ఢీకొన్న ఆర్టీసీ బస్సు ఘటన స్థలంలోని మృతి చెందిన మహిళ చోడవరం చెందిన వారిగా గుర్తింపు రోడ్డు దాటుతున్న సమయంలో ఈ సంఘటన చోటు చేసుకున్నట్లు స్థానికులు పేర్కొన్నారు మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు సంఘటన స్థలం చేరుకున్న ట్రాఫిక్ పోలీసులు ఈ రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు

# గే (పోలో) యాప్‌లో పరిచయం అనంతరం హత్య

- ఈ నెల 15న సూర్యాపేట జిల్లాలో గణపురం గ్రామంలో యువకుని హత్య
- వివరాలు వెల్లడించిన కోదాడ డిఎస్పి శ్రీనివాసరెడ్డి
- యువకుని హత్య కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు
- సాంకేతిక ఆధారాలతో నేరస్తులను పట్టుకున్న పోలీసులు బృందం

**సూర్యాపేట (భారత శక్తి)**సూర్యాపేట జిల్లా కోదాడ మండలం గణపవరంలో సంచలనం సృష్టించిన యువకుడి హత్య కేసును పోలీసులు వేగంగా ఛేదించారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు కోదాడ డివిజన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఈ నెల 15వ తేదీన కోదాడ రూరల్ పరిధిలోని గణపవరం గ్రామ శివారులో యువకుడు బలుగురి గణేష్ హత్యకు గురైన విషయం తెలిసిందే. కేసును సీరియస్గా తీసుకున్న పోలీసులు క్లూస్ టీమ్, ప్రత్యేక బృందాల సహాయంతో సాంకేతిక ఆధారాలు సేకరించి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా గరిడేపల్లి మండలం కొత్తగూడెం గ్రామానికి చెందిన పగిల్ల ఉదయ్ కిరణ్ను అదుపులోకి తీసుకుని విచారించగా హత్యకు సంబంధించిన కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. వ్యక్తిగత ఫోటోల విషయంలో ఏర్పడిన విభేదాల కారణంగా ప్రధాన నిందితుడు బర్రెంకుల సోమేష్ తన స్నేహితుడి సహాయంతో మృతుడిని నిర్మానుష్య ప్రాంతానికి పిలిపించి దారుణంగా హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో సహకరించిన మరో ఇద్దరిని కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. సంఘటన స్థలం నుంచి రక్తపు మరకల రాయి, కత్తి, మొబైల్ ఫోన్లు మరియు ఇతర ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు సోమేష్ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు..

# కొడుకుతో సహ అర్చకుడు ఆత్మహత్య

**జనగామ (భారత శక్తి)**జనగామ జిల్లాలో విషాదం నెలకొంది.భార్య మరణం తట్టుకోలేక మానసిక ఎదుగుదల లేని కొడుకుతో కలిసి అర్చకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. తాను పూజలు చేసే ఆలయంలోని కోనేరులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జనగామ జిల్లా లింగాలఘనపురం మండలం బండలగూడెం గ్రామంలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో గత 20 ఏళ్లుగా పూజారిగా పని చేస్తూ, వరయూరు లక్ష్మీనరసింహ చార్యులు(54) అనే అర్చకుడు, మానసిక ఎదుగుదల లేని కొడుకు పవనకుమారాచార్యులు(25)తో కలిసి ఉంటున్నాడు.గత నెల 16వ తేదీన తన భార్య శ్రీదేవి మరణించిన రోజు నుండి తీవ్ర ఆందోళనలో ఉండేవాడని, ఏనాటికైనా తన కొడుకుతో కలిసి ఆలయ కోనేరులో దూకి చనిపోతామని చెప్పేవాడని స్థానికులు తెలిపారు. రెండు రోజుల క్రితం కొడుకుతో కలిసి ఆలయ కోనేరులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం సాయంత్రం మృతదేహాలు కోనేరులో తేలాయి. పోలీసులు స్థానికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# బీఆర్ఎస్ నాయకుడు చింతలపాటి మధు దారుణ హత్య



**సూర్యాపేట (భారత శక్తి)**బీఆర్ఎస్ నేత చింతలపాటి మధును దుండగులు దారుణంగా హతమార్చారు. మూడు ముక్కలుగా నరికి గోనె సంచిలో కుక్కి ఎస్సారెస్పీ కాలువలో పడేసారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని యార్కారం గ్రామంలో ఘటన జరిగింది. ఓ హత్య కేసులో సాక్షిగా ఉన్నందుకు కాంగ్రెస్ నేతలు దారుణంగా హత్య చేసారని మృతుడి కుటుంబికులు ఆరోపించారు. 2018లో బీఆర్ఎస్ సర్పంచ్ బీఆర్ఎస్ నాయకుడిని ఓటెద్దు వెంకన్నను దారుణంగా హతమార్చిన కేసులో సాక్షిగా చింతలపాటి మధు వున్నాడు.కేసు విచారణ తుది దశకు చేరుకోగా, మధు సాక్ష్యం చెప్తే తమకు యావజ్జీవ శిక్ష తప్పదని భావించి మధును మిద్దె కిరణ్, మారేపల్లి సతీష్, కుంటిగోర్ల శ్రీను, కట్టబోయిన మల్లయ్య అనే వాళ్లు హతమార్చారని ఆరోరపించారు. యార్కారం గ్రామంలో బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ గూండాలు వరుస దాడులకు పాల్పడుతున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని స్థానిక బీఆర్ఎస్ నాయకులు మండిపడుతున్నారు.

# బీజేపీ ఇంకో 20 ఏళ్లు...

**న్యూఢిల్లీ,(భారత శక్తి)** ఇటీవల తమిళనాడు అసెంబ్లీకి ఎన్నికలు జరిగాయి. అన్ని సంస్థలు డీఎంకే గెలుస్తుందని ముందస్తు ఫలితాలలో చెప్పేశాయి. కానీ ఒక్క యాక్సిస్ మై ఇండియా మాత్రం టీవీకే గెలుస్తుందని చెప్పింది. అంతే కాదు, తమిళనాడు ఓటర్లు విజయ్ ని ముఖ్యమంత్రిగా చూడాలనుకుంటున్నారని ఆ సంస్థ వ్యాఖ్యానించింది. పైగా డీఎంకే అధినేత స్టాలిన్ ఓడిపోతారని చెప్పారు. దీంతో యావత్ దేశం మొత్తం సంచలనంగా చూసింది. అంతకు మించి ఆశ్చర్యపోయింది.యాక్సిస్ మై ఇండియా సీఈవో ప్రదీప్ గుప్తా ఈసారి అంతకుమించిన సంచలన విషయాన్ని బయటపెట్టారు. 'పరిపాలన బాగున్నంత కాలం ప్రజలు పార్టీకి ఓటేస్తారు. అధికారాన్ని కట్టబెడతారు. ఇందులో ఏమాత్రం అనుమానం లేదు. కాంగ్రెస్ దేశరాజకీయాలను చాలా సంవత్సరాల పాటు ఏలింది. 1977 వరకు కాంగ్రెస్ ప్రస్థానం అద్భుతంగా సాగింది. ఇప్పుడు ఆ పార్టీ పరిస్థితి ఎలా ఉందో చూస్తున్నాం కదా' అంటూ ప్రదీప్ వ్యాఖ్యానించారు.ఒక రాజకీయ తరం 20 ఏళ్ల వరకు ఉంటుంది. ఆ చక్రం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంటుంది. 2014లో భారతీయ జనతా పార్టీ 1.0 మొదలైంది. 2.0 పూర్తయింది. ఇప్పుడు 3.0 నడుస్తోంది. గవర్నెన్స్ బాగున్నంత వరకు ఏమీ కాదు. ఒకవేళ తేడా కొడితే ఇబ్బంది ఎదురవుతుంది. బీజేపీకి ఇలాంటి పరిస్థితి ఎదురవుతుందో లేదో చెప్పలేం. కానీ బీజేపీ రాజకీయ పరాక్రమం ఇంకా 20 ఏళ్లు ఉండే అవకాశం ఉంది. ఇప్పటికైతే ప్రజల్లో ఎన్డీఏ మీద భారీ అంచనాలు ఉన్నాయి. వచ్చేరోజుల్లో ఎన్డీఏ గొప్పగా పరిపాలించాలని' ప్రదీప్ అభిప్రాయపడ్డారు.ప్రదీప్ మాట్లాడిన మాటలను బీజేపీ స్వాగతిస్తోంది. ఆయన దేశవ్యాప్తంగా ఉన్నవాస్తవ పరిస్థితిని బయటపెట్టారని బీజేపీ నాయకులు అంటున్నారు. మరోవైపు కాంగ్రెస్ నాయకులు ప్రదీప్ మీద తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. దేశం ఇప్పటికే ఎమర్జెన్సీలో ఉందని, మరో 20 ఏళ్లు అంటే ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చని కాంగ్రెస్ నాయకులు అభిప్రాయపడుతున్నారు. ప్రదీప్ బీజేపీకి అనుకూలంగా మాట్లాడి ఏం చెప్పదలుచుకున్నారో తెలుస్తోందని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు

# తమిళనాడు, కేరళలో ఏఐ మంత్రులు..

## – అప్ డేట్ కేబినెట్స్

**బెంగళూరు,(భారత శక్తి)** కేరళ , తమిళనాడు ప్రభుత్వాలు సాంకేతిక రంగంలో మరో విప్లవాత్మక అడుగు వేశాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖలను ఏర్పాటు చేసి మంత్రులను నియమించారుకేరళ, తమిళనాడుల్లో కొత్త ప్రభుత్వాలు ఏర్పాటయ్యాయి. కేరళ సీఎం సతీశన్, తమిళనాడు సీఎం విజయ్ సాంకేతికత వేగంగా మారుతున్న తరుణంలో, కేవలం ఐటీ శాఖకు పరిమితం కాకుండా ఏఐ కోసం ప్రత్యేక పోర్ట్‌ఫోలియోను కేటాయించడం ద్వారా తమ దూరదృష్టిని చాటుకున్నారు. తమిళనాడు మంత్రివర్గ విస్తరమలో వేళచ్చేరి నియోజకవర్గ ప్రతినిధి కుమార్‌కు ఈ బాధ్యతలు అప్పగించడం ద్వారా యువతకు ,టెక్నాలజీకి పెద్దపీట వేసినట్లయింది. భవిష్యత్తులో ఉద్యోగాల సృష్టి, డేటా సెంటర్లు , స్మార్ట్ గవర్నెన్స్‌లో ఈ శాఖ కీలక పాత్ర పోషించనుంది.కొత్తగా నియమితులైన ఏఐ మంత్రుల ముందు అనేక సవాళ్లు ఉన్నాయి. తమిళనాడు ఏఐ మంత్రి ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత వేగంగా చేరవేయడానికి ఏఐ టూల్స్‌ను ఉపయోగించడం, భాషా అడ్డంకులను తొలగించడానికి తమిళ భాషా ఏఐ మోడల్స్ ను అభివృద్ధి చేయడం ఈ శాఖ ప్రధాన లక్ష్యం. ముఖ్యంగా వ్యవసాయం, విద్య, వైద్య రంగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహాయంతో వినూత్న మార్పులు తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇది కేవలం సాంకేతిక శాఖ మాత్రమే కాదు, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టించే ఇంజిన్‌గా మారబోతోంది.ప్రపంచవ్యాప్తంగా టెక్ దిగ్గజాలు ఏఐ రంగంలో భారీ పెట్టుబడులు పెడుతున్నాయి. తమిళనాడును ఏఐ హబ్‌గా మార్చడం ద్వారా అంతర్జాతీయ కంపెనీలను ఆకర్షించడం మంత్రి కుమార్ ప్రాథమిక బాధ్యత. ఇప్పటికే చెన్నై ఐటీ రంగానికి నిలయంగా ఉంది, ఇప్పుడు ప్రత్యేక ఏఐ శాఖ ద్వారా స్టార్టప్‌లకు ప్రోత్సాహకాలు ఇవ్వడం, ఏఐ ఎకోసిస్టమ్‌ను బలోపేతం చేయడం ద్వారా లక్షలాది మంది సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లకు కొత్త అవకాశాలు దక్కే అవకాశం ఉంది. ఏఐ వల్ల ఉద్యోగాలు కోల్పోతారనే ఆందోళనల మధ్య, ఈ మంత్రిత్వ శాఖ మానవ వనరులను రీ-స్కిల్లింగ్ చేయడంపై దృష్టి సారించనుంది. కాలేజీ స్థాయి నుంచే విద్యార్థులకు ఏఐ లో శిక్షణ ఇవ్వడం, నిరుద్యోగులను ఏఐ నిపుణులుగా మార్చడం వంటి కీలక నిర్ణయాలు ఈ శాఖ పరిధిలోకి వస్తాయి. మంత్రి కుమార్ తన బాధ్యతలను ఎలా నిర్వహిస్తారు? ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులను తమిళనాడుకు ఎలా అన్వయిస్తారు? అనేది ఇప్పుడు దేశవ్యాప్తంగా ఆసక్తికరంగా మారింది. కేరళ ఇప్పటికే ఏఐ కాన్క్లేవ్‌లు నిర్వహిస్తూ ఈ రంగంలో ముందుండాలని చూస్తోంది. ఇప్పుడు తమిళనాడు కూడా పోటీలోకి రావడంతో దక్షిణాది రాష్ట్రాలు టెక్నాలజీ పరంగా దేశానికే దిక్సూచిగా మారుతున్నాయి. ఏఐ శాఖ ద్వారా పారదర్శకమైన పాలనను అందిస్తూనే, ప్రైవేట్ భాగస్వామ్యంతో సరికొత్త ప్రాజెక్టులకు కుమార్ శ్రీకారం చుట్టబోతున్నారు. ఈ ప్రయోగం విజయవంతమైతే మరిన్ని రాష్ట్రాలు ఇదే బాటలో నడిచే అవకాశం ఉంది. నలగండ్లలో ఆకాశాన్ని తాకుతున్న భూముల ధరలు**హైదరాబాద్,** నలగండ్ల రియల్ ఎస్టేట్ రంగం మధ్య తరగతి అంచానాలు దాటి ఆకాశాన్ని తాకుతోంది. అమ్మకాలు లేక పోయినా ధరలు దిగనంటున్నాయి. ప్రధాన రహదారికి ఆనుకున్న స్థలాలకు డిమాండ్ పీక్స్ కు చేరుకుంది.ఓవైపు గచ్చిబౌలి, మరోవైపు బీహెచ్ఈఎల్, లింగంపల్లి మధ్యలో రియల్ వెలుగులతో ఎగసిపడుతున్న ప్రాంతం నలగండ్ల. ఓ పదేళ్ల క్రితం నలగండ్లలో ఇల్లు కొనాలి అంటే వామ్మో అంత దూరం ఎందుకులే అనుకునేవాళ్లు. ఇప్పుడు అదే నలగండ్లలో వామ్మో సొంతిల్లు కొనగలమా అంటూ నోరెళ్ల బెట్టే పరిస్థితి వచ్చింది. అంతలా పదేళ్ల కాలంలో చూస్తూ చూస్తూనే నలగండ్ల రియల్ రంగం ఊహించని స్థాయిలో ఎదిగింది.నలగండ్ల సమీపంలో ముళ్లపొదలు, నిర్మాణుష్య ప్రాంతాలు సైతం బుల్డోజర్లతో తవ్వి ప్రధాన రహదారులుగా మార్చేస్తున్నారు. తల్లిదండ్రులు హైదరాబాద్‌లో ఉంటూ విదేశాలలో వారి పిల్లలు స్థిరపడ్డారంటే కచ్చితంగా నలగండ్లలో కనీసం ఓ వందగజాల స్థలం లేదా లగ్జరీ అపార్ట్మెంట్‌లో ఖరీదైన ఫ్లాట్ ఇప్పటికే కొనేసి ఉంటారు. ఒకప్పుడు చేతినిండా బ్లాక్ మనీ ఉన్నవాళ్లు సైతం ఇలా నలగండ్లలో కారుచౌకకు భూములు భారీగా కొనేశారు. ఇప్పుడు అవే భూములు బంగారాన్ని తలదన్నేలా డిమాండ్ పలుకుతున్నాయి.విశాలమైన రోడ్లు, గ్రీనరీ మధ్యలో కాలనీలతో కాలుష్యానికి దూరంగా ఉన్న నలగండ్ల,రియల్ ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. విదేశాల?లో ఉద్యోగాలు, బ్లాక్ మనీ పెట్టుబడిగా పెట్టేవారికి నల్లగండ్ల అనుకూల ప్రాంతంగా మారింది.నలగండ్లలో స్థలాల రేట్లు ఇలా ఉన్నాయి. ప్రాంతం/లేఅవుట్ రకం సగటు గజం ధర 100 గజాలల అంచనా ధర వెంచర్ లోపలి ప్లాట్లు లక్ష నుంచి లక్షన్నర కోటి నుంచి కోటిన్నర పెట్టాలి. హుడా లే అవుట్స్లక్షన్నర పైమాటే కోటిన్నర పైగా పెట్టాలిరోడ్డుకు సమీపంలో ఉన్న ప్లాట్లురెండు లక్షల పై మాటేరెండు కోట్లు ఖర్చు చేయాలిమెయిన్ రోడ్డుకు ఆనుకొని ప్లాట్ ఉంటే మూడు లక్షలపై మాటే మూడు కోట్లపైగా పెట్టాలి.నలగండ్ల పరిసర ప్రాంతాల్లో గజం భూమి కొనాలంటే అక్షరాల లక్ష పెట్టాల్సిందే. వందగజాలు జాగా మీ సొంతం కావాలంటే కోటికిపైగా చెల్లించుకోవాల్సిందే. అదికూడా వెంచర్ కాస్త లోపలకు ఉన్న ప్లాట్లు మాత్రమే మీకు దక్కుతాయి. అలా కాదని రోడ్డు కాస్త సమీపంలో వంద గజాలు భూమి కొనాలనుకుంటే తక్కువలో తక్కువగా 2కోట్లు పైమాటే.తెల్లాపూర్, గచ్చిబౌలి వంటి ప్రాంతాలు నలగండ్లకు దగ్గరగా ఉండంతో ఐటీ ఉద్యోగులు నలగండ్లపై కన్నేశారు. ట్రాఫిక్ కష్టాల లేకుండా త్వరగా ఆఫీసులకు వెళ్లాంటే నలగండ్ల అనువైన ప్రాంతం కావడంతో గత రెండేళ్ల కాలంలో ఇక్కడ రియల్ భూమ్ పిక్స్‌కు చేరుకుంది. ఇక్కడున్న హుడా లేవుట్‌లో గజం భూమి లక్షలకు పైమాటే అదే రోడ్డుకు సమీపంలో ఉంటే రెట్టింపు ధరలు పలుకుతున్నాయి.గోపనపల్లి పరిసర ప్రాంతాల నుంచి గచ్చిబౌలి వచ్చేవారికి నల్లగండ్ల షార్ట్ కట్‌గా మారింది. గత ఏడాది కాలంగా ఇక్కడ రియల్ రంగం అత్యంత వేగంగా పరుగులు పెడుతోంది. నలగండ్ల రియల్ ఎస్టేట్ రంగం మధ్య తరగతి అంచానాలు దాటి ఆకాశాన్ని తాకుతోంది. అమ్మకాలు అంతలా లేక పోయినా ధరలు మాత్రం కిందికి దిగనంటున్నాయి. సొంత ఇంటి కల సాకారం చేసుకోవాలంటే, అపార్ట్మెంట్ లలో ఫ్లాట్లు కొనండి కానీ, ఇండివిడ్యువల్ హౌస్ అంటూ కనీసం ఆలోచనలకు కూడా రానివ్వొద్దంటున్నారు

స్థానికులు.ప్రధాన రహదారికి ఆనుకున్న స్థలాలకు డిమాండ్ పీక్స్ కు చేరుకుంది. వీటిలో గజం స్థలం 3లక్షలు, వంద గజాలు మూడు కోట్లకుపైగా అమ్మకాలు సాగుతున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. రియల్ ఎస్టేట్ దెబ్బకు నలగండ్ల సమీప ప్రాంతాల్లో ఇంటి అద్దెలు కూడా విపరీతంగా పెరిగిపోయాయి. ఒకప్పుడు మహా అయితే నెలకు 5వేలు అద్దె ఉండే సింగిల్ బెడ్ ఇళు ఇప్పుడు 15వేలు దాటింది. అదే అపార్ట్మెంట్‌లో మంచి ఫ్లాట్‌లో అద్దెకు ఉండాలంటే అర లక్ష నెలకు అద్దెకు చెల్లించాల్సిందే.ఐటీ ఉద్యోగులకు పెట్టుబడి పెట్టేందుకు అత్యంత అనుకూలమైన ప్రాంతం కావడంతో హైదరాబాద్ నగరంలో నలగండ్ల రియల్ భూమ్ తగ్గేదే లే అన్నట్లుగా దూసుకుపోతోంది. నల్లగండ్లకు సమీపంలోనే ప్రధాన కార్యాలయాలు ఉండటంతో ఇక్కడ ఐటీ ఉద్యోగులు సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. సొంత ఇళ్లు, ఫ్లాట్లు, స్థలాలు ఇలా కనిపిస్తే కొనేద్దాం అనేంతలా ఐటీ ఉద్యోగులు నల్లగండ్లపై ఆశక్తి చూపడంతో నల్లగండ్ల చుట్టు ప్రక్కల ప్రాంతాలు సైతం వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి.

# అడ్వకేటుపై హత్యాయత్నం

**హైదరాబాద్ (భారత శక్తి)** నాంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మాసబ్ ట్యాంక్లో అడ్వకేట్ మొహినుద్దీన్ హత్యా ప్రయత్నం స్థానికంగా కలకలం రేపింది.

తన కారు వద్దకు వెళ్లి డోర్ తీస్తుండగా వెనుక నుంచి ఓ మరో కారులో దుండగులు వేగంగా వచ్చి మొహినుద్దీన్ ఢీకొట్టి పారిపోయారు. గమనించిన స్థానికులు వెంటనే క్షతగాత్రుడిని హాస్పిటల్కు తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది

